www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ధాన్యం కొనుగోలులో
దళారులొద్దు

రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలి.. 24-48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా.. దీపం-2పై మరింత ఫోకస్: మంత్రి నాదెండ్ల

శుక్రవారం | 6-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 231 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి మ. 12.08 తదుపరి షష్ఠి; నక్షత్రం: శ్రవణం సా. 5.18 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా. 9.13-10.47; దుర్ముహూర్తం: ఉ. 8.48-9.32, మ. 12.28-1.12; అమృతఘడియలు: ఉ. 6.57-8.32; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చిన్న నగరాల్లో రియల్టీ జోరు



- జైపూర్‌లో గరిష్ఠంగా 65 శాతం వృద్ధి
- 51 శాతంతో దక్షిణాదిలో గుంటూరు టాప్

న్యూఢిల్లీ: ద్వితీయ శ్రేణి నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ ఏడాది జనవరి-సెప్టెంబరు నెలల మధ్య కాలంలో ప్రారంభించిన గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో ఇళ్ల ధరలు 23 నగరాల్లో 65 శాతం మేరకు పెరిగాయి. ఐదు నగరాల్లో మాత్రం తగ్గాయి. రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ ప్రాప్ ఈక్విటీ సంకలనం చేసిన గణాంకాల ప్రకారం జైపూర్‌లో ఇళ్ళ సగటు ధర గరిష్ఠంగా 65 శాతం పెరిగింది. అక్కడ చదరపు అడుగు ధర రూ.6,979 పలుకుతోంది. గత ఏడాది ఇదే కాలంలో సగటు ధర రూ.4,240 ఉంది. లఖనవూలో అతి తక్కువగా ఒక శాతం పెరిగింది. దక్షిణ భారతదేశానికి వస్తే గుంటూరులో ధర అత్యధికంగా 51 శాతం పెరిగింది. ధరల పెరుగుదల విశాఖపట్టణంలో 29 శాతం, విజయవాడలో 21 శాతం ఉంది.

నాణ్యమైన జీవనానికి ఆరాటమే కారణం

ప్రజలు నాణ్యమైన ఇళ్లలో నివశించడానికి ఆసక్తి ప్రదర్శించడమే ధరల్లో పెరుగుదలకు కారణమంటున్నారు. ఆ నగరాల్లో తక్కువ ధరలకు భూమి అందుబాటులో ఉండడంతో పాటు కనెక్టివిటీ మౌలిక వసతులు భారీగా అభివృద్ధి చెందుతూ ఉండడం వల్ల డెవలపర్లు, కార్పొరేట్లు, ఆర్థిక సంస్థలు, ఇన్వెస్టర్ల దృష్టి ఈ నగరాలపై పడిందని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈఓ సమీర్ జసూజా అన్నారు. దీనికి తోడు ప్రీమియం, లగ్జరీ గృహాలకు ఈ నగరాల్లో డిమాండు పెరిగిందని ఆయన చెప్పారు. మంచి సౌకర్యాలు గల ఇళ్ల విషయంలో ఎక్కువ పెట్టేందుకైనా ప్రజలు వెనుకాడడంలేదని, ఇదే ధరల పెరుగుదలకు దారి తీసిందని రాయల్ గ్రీన్ రియల్టీ ఎండీ యశాంక్ వాసన్ అన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి ఇది నిదర్శనమని స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ ఎండీ కీర్తి చిలుకూరి చెప్పారు.

ONEPLUS
మూడేళ్లలో రూ.6,000 కోట్ల పెట్టుబడులు

50 శాతం పెరగనున్న సర్వీస్ సెంటర్లు

న్యూఢిల్లీ: చైనా స్మార్ట్ ఫోన్ల కంపెనీ వన్‌ప్లస్ భారత్‌లో వ్యాపార కార్యకలాపాలను ప్రాజెక్ట్ స్టార్‌లైట్ పేరుతో మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం ఏటా రూ.2,000 కోట్ల చొప్పున వచ్చే మూడేళ్లలో రూ.6,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనుంది. అదే విధంగా 2026 జూన్ నాటికి సర్వీసుకేంద్రాల సంఖ్యను ప్రస్తుత స్థాయి నుంచి 50 శాతం పెంచుతామని కంపెనీ సీఈఓ రాబిన్ లూ తెలిపారు. ఇప్పుడున్న రిటైల్ స్టోర్లలో సగాన్ని మరింత అప్‌గ్రేడ్ చేయాలని కూడా కంపెనీ నిర్ణయించింది. గత ఏడాదితో పోలిస్తే కంపెనీ తన సర్వీస్ సెంటర్లను ఇప్పటికే 22 శాతం పెంచుకుంది. కంపెనీ యాజమాన్యంలోని ప్రత్యేక సర్వీస్ సెంటర్ల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 11 శాతం పెరిగింది. ఖాతాదారులకు మరింత మన్నికైన వస్తువులు, సేవలు అందించడం, భారత్‌లో తాము అందించే వస్తువుల్లో ఈ దేశానికి మాత్రమే అవసరమైన వినూత్నమైన ప్రత్యేక ఫీచర్లు జోడించడం ప్రాజెక్టు స్టార్‌లైట్ లక్ష్యమని వన్‌ప్లస్ ఇండియా తెలిపింది.

పని చేయడానికి మంచి కంపెనీగా సియెల్ ఎనర్జీ

నెల్లూరు: సియెల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఉద్యోగులు పని చేయడానికి అనుకూలమైన మంచి కంపెనీగా సర్టిఫికేషన్ పొందింది. తమకు ఈ సర్టిఫికేషన్ లభించినందుకు ఆనందంగా ఉన్నదని కంపెనీ సీఈఓ రాఘవ్ త్రివేది అన్నారు. ఉద్యోగులే తమ ఆస్తి అని ఎల్లప్పుడూ భావిస్తామంటూ వారి అభివృద్ధి, సంక్షేమంపై తాము మరింత ఇన్వెస్ట్ చేయనున్నట్టు ఆయన చెప్పారు.

బిట్‌కాయిన్ 1,00,000 డాలర్లు



'బిట్‌కాయిన్' విలువ తొలిసారిగా 1,00,000 డాలర్లు దాటేసింది. క్రిప్టో పరిశ్రమపై నియంత్రణలను సడలిస్తామని అమెరికా కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. అలాగే, క్రిప్టోకరెన్సీ అడ్వకేట్ పాల్ అట్కిన్స్‌ను అమెరికన్ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్' (సెక్) తదుపరి చైర్మన్‌గా నియమిస్తానన్నారు. దాంతో బిట్‌కాయిన్ సహా మిగతా క్రిప్టోల విలువ భారీగా పెరిగింది. గత నెల 5న జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపుతోనే బిట్‌కాయిన్ ర్యాలీ మొదలైంది. ఎన్నికల రోజున 69,374 డాలర్ల స్థాయిలో ఉన్న బిట్‌కాయిన్ విలువ వేగంగా పెరుగుతూ వచ్చింది. బుధవారం ట్రేడింగ్‌లో ఒకదశలో 1,03,713 డాలర్లకు ఎగబాకింది. ట్రంప్ గతంలో క్రిప్టో కరెన్సీలపై అయిష్టంగానే ఉన్నప్పటికీ, ఎన్నికల ముందు అనూహ్యంగా మనసు మార్చుకున్నారు. అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. అంతేకాదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు.

కీలక మైలురాళ్లు

2009: ఎలాంటి విలువ లేకుండా బిట్‌కాయిన్ ఆవిర్భావం
2010 అక్టోబరు: తొలిసారిగా 10 సెంట్లు (0.10 డాలరు) దాటిన విలువ
2011 జూన్: 30 డాలర్లకు చేరుమైనప్పటికీ ఏడాది చివరినాటికి మళ్లీ 5 డాలర్లకు డౌన్
2013 నవంబరు: తొలిసారిగా 1,000 డాలర్లకు చేరిక
2017 మే: 2,000 డాలర్లు దాటిన విలువ
2020 డిసెంబరు: దాదాపు 20,000 డాలర్లకు చేరువైన కరెన్సీ
2024 మార్చి: తొలిసారిగా 70,000 డాలర్లకు చేరిక
2024 నవంబరు: ట్రంప్ ఎన్నికతో 80,000, 90,000 డాలర్ల మైలురాళ్లను దాటిన ధర
2024 డిసెంబరు: తొలిసారిగా 1,00,000 డాలర్ల ఎగువన ముగింపు

కొనుగోళ్ల వైల్డ్ ఫైర్

- 5 రోజుల్లో సెన్సెక్స్ 2,722 పాయింట్లు అప్
- రూ.15.18 లక్షల కోట్లు పెరిగిన సంపద



ముంబై: స్టాక్‌మార్కెట్లో కొనసాగుతున్న కొనుగోళ్ల జాతరలో బుల్ ఉత్సాహంతో రంకెలేస్తోంది. దేశీ, విదేశీ ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడుల దన్నుతో ఈక్విటీ సూచీలు వరుసగా ఐదో రోజూ లాభపడ్డాయి. 5 సెషన్లలో సెన్సెక్స్ ఏకంగా 2,722.12 పాయింట్లు ఎగబాకింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.15.18 లక్షల కోట్లు పెరిగి రూ.458.17 లక్షల కోట్లకు (5.41 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఇంట్రాడేలో 82,000 స్థాయికి సెన్సెక్స్: సెన్సెక్స్ గురువారం ఒకదశలో 1,361.41 పాయింట్లు పెరిగి 82,317.74 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో మదుపరులు కొంత లాభాల స్వీకరణకు పాల్పడటంతో 809.53 పాయింట్ల లాభంతో 81,765.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 240.95 పాయింట్ల వృద్ధితో 24,708.40 వద్ద ముగిసింది. సూచీలకు ఇది దాదాపు రెండు నెలల గరిష్ఠ ముగింపు స్థాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.27 శాతం వరకు లాభపడ్డాయి.

నేటి మార్కెట్ ర్యాలీకి కారణాలు

- అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ఆశావహ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో యూఎస్ స్టాక్ సూచీలు బుధవారం ర్యాలీ సాధించాయి. డౌజోన్స్ తొలిసారిగా 45,000 మైలురాయిని దాటింది. ఇది దేశీయంగా ఐటీ, టెక్నాలజీ షేర్లలో కొనుగోళ్లకు దోహదపడింది.
- శుక్రవారం ప్రకటించనున్న ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాల్లో భాగంగా ఆర్‌బీఐ నగదు నిల్వ నిష్పత్తి (సీఆర్ఆర్) తగ్గించవచ్చన్న అంచనాలు బ్యాంకింగ్, ఆర్థిక సేవలతోపాటు వడ్డీ ప్రభావిత రంగాల షేర్లకు గిరాకీ పెంచాయి.
- గతనెలలో భారీగా అమ్మకాలకు పాల్పడిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ నెలలో మళ్లీ కొనుగోళ్ల జోరును పెంచడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది.

హైదరాబాద్‌లో 25 ఎకరాలు కొన్న మైక్రోసాఫ్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ సమీపంలోని మేకగూడలో 25 ఎకరాల భూమిని నాట్కో ఫార్మా, టైమ్ క్యాప్ ఫార్మా ల్యాబ్ నుంచి కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.181 కోట్ల వరకు చెల్లించింది. మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పేరు మీద కంపెనీ ఈ భూమిని కొనుగోలు చేసింది. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగిన ఈ లావాదేవీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంపెనీ ఇందుకోసం భూమి ధరతో పాటు స్టాంప్ డ్యూటీ కింద రూ.9.96 కోట్లు, రిజిస్ట్రేషన్ ఛార్జీల కింద రూ.3.62 కోట్లు, ఇతర ఛార్జీల కింద మరో రూ.18 లక్షలు చెల్లించినట్టు సమాచారం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,890	71,400	1,01,000
ముంబై	76,450	70,030	91,210

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	విజయవాడ	99
వరంగల్	85	గుంటూరు	96
కరీంనగర్	85	ఒంగోలు	96
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	88
కర్నూలు	85	నెల్లూరు	88
విశాఖపట్నం	95	అనంతపురం	88
గోదావరి	99		

సన్‌టెక్ కొత్త బ్రాండ్ 'ట్రూజోన్ సోలార్'

బ్రాండ్ అంబాసిడర్‌గా మహేశ్ బాబు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : భవనాల పైకప్పులపై ఈపీసీ పద్ధతిలో రూఫ్ టాఫ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ 'ట్రూజోన్ సోలార్' పేరుతో కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఈ బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు వ్యవహరిస్తారని కంపెనీ వ్యవస్థాపకులు, ఎండీ సీహెచ్ భవానీ సురేశ్ చెప్పారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన ఈ కంపెనీ తన సేవలను వచ్చే ఏడాది మార్చి నాటికి మధ్యప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలకు విస్తరించనుంది. తమ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా రూఫ్ టాప్ సోలార్ ప్లాంటు ఏర్పాటు, సబ్సిడీ, బ్యాంకు రుణాలు, రిపేర్ల వంటి సమస్త సేవలు పొందవచ్చని ఆయన చెప్పారు.

భవిష్యత్ భేష్ : పర్యావరణ స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో సౌర విద్యుత్‌కు మంచి భవిష్యత్ ఉందని సురేశ్ అన్నారు. సౌర విద్యుత్ ధరలు గత నాలుగేళ్లలోనే 70 శాతం వరకు తగ్గినట్టు తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలతో రూఫ్ టాప్ ప్లాంట్ల ఏర్పాటు మరింత ఊపందుకున్నట్టు చెప్పారు. తమ సంస్థ నివాస భవనాలతో పాటు, కార్యాలయాలు, ఫ్యాక్టరీలపైనా రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తుందన్నారు.

ఈక్విటీ మార్కెట్లో క్లోజ్ యాక్షన్ సెషన్

మధ్యాహ్నం 3.30 నుంచి 3.45 వరకు.. — సెబీ ప్రతిపాదన

న్యూఢిల్లీ: ఈక్విటీ క్యాష్ మార్కెట్లో షేర్ల ముగింపు ధరను నిర్ణయించేందుకు క్లోజ్ యాక్షన్ సెషన్ (సీఏఎస్) విధానాన్ని ప్రవేశపెట్టాలని సెబీ గురువారం ప్రతిపాదించింది. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో షేర్ల ముగింపు ధరను ట్రేడింగ్ సెషన్ చివరి 30 నిమిషాల వాల్యూమ్ వెయిటెడ్ యావరేజ్ ప్రైస్ (వీడబ్ల్యూఏపీ) ఆధారంగా నిర్ణయిస్తున్నారు. ప్రస్తుత విధానంలో సహేతుక ధరను నిర్ణయించగలిగినప్పటికీ, ముగింపు ధర వద్ద ట్రేడింగ్‌కు అనుమతించదు. సీఏఎస్ విధానం మార్కెట్ క్లోజింగ్ సమయంలో..ముఖ్యంగా ఇండెక్స్ రీబ్యాలెన్సింగ్, డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజుల్లో ఊగిసలాటలను తగ్గించనుంది. మార్కెట్లో ట్రేడింగ్ ముగిశాక 15 నిమిషాల పాటు (మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 3.45 గంటల వరకు) ప్రత్యేక సెషన్‌గా సీఏఎస్‌ను నిర్వహించాలని సెబీ ప్రతిపాదించింది. తాజా ప్రతిపాదనలపై ఈనెల 26 కల్లా అభిప్రాయాలు తెలుపాల్సిందిగా సెబీ కోరింది.

స్పోర్ట్స్

బ్యాటర్ల బోల్తా

- 5 వికెట్లతో ఆసీస్ గెలుపు



మేగన్ (5/19)

బ్రిస్బేన్: బ్యాటర్ల వైఫల్యంతో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను భారత మహిళలు ఘోర పరాజయంతో ఆరంభించారు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో చిత్తయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 34.2 ఓవర్లలో 100 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మేగన్ షుట్ 5 వికెట్లతో విజృంభించింది. స్మృతి మంధాన (8), ప్రియా పూనియా (3), హర్లీన్ (19), హర్మన్‌ప్రీత్ (13), జెమీమా (23) విఫలమయ్యారు. ఓ దశలో 89/5తో ఉన్న భారత్ మరో 11 రన్స్ జోడించి ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 16.2 ఓవర్లలో 102/5 స్కోరు చేసి గెలుపొందింది. లిచ్‌ఫీల్డ్ (35), జార్జియా వోల్ (46 నాటౌట్) తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం అందించారు.

వరుసగా ఆరో డ్రా

- సమంగా గుకేష్, లిరెన్

సింగపూర్: వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత జీఎం గుకేష్, డిఫెండింగ్ చాంప్ డింగ్ లిరేన్ (చైనా) మధ్య గురువారం జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్ కూడా ఫలితం తేలలేదు. 54 ఎత్తుల తర్వాత ఇద్దరు ఆటగాళ్లు పాయింట్ పంచుకొన్నారు. టోర్నీలో ఇది ఏడో డ్రా కాగా.. వరుసగా ఆరోది. దీంతో గుకేష్, లిరెన్ చెరో 4.5 పాయింట్లతో సమంగా ఉన్నారు. విజేతగా నిలవాలంటే ఇంకా 3 పాయింట్లు సాధించాల్సి ఉండగా.. మరో 5 రౌండ్లు మిగిలున్నాయి. మిగిలిన 5 రౌండ్లలో లిరెన్ మూడుసార్లు తెల్లపావులతో ఆడనున్నాడు.

టీ20ల్లో బరోడా ప్రపంచ రికార్డు

ఇండోర్: టీ20 క్రికెట్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా బరోడా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సిక్కింతో గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా 20 ఓవర్లలో 5 వికెట్లకు 349 రన్స్ చేసింది. ఈ క్రమంలో గత అక్టోబరులో గాంబియాతో మ్యాచ్‌లో జింబాబ్వే 344/4 రికార్డును బరోడా బద్దలు కొట్టింది. భాను పనియా (51 బంతుల్లో 134 నాటౌట్) చెలరేగిపోయాడు. ఛేదనలో సిక్కిం 87/7 మాత్రమే చేసి 263 పరుగుల తేడాతో చిత్తయింది. కాగా జార్ఖండ్‌తో మ్యాచ్‌లో యూపీ పేసర్ భువనేశ్వర్ కుమార్ (4-1-6-3) హ్యాట్రిక్ నమోదు చేశాడు.

ఆఖరి మ్యాచ్‌లో ఆంధ్ర ఓటమి

- ప్రీక్వార్టర్స్‌కు అర్హత ● 4 వికెట్లతో ముంబై గెలుపు

హైదరాబాద్: ముస్తాక్ అలీ ట్రోఫీ ఆఖరి మ్యాచ్‌లో ఓడినా ఆంధ్ర జట్టు ప్రీక్వార్టర్స్‌కు అర్హత సాధించింది. వరుసగా 5 మ్యాచ్‌లు గెలిచిన ఆంధ్ర.. గ్రూప్-ఈలో గురువారం ముంబైతో జరిగిన పోరులో 4 వికెట్లతో పరాజయం పాలైంది. దీంతో గ్రూపులో రెండో స్థానంలో నిలిచిన ఆంధ్ర నాకౌట్‌కు చేరుకుంది. తొలుత ఆంధ్ర 4 వికెట్లకు 229 స్కోరు చేసింది. భరత్ (93 నాటౌట్), రికీ భుయ్ (68), హెబ్బార్ (52) రాణించారు. ఛేదనలో ముంబై 19.3 ఓవర్లలో 233/6 స్కోరు చేసి గెలిచింది. రహానె (95) అదరగొట్టాడు.

అడిలైడ్‌లో.. గుభాళించేనా?

ఉదయం 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

పూర్తి స్థాయి జట్టుతో టీమిండియా

మిడిలార్డర్‌లో రోహిత్

విజయంపై ఆసీస్ గురి
నేటి నుంచి డే/నైట్ టెస్టు



రోహిత్
బుమ్రా

ముఖాముఖి

ఆ.టె	భా.వి	ఆ.వి	డ్రా	టై
108	33	45	29	1

గమనిక: ఆ.టె:ఆడిన టెస్టులు; భా.వి: భారత్ విజయం;ఆ.వి: ఆసీస్ విజయం

అడిలైడ్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ఘనవిజయంతో ఆరంభించిన టీమిండియాకు నేటి నుంచి అసలైన సవాల్ ఎదురుకానుంది. ఆస్ట్రేలియాతో శుక్రవారం నుంచి రెండో టెస్టు జరుగనుంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో సాగే ఈ డే/నైట్ టెస్టులో గులాబీ బంతితో పరుగులు సాధించడం బ్యాటర్లకు అంత సులువు కాదు. పైగా గతంలో భారత్‌కు ఇక్కడ ఓడిన అనుభవం ఉంది. అయినా తొలి టెస్టు విజయం అందించిన ఆత్మవిశ్వాసంతో ఆతిథ్య జట్టును కట్టడి చేస్తూ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. నాలుగేళ్ల క్రితం అడిలైడ్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ కేవలం 36 పరుగులకే ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. టెస్టు ఫార్మాట్‌లో టీమిండియాకు ఇదే చెత్త స్కోరు. 8 వికెట్ల తేడాతో ఆ టెస్టు ఓడిన భారత్‌కు బదులు తీర్చుకునే సమయం వచ్చింది. మరోవైపు పెర్త్ టెస్టులో చిత్తుగా ఓడిన ఆసీస్ దెబ్బతిన్న పులిలా విజయం కోసం ఎదురుచూస్తోంది. అడిలైడ్‌లో మెరుగైన రికార్డు కలిగిన తాము భారత్‌పై నెగ్గి సిరీస్‌లో సమంగా నిలవాలనుకుంటోంది.

పటిష్ఠంగా బ్యాటింగ్ లైనప్

తొలి టెస్టుకు దూరంగా ఉన్న గిల్, కెప్టెన్ రోహిత్ తుది జట్టులోకి వచ్చారు. దీంతో భారత్ పూర్తిస్థాయిలో బరిలోకి దిగబోతోంది. అలాగే అంతా ఊహించనట్టుగా ఈ మ్యాచ్‌లోనూ ఓపెనర్‌గా రాహుల్‌నే బరిలోకి దింపనున్నారు. సరైన కాంబినేషన్‌తో ఆడేందుకు రోహిత్ తన స్థానాన్ని త్యాగం చేశాడు. ఫామ్‌లో ఉన్న రాహుల్‌ను తప్పించడం అనవసరమంటూ, తను ఐదో స్థానంలో రానున్నాడు. తమకు విజయం మాత్రమే ముఖ్యమని, పెర్త్‌లో ఓపెనర్లుగా జైస్వాల్, రాహుల్ అద్భుతంగా రాణించారని రోహిత్ కితాబిచ్చాడు. అందుకే వారి స్థానాలను మార్చాల్సిన అవసరం లేదని తేల్చాడు. కివీస్‌తో సిరీస్‌లో తను పెద్దగా ఆకట్టుకోలేకపోగా, ఆసీస్ గడ్డపైనా పేలవ గణాంకాలే ఉన్నాయి. ఈ చివరి పర్యటనలోనైనా రోహిత్ బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరం ఉంది. వామప్‌లో హాఫ్ సెంచరీ చేసిన గిల్ జోష్‌లో ఉన్నాడు. వీరి రాకతో దేవ్‌దత్, జురెల్ బెంచీకే పరిమితం కానున్నారు. విరాట్, జైస్వాల్ శతకాలతో ఫామ్ చాటుకున్నారు. బౌలింగ్ విభాగంలో మార్పులు ఉండకపోవచ్చు. ఏదేమైనా రాత్రి పూట పింక్ బాల్‌తో ఎదురయ్యే అదనపు సీమ్‌ను భారత యువ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారో వేచిచూడాల్సిందే.



కమిన్స్

ఒత్తిడిలో కంగారూలు..

పెర్త్‌లో మెరుగ్గా రాణించిన పేసర్ హాజెల్‌వుడ్ ఈ మ్యాచ్‌కు దూరం కావడం ఆసీస్‌కు గట్టి షాక్‌గా చెప్పవచ్చు. అలాగే 2020లో భారత్ 36 రన్స్‌కే కుప్పకూలడంలోనూ అతడి పాత్ర (5-3-8-5) ఉంది. తన స్థానంలో 18 నెలల తర్వాత బోలాండ్ మరో టెస్టు ఆడబోతున్నాడు. దీనికి తోడు బుమ్రా బంతులను ఎదుర్కోవడంలో ఆసీస్ బ్యాటర్లు తేలిపోతున్నారు. టెస్టు స్పెషలిస్టులు స్మిత్, లబుషేన్ ప్రభావం చూపడం లేదు. ఓపెనర్ మెక్‌స్వీన్ అరంగేట్రంలో ఆకట్టుకోలేకపోయాడు. కాగితంపై పటిష్ఠంగా కనిపిస్తున్న బ్యాటింగ్ లైనప్ స్థాయికి తగ్గట్టు ఆడితే భారత బౌలర్లకు కష్టాలు తప్పవు.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, గిల్, కోహ్లీ, రోహిత్ (కెప్టెన్), పంత్, సుందర్, నితీశ్ కుమార్, హర్షిత్ రాణా, బుమ్రా, సిరాజ్.

ఆస్ట్రేలియా: మెక్‌స్వీనే, ఖవాజా, లబుషేన్, స్మిత్, హెడ్, మిచెల్ మార్ష్, క్యారీ, కమిన్స్, స్టార్క్, లియోన్, బోలాండ్.

1

అడిలైడ్‌లో జరిగిన 7 గులాబీ టెస్టుల్లోనూ ఆసీస్ గెలిచింది. ఓవరాల్‌గా స్వదేశంలో జరిగిన 12 డే/నైట్ టెస్టుల్లో 11-1 రికార్డుతో ఉంది. అలాగే భారత్ ఆడిన నాలుగు పింక్ టెస్టుల్లో స్వదేశంలో మూడు నెగ్గి ఆసీస్‌గడ్డపై ఒకదానిలో ఓడింది.

విరాట్ మరో సెంచరీ సాధిస్తే అడిలైడ్‌లో నాలుగు శతకాలు సాధించిన విదేశీ బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పుతాడు.

పిచ్, వాతావరణం

తొలి రోజు మధ్యాహ్నం వర్షం కురిసే అవకాశం 51 శాతం ఉంది. అయితే ఆ తర్వాత తగ్గుముఖం పట్టనుండడంతో మ్యాచ్‌కు అంతరాయం కలగకపోవచ్చు. ఇక అడిలైడ్ పిచ్ బ్యాట్‌కు బంతికి సమతూకంగా ఉండనుంది. ఆరంభంలో పేసర్లు లాభపడతారు. ముఖ్యంగా రాత్రి పూట బంతితో అదనపు స్వింగ్‌ను రాబట్టవచ్చు. మ్యాచ్ సాగేకొద్దీ బ్యాటర్లకు అనుకూలిస్తుంది.

గుర్తుందా.. 36 ఆలౌట్?

2020.. ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ తొలి టెస్టును అడిలైడ్‌లోనే ఆడింది. ఆ గులాబీ టెస్టును ఏ అభిమానీ గుర్తు తెచ్చుకోవడానికి ఇష్టపడడంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే తమ టెస్టు చరిత్రలోనే అత్యంత చెత్త స్కోరును భారత జట్టు అక్కడే నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 244 పరుగులు చేయడంతో పాటు బౌలర్లు కూడా రాణించడంతో భారత్‌కు 53 పరుగుల ఆధిక్యం కూడా దక్కింది. కానీ ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ పేసర్లు కమిన్స్, హాజెల్‌వుడ్‌ల ధాటికి కేవలం 36 పరుగులకే కుప్పకూలడం క్రీడా ప్రేమికులను షాక్‌కు గురిచేసింది. ఒక్కరంటే ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే భారత్ అడిలైడ్‌లో ఆడబోతోంది. అందుకే భారత టెస్టు ఫార్మాట్‌లో పీడకలగా మిగిలిన ఆ పరాభవానికి ఇప్పుడు గట్టిగానే బదులు తీర్చుకోవాలని ప్రతీ అభిమాని కోరుకుంటున్నాడు.

హైబ్రిడ్ మోడల్‌లో చాంపియన్స్ ట్రోఫీ?

- ఏకాభిప్రాయానికి ఐసీసీ, పీసీబీ!
- 2027 వరకు ఇదే విధానం

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించడం దాదాపుగా ఖరారైంది. ఈమేరకు ఐసీసీ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. 2027 వరకు ఇదే తరహాలో టోర్నీలు నిర్వహించేందుకు ఐసీసీ సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. అంటే, చాంపియన్స్ ట్రోఫీలో భారత్ తమ మ్యాచ్‌లను తటస్థ వేదిక దుబాయ్‌లో ఆడనుంది. దీని ప్రకారం ఐసీసీ ఈవెంట్ల కోసం భారత జట్టు పాక్‌కు వెళ్లదు..అలాగే పాక్ జట్టు కూడా భారత్‌కు రాదు. దుబాయ్‌లో గురువారం ఐసీసీ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐసీసీ చైర్మన్ జైషాతో సభ్యుల చర్చలు ఫలించాయని సమాచారం. శనివారం జరిగే బోర్డు మీటింగ్‌లో చాంపియన్స్ ట్రోఫీ గురించి చర్చించే అవకాశం ఉందని ఐసీసీ వర్గాలు తెలిపాయి. 2026 పురుషుల టీ20 వరల్డ్‌కప్‌లో పాక్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించనున్నారు. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తే నష్టపరిహారం కోసం పాక్ చేస్తున్న డిమాండ్ ఇంకా పరిశీలనలో ఉందని ఐసీసీ వర్గాలు తెలిపాయి.

క్రికెట్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్దాం: జైషా



జై షాను అభినందిస్తున్న ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్

దుబాయ్: ఐసీసీ నూతన చైర్మన్ జైషా ప్రపంచ క్రికెట్ వ్యవహారాలపై దృష్టి సారించాడు. గురువారం తొలిసారి ప్రధాన కార్యాలయానికి రావడంతో పాటు బోర్డు సమావేశంలో పాల్గొన్నాడు. ఇందులో హైబ్రిడ్ పద్ధతికి అందరు సభ్యులు అంగీకరించారు. మరింత వివరంగా మాట్లాడేందుకు సమావేశాన్ని శనివారానికి వాయిదా వేశారు. ఈనెల ఒకటిన షా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు బీసీసీఐని సమర్థవంతంగా నడిపిన జైషా ఐసీసీని కూడా అదే రీతిన ముందుకుతీసుకెళ్లాలని భావిస్తున్నాడు. 'ఇది ఆరంభం మాత్రమే. మనమంతా అకుంఠిత దీక్షతో ప్రపంచ క్రికెట్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్లగలమని ఆశిస్తున్నాను' అని బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో షా అన్నాడు. కాగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్ దుబాయ్‌లోని ఐసీసీ కార్యాలయంలో జై షాను కలిసి అభినందించారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 6-12-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ

అల్లు అర్జున్‌పై కేసు

పుష్ప-2 షోలో తొక్కిసలాట ఘటనలో హీరో, ఇతరులపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు

ఘటనలో తల్లి మృతి, బాలుడి పరిస్థితి విషమం

అల్లు అర్జున్‌కు ఆ బాలుడు అభిమాని

కుమారుడి కోసమే సినిమాకు వెళ్లిన తల్లిదండ్రులు

సెక్యూరిటీ, థియేటర్ యాజమాన్యంపైనా కేసు

హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీ వెల్లడి

4



వైసీపీ మాఫియాపై సిట్!

"గన్ చూపించి రూ.వేల కోట్ల విలువైన ఆస్తులు రాయించుకోవడం, కొట్టేయడం దేశ చరిత్రలోనే లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇంత దుర్మార్గంగా ఆస్తులు రాయించుకున్న ఘటన నేనైతే ఎప్పుడూ వినలేదు.. చూడలేదు. బాధితులకు న్యాయం జరగాల్సిందే. భూ సమస్యలపై రాష్ట్రంలో పెద్దఎత్తున వస్తున్న వినతులు, ఫిర్యాదుల్లో ప్రతి ఒక్క దానికీ సంపూర్ణ పరిష్కారం చూపించేందుకు ప్రయత్నిస్తున్నాం"... ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాట! దీని అమలు దిశగా శరవేగంగా అడుగులు పడుతున్నాయి.



రెండు నెలల కిందటే రంగంలోకి విజిలెన్స్

వైసీపీ కబ్జాలు, అక్రమాలపై ఆరా

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పరిశీలన

విశాఖ నుంచి అనంత దాకా దారుణాలు

పోర్టులు, డిస్టిలరీలు, ప్రాజెక్టులు కబ్జా

రేషన్ బియ్యం రవాణాపైనా లోతుగా ఆరా

జిల్లా స్థాయి నేతల ఆగడాలకు అంతే లేదు

ప్రాథమిక ఆధారాలతో సమగ్రంగా నివేదిక

వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో సిట్!

బాధితులకు న్యాయం చేయాలని సీఎం నిర్దేశం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ పాలనలో 'వ్యవస్థీకృతం'గా జరిగిన కబ్జాలు, దందాలు, వసూళ్ల నిగ్గు తేల్చి... బాధితులకు న్యాయం చేసి... దోషులను దండించేలా ప్రభుత్వం పకడ్బందీగా అడుగులు వేస్తోంది. తాడేపల్లిలో మకాం వేసి చక్రం తిప్పిన పెద్దల నుంచి గల్లీ నేతల వరకు జరిపిన అరాచకాలపై ఒక నివేదిక సిద్ధమైంది. వైసీపీ ఐదేళ్ల అక్రమాలు, ఆక్రమణల గుట్టు రట్టు చేసేందుకు... ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రెండు నెలల కిందటే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. విజిలెన్స్ సిబ్బంది రాష్ట్రంలోని

మిగతా 4వ పేజీలో...

'సిట్'తో గట్టిగా...

ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టం నుంచి సామాన్య ప్రజలకు జరిగిన కష్టాల వరకు అనేక కోణాల్లో విజిలెన్స్ సమగ్ర నివేదిక ఇచ్చింది. వీటిని అంశాల వారీగా వర్గీకరించి, దేనిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించనున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై రేపో మాపో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

కుట్ర పన్ని కాకినాడ పోర్టును

కాజేశారు

జగన్ అండ్ కో అధికారిక దందా

కేవీరావు నుంచి వాటా లాక్కోవడానికి వ్యవస్థలతో బెదిరింపులు

40 రోజులు పోర్టులోనే విజిలెన్స్ మకాం

పోర్టు పత్రాల కోసం ఒత్తిళ్లు

లిఖితపూర్వకంగా రాసివ్వాలన్న రావు

దొరికిపోతామని భావించి మారిటైమ్ బోర్డును దించిన జగన్

సీఈవోగా విక్రాంత్ రెడ్డి సన్నిహితుడు

చెన్నై ఆడిటింగ్ కంపెనీతో నివేదిక

994 కోట్లు ఎగ్గొట్టినట్టు కట్టుకథ

దీని ఆధారంగా విక్రాంత్ బెదిరింపులు

అమెరికా నుంచి రప్పించి సంతకాలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అధికారం అండతో అరాచకం.. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని విచ్చల విడితనం.. కన్నేసిన ప్రతిదాన్నీ కబ్జా చేసే నియంతృత్వం.. అందుకోసం ఎంతకైనా తెగించే తత్వం.. కాకినాడ సీపోర్టును హస్తగతం చేసుకోవడానికి అప్పటి సీఎం జగన్ అచ్చం ఇలాగే జగన్నాటకం ఆడారు. కేవీరావు నుంచి బలవంతంగా పోర్టు వాటాలను లాక్కోవడానికి రాష్ట్ర విజిలెన్స్ విభాగాన్ని అడ్డగోలుగా వాడుకున్నారు. మారిటైమ్ బోర్డునూ రంగంలోకి దింపారు. ఆ తర్వాత

మిగతా 11వ పేజీలో...



కేవీ రావు



విక్రాంత్‌రెడ్డి

దందా మూలాలపై సీ'ఐ'డీ!

కాకినాడ పోర్టు వాటాల బదిలీ ఎలా జరిగింది?

ఈ వ్యవహారాలను ఆనాడు చూసిందెవరు?

ఐ అండ్ఐ, ఆర్‌వోసీ, మారిటైమ్ బోర్డుకు సీఐడీ లేఖ

కాకినాడ సీపోర్టు కార్యాలయానికి సీఐడీ బృందం

బాబు, కేవీ రావుపై దావా వేస్తా

మేం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం

బాబు అప్పటికి బతికి ఉంటే అరెస్టు చేస్తాం: సాయిరెడ్డి

సీఐడీ కేసులో హైకోర్టుకు విక్రాంత్‌రెడ్డి

ముందస్తు బెయిల్ మంజూరుకు వినతి

దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధం

పిటిషన్‌లో వైవీ సుబ్బారెడ్డి కుమారుడి వెల్లడి

11

ఇస్రో ఖాతాలో మరో హిట్!

ప్రోబా-3 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

18 నిమిషాల్లో కక్ష్యలోకి చేర్చిన పీఎస్ఎల్వీ-సీ59

శాస్త్రవేత్తలకు ఇస్రో చైర్మన్ అభినందనలు

ఈ నెలాఖరులో మరో పీఎస్ఎల్వీ ప్రయోగం



నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్

10

చట్టాలంటే లెక్కలేదు

అందుకే రోడ్డు ప్రమాదాలు



"చట్టాలంటే ప్రజలకు లెక్కలేదు. వాటిపైన గౌరవం లేదు. రెడ్ సిగ్నల్ దగ్గర ఆగరు. హెల్మెట్‌లు పెట్టుకోరు. హెల్మెట్లు ధరించని కారణంగా ఏటా కనీసం 30 వేల మంది చనిపోతున్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. చలానాలు పెంచినా ప్రమాదాలు ఆగడం లేదు. నిన్న నా ఎదురుగానే ఓ కారు రెడ్ సిగ్నల్ జంప్ చేసి వెళ్లిపోయింది. ఈ ఏడాది 1.68 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. చట్ట నిబంధనలు కఠినంగా అమలు చేయకపోవడం వల్లే ఎక్కువమంది మృత్యువాత పడుతున్నారు"

- లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



మహారాష్ట్ర సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో గవర్నర్‌తో చంద్రబాబు కరచాలనం, చిత్రంలో దేవేంద్ర ఫడణవీస్

సీఎంగా ఫడణవీస్ ప్రమాణం

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి

డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్‌పవార్

ముంబై ఆజాద్‌మైదాన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం

హాజరైన మోదీ, షా, గడ్కరీ, చంద్రబాబు, యోగి, నితీశ్

షారుఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, అంబానీ, సచిన్ కూడా..

రేపటి నుంచి ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

10



విశాఖ తెలుగుదేశం కార్యాలయంలో పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు

ఒక్కరైతూ ఇబ్బంది పడకూడదు

గతంలో మాదిరిగా చేస్తే ఉపేక్షించను

అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక

గత ఐదేళ్లూ అన్నదాతలు ఎన్ని బాధలు పడ్డారో చూశాం

అందుకే కొనుగోళ్ల విధానంలో సమూల మార్పులు

అయినా ఎక్కడైనా సమస్య ఉంటే నేనే వెళ్తా

48 గంటల్లోగా మద్దతు ధర జమ చేయాల్సిందే

బియ్యం స్మగ్లింగ్‌కు అధికారులు, ఉద్యోగులదే బాధ్యత

ధాన్యం కొనుగోలులో లోపాలపై సీఎం సమీక్ష

11

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

17 వేల రెవెన్యూ గ్రామాల్లో 33 రోజులు నిర్వహణ

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ.. సదస్సుల్లో వాటిపై చర్చ

10

ఏపీలో గూగుల్ ఏఐ

రాష్ట్ర ప్రభుత్వంతో ఐటీ దిగ్గజం ఒప్పందం



మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న గూగుల్ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు

పాఠశాల, కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ

మార్పులకనుగుణంగా అవకాశాల కల్పన

అధునాతన ఆవిష్కరణలకూ సహకారం

కీలక రంగాల్లో ఏఐ సేవలు

లోకేశ్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు

చంద్రబాబుతో గూగుల్ ప్రతినిధుల భేటీ

ఇదో గొప్ప ముందడుగని సీఎం హర్షం

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలు విస్తృతంగా అందుబాటులోకి రానున్నాయి. యువతకు ఏఐలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతో పాటు ఈ రంగంలో అధునాతన సాంకేతిక ఆవిష్కరణలకు సంపూర్ణ సహకారం అందించేలా ప్రపంచ ప్రఖ్యాత ఐటీ సంస్థ గూగుల్ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గూగుల్ మ్యాప్స్ ఇండియా జనరల్ మేనేజర్ లలితా రమణి, ఏపీ రియల్‌టైమ్ గవర్నెన్స్ శాఖ కార్యదర్శి సురేశ్‌కుమార్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత అవకాశాలను

మిగతా 4వ పేజీలో...

విశాఖలో లక్ష కోట్లతో

గూగుల్ క్లౌడ్

11న ఒప్పందం.. 6 నెలల్లో పనులు ప్రారంభం

విశాఖకు మొత్తం 4 లక్షల కోట్ల పెట్టుబడులు

అచ్యుతాపురంలో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్లాంటు

నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంటు: చంద్రబాబు



4

ఒకేసారి రెండు డిగ్రీలు

ఒకే దఫాలో రెండు పీజీలు కూడా చేసే అవకాశం

ఏ కోర్సులోనైనా చేరవచ్చు

గడువు తగ్గింపు లేదా పొడిగింపునకూ చాన్స్

ఉన్నత విద్యలో సంస్కరణలు

యూజీసీ మార్గదర్శకాల ముసాయిదా విడుదల

విద్యాసంస్థల సంసిద్ధత ఆధారంగానే అమలు

చైర్మన్ జగదీశ్ కుమార్



యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉన్నత విద్య ప్రమాణాలను మెరుగుపరిచేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన సబ్జెక్టులు చదువుకునేందుకు వీలుగా పలు ప్రతిపాదనలు చేసింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఏడాదికి రెండుసార్లు ప్రవేశాల ప్రక్రియ, ఒకేసారి రెండు డిగ్రీ కోర్సులు చదివే అవకాశం, గత సబ్జెక్టుతో సంబంధం లేకుండా డిగ్రీ లేదా పీజీ కోర్సుల్లో ప్రవేశం ఇందులో ముఖ్యమైనవి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాల ముసాయిదాను యూజీసీ చైర్మన్ మామిడి జగదీశ్ కుమార్ గురువారం విడుదల చేశారు. ముసాయిదాలో పేర్కొన్న సంస్కరణలు అమలైతే.. ఓ విద్యార్థి ఒకేసారి రెండు డిగ్రీ కోర్సులు లేదా పీజీ కోర్సులు చేసే అవకాశం లభిస్తుంది. 12వ తరగతిలో చదివిన సబ్జెక్టుతో

మిగతా 10వ పేజీలో...



జగన్‌పై ఏసీబీకి ఫిర్యాదు చేసి వస్తున్న షర్మిల, తదితరులు

సెకీ ఒప్పందంపై జగన్‌ను విచారించండి

స్వప్రయోజనాల కోసమే అదానీతో డీల్

విద్యుత్ ఒప్పందంతో ప్రజలపై లక్షన్నర కోట్ల భారం

జగన్‌పై ఏసీబీకి పీసీసీ చీఫ్ ఫిర్యాదు

కూటమిని నమ్మి రాత్రి దాకా క్యూలో ఉండి ఓట్లేశారు

ప్రజల నమ్మకాన్ని చంద్రబాబు నిలబెట్టాలి

పంజరంలో చిలక ఏసీబీని విడుదల చేయాలి: షర్మిల

11

వచ్చే ఏడాది కరెంటు మోతలేదు!

ఈఆర్‌సీకి 2025-26 ఏఆర్ఆర్ సమర్పించిన డిస్కంలు

ఆదాయం రూ.44,185 కోట్లు

లోటు రూ.14,683 కోట్లు

12

అపార్‌కు ఆధార్ ఇబ్బందులు

ఆధార్, పాఠశాల రికార్డుల్లో వ్యత్యాసం

రాష్ట్రవ్యాప్తంగా 77 శాతం మందికే అపార్

3

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుఖాంతం..!

మొన్నటిదాకా ముఖ్యమంత్రి కుర్చీలో కూచొని, మళ్ళీ సీఎం కావాలని ఆఖరు వరకూ ప్రయత్నించి, హోం లేని డిప్యూటీ వద్దుగాక వద్దని భీష్మించుకున్న ఏక్‌నాథ్ శిందే ఎట్టకేలకు వచ్చారు, ప్రమాణం చేశారు. మహారాష్ట్రలో గురువారం జరిగిన ప్రమాణస్వీకారోత్సవాన్ని అక్కడే ఉన్న ప్రధాని నరేంద్రమోదీనుంచి, టెలివిజన్ చానెళ్ళలో చూసిన పామరజనం వరకూ ఎవరూ అంతత్వరగా మరిచిపోలేరు. రాజ్యాంగం నిర్దేశించిన మేరకు, ఆ ప్రతిలో ఉన్న ప్రతీమాటనూ వల్లెవేయడం తప్ప ఆ వేదికమీద వేరు ప్రసంగం చేయవచ్చునని ఏక్‌నాథ్ షిండే తొలిసారిగా నిరూపించారు. మైకుముందుకు రాగానే, గవర్నర్ నోటినుంచి మాటను అదుకోవాల్సిన శిందే, దానిని పెడచెవినబెట్టి, నలభైసెకన్లపాటు ఓ అధిక ప్రసంగం చేశారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాకరేనుంచి తనకు రాజకీయబిక్ష పెట్టిన ఆనంద్ దిఘేవరకూ అందరినీ తలచుకున్నారు. మోదీ, అమిత్‌షాల పేర్లు కూడా అందులో ఉన్నందుకు ఆ పార్టీ రాష్ట్రస్థాయి నాయకులు ఊపిరిపీల్చుకొని ఉంటారు. కానీ, శిందే వైఖరి ఆ ఉత్సవానికి హాజరైన పెద్దలందరినీ ఇబ్బందిపెట్టిందని వారి మొఖకవళికలే చెబుతున్నాయి. శిందేలో అణచిపెట్టుకొని ఉన్న ఆగ్రహం, అసహాయత అలా వ్యక్తమైనాయని గిట్టనివాళ్ళు భాష్యం చెప్పుకుంటున్నారు.

పదిరోజుల సస్పెన్స్‌కు తెరపడింది, ఫడణవీస్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. రానురానంటూ ఆఖరు వరకూ అదే ఉద్రిక్తస్థితిని కొనసాగించిన శిందే ఒకవైపు, ఆరోసారి డిప్యూటీ సీఎం పోస్టులో రికార్డు సృష్టించిన అజిత్‌పవార్ మరొకవైపు నిలబడివున్న ఆ దృశ్యం చూసినవారికి కథ సుఖాంతమైందని అనిపిస్తుంది. శిందే దెబ్బకు బీజేపీ ఇంకొంత దిగివచ్చిందనీ, మరో మూడు పోస్టులు ఆయనపార్టీకి దక్కాయని వార్తలు వస్తున్నాయి. ఏదో సినిమాలో డైలాగుమాదిరిగా, పదవులు మారాయి తప్ప, మనుషులువారే, దిశా వేగమూ అవే అని కొత్త సీఎం తన ప్రభుత్వం గురించి చెప్పుకున్నారు. మహాయుతి చిరకాలం నిలుస్తుందని, నాలుగుకాలాలు వర్థిల్లుతుందనీ అన్నారు. కలసినడుస్తామని, సంఘటితంగా రాష్ట్రాన్ని పాలిస్తామని హామీ ఇచ్చారు. మహాయుతి మనుగడ విషయంలో ఏ భయమూ అక్కరలేదన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. శిందే ఒత్తిడిరాజకీయాలకు బీజేపీ లొంగిరాలేదన్న మాట నిజమే కానీ, ఈమారు ఫడణవీస్‌ను కాదనగలిగే శక్తి బీజేపీకి కూడా లేదన్నది నిజం. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికీ, ఫడణవీస్ ముఖ్యమంత్రి కావడానికీ ఆరెస్సెస్ కారణమని అందరికీ తెలుసు.

గతంలో కంటే మరింత బలపడిన రెండు పక్షాలతో ఫడణవీస్ కలసి నడవబోతున్నారు. యాభై ఏడుస్థానాలు నెగ్గిన శిందేకు ముఖ్యమంత్రిగా మరోమారు కొనసాగాలన్న కోరిక ఉన్నట్టుగానే, ఎప్పటికైనా ఆ కుర్చీలో కూచోవాలన్న ఆశ అజిత్‌పవార్‌కు ఉండటం సహజం. శరద్‌పవార్‌నుంచి చీలివచ్చినప్పుడు అజిత్ స్థితివేరు, ఇప్పుడు 41స్థానాలతో, పెద్దాయన పార్టీని పదిస్థానాలకు పరిమితం చేసిన స్థాయి వేరు. పార్టీ వ్యవస్థాపకులు, వారసులకంటే మాతృసంస్థలను చీల్చివచ్చినవారు ఈమారు విస్తృత ప్రజామోదంతో మరింత బలమైన భాగస్వాములుగా కొనసాగుతున్నారు. ఓ యాభైస్థానాలు మినహా శాసనసభను మొత్తంగా కొల్లగొట్టినందువల్ల మహాయుతి ఓ మహాశక్తి. పూర్తి మెజారిటీకి ఓ పాతికస్థానాల దూరంలో ఉన్న బీజేపీకి కూడా తిరుగులేదు. మళ్ళీ ముఖ్యమంత్రిని అవుతానని ఫడణవీస్ ఏ ధైర్యంతో అన్నారో గానీ, అదే జరిగింది. ఐదేళ్ళక్రితం ఉద్ధవ్‌థాకరేతో కలిసి ఎన్నికల్లో గెలిచాక, ఎప్పటిలాగానే బీజేపీ నుంచి తానే సీఎం అవుతానని ఈయన నమ్మాడు. కానీ, బాల్‌థాకరే కాలం నుంచీ రెండుపార్టీలూ పాటిస్తున్న సంప్రదాయాన్ని ఉద్ధవ్ కాదుపొమ్మన్నారు. ఈ మారు తానే కూర్చుంటానని నిర్ణయించి అప్పటికింకా చీలని ఎన్సీపీతోనూ, కాంగ్రెస్‌తోనూ చేతులు కలిపి రాజ్యాధికారాన్ని చేపట్టాడు. తన తరువాత ఎదిగివచ్చిన కుమారుడికి రాజ్యాధికారాన్ని అప్పగించాలని కూడా ఆశపడ్డాడు. ఆ తరువాత శిందేను సృష్టించి శివసేనను చీల్చి బీజేపీ తిరిగి రాజ్యం దక్కించుకున్నప్పటికీ, అధిష్ఠానం మాట కాదనలేక ఫడణవీస్ ఆ కుర్చీని వదులుకోవలసి వచ్చింది. చేజేతులా ఏక్‌నాథ్‌కు అప్పగించాల్సివచ్చింది. సముద్రం వెనక్కుపోయింది కదా అని ఒడ్డున పిచికగూళ్ళు కట్టకూడదు, నేను సముద్రాన్ని, మళ్ళీ వస్తాను అని అప్పట్లో ఆయన చేసిన వ్యాఖ్య ఇప్పుడు అంతా గుర్తుచేసుకుంటున్నారు. రాజకీయ యుద్ధంలో ఓడిగెలిచిన ఫడణవీస్‌కు రాబోయేరోజుల్లో ఎలా నడుచుకోవాలో, ఎవరితో ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియనిదేమీ కాదు. ప్రస్తుతం...సుఖాంతం!

అంబేడ్కర్ స్ఫూర్తితో రాజ్యాధికార పోరాటం

కుల వ్యవస్థ, అంటరానితనం, అస్పృశ్యత కోట్లాది ప్రజల జీవితాలకు మానవీయ హుందాను నిరాకరించాయి. ఇలాంటి వివక్షపూరిత సమాజంలో పుట్టిన ధ్రువతార డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్. దళిత జాతులను కులం పేరుతో మంచినీటికి దూరం చేసిన అగ్రకుల సమాజానికి వ్యతిరేకంగా మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో 'మహాద్ చెరువు' పోరాటం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇది భారతదేశంలోనే మొదటి మానవ హక్కుల ఉద్యమం. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక కుట్రల వలన అవి ఆచరణ సాధ్యం కానప్పటికీ నేటి రిజర్వేషన్ వ్యవస్థకు మూలమైనవి.

1927లో అంబేడ్కర్ 'బహిష్కృత భారత్' అనే పత్రికలో తిలక్ అంటరానివాడిగా పుట్టి ఉంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అనేవాడు కాదు, అస్పృశ్యతా నివారణ నా ధ్యేయం, నా జన్మ హక్కు అని నినదించేవాడని రాశారు. అంబేడ్కర్ రాకతో అణచివేతపై దిగువ కులాల పోరాట ఉద్యమాలు ప్రాంతీయ పరిధిని దాటి జాతీయస్థాయికి విస్తరించాయి. అవి 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే నినాదాలతో అందరిని సంఘటితం చేశాయి. అస్పృశ్యత, అంటరానితనం వంటి సమస్యల పరిష్కారంలో గాంధీతో అంబేడ్కర్ విభేదించారు. అంటరాని కులాలు ఆర్థికంగా, రాజకీయంగా బలపడనిదే వారి సమస్యలకు పరిష్కారం దొరకదని భావించారు. అందుకే వీరికి రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులను పొందుపరిచారు. భారత రాజ్యాంగ రచన కమిటీకి అధ్యక్షత వహించారు. మన దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రాశారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను అందులో చేర్చి 'భారత రాజ్యాంగ పిత'గా వెలుగొందాడు.



పీడనకు గురైన వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్స్ కల్పించాడు. అగ్రకులాల కుట్రలు ఛేదించి అందిరికీ ఓటు హక్కును కల్పించి, రాజకీయ సమానత్వం సాధించాడు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా స్త్రీల ఆస్తి హక్కు కొరకు పోరాడారు. ఆయన అన్ని వర్గాల ప్రజల సమస్యలకు సబబైన పరిష్కారం చూపారు. జీవిత చరమాంకంలో అంబేడ్కర్ 'నా పుట్టుక నా చేతిలో లేదు కానీ, నా చావు నా చేతిలో ఉంది' అని ప్రకటించి హిందూ మతాన్ని వీడి మానవీయ విలువలతో కూడిన బౌద్ధాన్ని స్వీకరించారు. 1956 డిసెంబర్ 6న తుది శ్వాస విడిచారు.

నేడు ప్రతి వ్యక్తికి అమ్మ జన్మనిస్తే... అంబేడ్కర్ రాజ్యాంగం జీవితాన్ని ప్రసాదిస్తుంది. ఆయన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంతరాలపై లక్ష పేజీల సాహిత్యాన్ని మనకు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప నాయకుడు. అందుకే ఐక్యరాజ్య సమితి అంబేడ్కర్‌ను ప్రపంచ మేధావిగా గుర్తించిది. ఆయన జయంతిని 'ప్రపంచ విజ్ఞాన దినోత్సవం'గా ప్రకటించడం మనందరికీ గర్వించ దగ్గ విషయం. కానీ, ఇప్పటికి ఆయనను దళిత నాయకుడుగా మాత్రమే సమాజం కీర్తించడం బాధాకరం. అన్ని వర్గాలకు హక్కులు కల్పించిన విశ్వమానవుడు. నేడు మనమంతా రాజ్యాంగం కల్పించిన హక్కులతో విలాస జీవితాలు అనుభవిస్తున్నాము తప్ప, ఆయన ఉద్యమ రథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో విఫలమవుతున్నాము. అయినప్పటికీ అగ్రకుల పార్టీలు ఆర్థికంగా బలహీన వర్గాలకు 10శాతం EWS రిజర్వేషన్లు కల్పించుకొన్నాయి. ఇది వారి జనాభా కన్నా అధికం. అయినప్పటికీ వెనకబడిన వర్గాలు ఈ విషయాన్నీ ప్రశ్నించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో దేశంలో మెజార్టీ జనాభా గల బీసీ, ఎస్సీ, ఎస్టీలు చేయాల్సింది రాజ్యాధికార యుద్ధం తప్ప, మరొటి కాదు. నేడు అన్నివర్గాల ఆత్మఘోషను వినిపించే భారత రాజ్యాంగ ఉనికికే ప్రమాదం పొంచి ఉంది. అగ్రకుల పార్టీలు ఒకటై రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నంలో ఉన్నాయి. రాజ్యాంగ రక్షకులు ఒకవైపు... రాజ్యాంగాన్ని మార్చేందుకు సంకల్పించిన శక్తులు మరొకవైపుగా దేశ రాజకీయ యుద్ధం జరుగుతుంది. కావున ఎన్నికల్లో అగ్రకుల ఆధిపత్య పార్టీలకు వ్యతిరేకంగా ఓటు అనే ఆయుధంతో బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికార యుద్ధం చేయాలి. అప్పుడే సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుంది. స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం అనే రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగుతుంది. అంబేడ్కర్ కోరుకున్నది కూడా అదే.

– సంపతి రమేష్ మహారాజ్

(నేడు అంబేడ్కర్ వర్ధంతి)

2024: విపత్తుల యుగం ఆరంభం!

సమస్త మానవాళి ఒక భిన్న యుగంలోకి ప్రవేశించింది. మన ధరిత్రి వ్యాప్తంగా సకల సమాజాలూ ఒకటి కాదు, రెండు కాదు.. అనేక విధాలుగా మార్పులకు లోనవడం ప్రారంభమయింది. ఆ మార్పులు ఎటువంటివి? వాతావరణ మార్పు పర్యవసానాలు అవి. అవును, వాతావరణ మార్పు విషమ కాలం ప్రారంభమయింది. 2024 సంవత్సరమే ఈ విపరీత కాలాన్ని ప్రప్రథమంగా పలు రీతుల్లో మన అనుభవాల్లోకి తెచ్చింది– ప్రతి రోజు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడో ఒక చోట తీవ్ర వాతావరణ సంఘటనల తాకిడి కనిపిస్తూనే ఉన్నది. వడగాడ్పులలోను చలిగాడ్పులలోను కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. వెన్వెంటనే వాటిని సరికొత్త రికార్డులు అధిగమిస్తున్నాయి! వాతావరణం వికృత పోకడలు పోతోంది. ఇప్పటికే మనుగడ అంచున జీవిస్తున్న మానవ సమూహాలు ఎన్నో, తరచు సంభవిస్తున్న వాతావరణ విపత్తుల నుంచి కోలుకోలేని రీతిలో నష్టపోతున్నాయి, కాదు, ధ్వంసమవుతున్నాయి. మరి ఇదొక భిన్నమైన యుగం కాదూ?

శాస్త్రవేత్తలు ఈ వినూత్న కాలాన్ని ఆంత్రోపోసీన్ యుగం (మానవుని ఇటీవలి యుగం)గా అభివర్ణించారు. మానవుని కార్యకలాపాలు భూగ్రహ శీతోష్ణపరిస్థితులు, పర్యావరణ వ్యవస్థలపై ఉపేక్షింపదగని ప్రభావాలను నెరపుతున్న కాలమిది మానవునికి మరింత శ్రేయస్సును సమకూర్చేందుకు, మరింత సంపద సృష్టికి చేపట్టిన ప్రతి చర్య, వేసిన ప్రతి ముందు అడుగు నిరర్థకమవుతున్న పాడు కాలమిది. అంతే కాదు, మానవులుగా పరస్పర సంబంధాలలో మనం ప్రవర్తిస్తున్న తీరు తెన్నులు వేగంగా మారిపోతున్న నిష్ఠుర కాలమిది; ఏది మంచి ఏది చెడు అనే విషయంలో లోకం పోకడలు అనూహ్యంగా ఉంటున్న రోజులివి; రాబోయే సంవత్సరాలలో సమస్త మానవ కార్యకలాపాలను మౌలికంగా మార్చివేయగల అధునాతన కృత్రిమ మేధ సాంకేతికతల శక్తి సామర్థ్యాలలో మహా మార్పులు చోటు చేసుకుంటున్న నవీన కాలమిది. సమాజ వ్యవహారాలపై జనసామాన్యం చర్చల 'స్వభావాన్ని' సైతం మనం మార్చి వేశాం. తద్వారా ఎంత నీచమైన, విద్వేషపూరితమైన, విధ్వంసకరమైన ఆలోచనలనూ బయటికి చెప్పుతున్నాం. ఇదే, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలిగే వాక్ స్వాతంత్ర్యమని విశ్వసిస్తున్నాం. అయితే కొత్త యుగ అధునాతన సాంకేతికతల వాణిజ్యరీతులలో సంపూర్ణ నమ్మకాన్ని సుదృఢంగా నెలకొల్పుకున్నాం. ఈనాటి బిగ్ టెక్ కంపెనీలు సమాజాల సర్వ కార్యకలాపాలను నియంత్రించే సామ్రాజ్యాలుగా పరిణమించాయి. ఈ కొత్త టెక్ కంపెనీలు గత కాలం బహుళ జాతి సంస్థలను చాలా అల్పమైనవిగా చేశాయి. కొత్త టెక్ కంపెనీలు దేశాల సరిహద్దులను అధిగమించి ప్రపంచ వ్యాప్తంగా సమస్త ప్రజల జీవితాలను అనేక విధాలుగా ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీల అధిపతులే మార్పులకు చోదక శక్తులుగా ఉన్నారు–కేవలం సాంకేతికతలు, మీడియాలోనే కాకుండా రాజకీయాలలో సైతం కనీవినీ ఎరుగని ప్రభావాన్ని నెరపుతున్నారు. విధాన నిర్ణయాలను తీసుకునేది తామేనని, అవి ప్రజల ప్రయోజనాలను కాపాడేవిగా ఉంటాయనే భ్రమల్లో చాలా ప్రభుత్వాలు ఉన్నాయి. వాస్తవమేమిటంటే ప్రభుత్వ నిర్ణయాలను రూపొందించే ప్రక్రియలను ప్రభుత్వాలు చాలా వరకు గ్లోబల్ కన్సల్టన్సీలకు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, ప్రైవేట్ కంపెనీలకు వదిలివేశాయి. ప్రభుత్వ వ్యవస్థలు ప్రైవేటీకరణ అవుతున్నాయి. మనం అంటే ప్రజలం కేవలం ప్రేక్షకులుగా మిగిలిపోతున్నాం. ప్రజాస్వామ్యం ఇంకా అంతమైపోలేదు. అయితే కార్పొరేట్ కంపెనీలు, వాటి వినియోగదారుల, అంటే మీరు, నేనూ– మధ్య సంబంధాల ప్రభావంతో ప్రజాస్వామ్యం మౌలికంగా పరివర్తనచెందుతోంది ఇదంతా వాతావరణ మార్పు విశ్వరూపం ప్రదర్శిస్తున్న కాలంలో సంభవిస్తోంది.



akbar

> వాతావరణ వైపరీత్యాల అనివార్య కాలంలో ఉన్నామనే కఠోర సత్యం మనకు తెలుసు. ఈ బాధాకర వాస్తవాన్ని మనం నిరాకరించడం లేదు. అయితే మానవాళి అవిభాజ్య శ్రేయస్సు సాధనకు సమష్టిగా పనిచేసే సమాజంగా మనం ఇంకెంత మాత్రం సంఘటితం కాలేకపోతున్నాం.

మనం మరింత అభద్రంగా, మరింత ఆందోళనకరంగా నివశిస్తున్నాం. అసమానతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ధనికులు మరింత సంపన్నులుగా పేదలు నిరుపేదలుగా మారిపోతున్న కాలమిది. కోవిడ్ మహమ్మారి సకల ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేయడంతో ఆ అసమానతలు గత ఐదేళ్ల కాలంలో మరింతగా పెరిగాయి. జీవన స్థితిగతులు మెరుగుపరచుకునేందుకు ప్రజలు వలస బాట పడుతున్నారు. వలసల పరిణామాలు, పర్యవసానాలు పలు దేశాల్లో ప్రజలను మరింత అభద్ర పరిస్థితులలోకి నెట్టివేశాయి. వారి ఆగ్రహం ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకతగా పరిణమిస్తోంది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఈ ఆగ్రహం, వ్యతిరేకత అన్నవి పేద ప్రజలకే పరిమితం కాదు. సంపన్నులు సైతం తాము దగా పడినట్టు భావిస్తున్నారు. 1990 దశకం తొలినాళ్లలో దేశ దేశాల ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ ప్రారంభమయినప్పుడు పేద ప్రజలు మాత్రమే తాము ఉద్యోగాలు, ఉపాధులు కోల్పోతామని భయపడ్డారు. రైతులు వీధులలోకి వచ్చి తమ దురవస్థలపై నిరసన తెలిపారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు తమకు మేలు చేయడం లేదని ఆక్రోశించారు. ఇప్పుడు పరిస్థితులు తలకిందులయ్యాయి. సంపన్న దేశాలలో అధునాతన సాంకేతికతలతో కార్మికులు ఇప్పటికే పెద్ద ఎత్తున ఉద్యోగాలు కోల్పోయారు. వారు క్రమంగా 'విద్యాధిక కులీనులు, నిపుణులు'కు వ్యతిరేకులుగా మారుతున్నారు సర్వీస్ రంగం అభివృద్ధితో అధికంగా లబ్ధి పొందుతున్నది విద్యాధికులు, నిపుణులేనని సామాన్య కార్మికులు విమర్శిస్తున్నారు. ఈ వర్గ వైషమ్యాల కారణంగా సమాజ శ్రేయస్సుకు దోహదం చేసే భావాలు తిరస్కరణకు గురవుతున్నాయి. జ్ఞానసంచయం ప్రైవేట్ కంపెనీల ప్రయోజనాలనే కాపాడుతుందని ప్రజలు భావిస్తున్నారు. ప్రపంచ సంఘటిత సమాచార, వ్యాపార వ్యవస్థలు ఇటువంటి పరిస్థితులను పెంచుతున్నాయి. ఈ అపసవ్య ధోరణులు శ్రుతి మించుతున్నాయి. చివరకు సమస్త ప్రజల శ్రేయస్సును ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్న వాతావరణ మార్పు వాస్తవాన్నీ సంశయిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ రెండో రాకడతో అది మరింత తీవ్రమయింది.

వాతావరణ వైపరీత్యాల అనివార్య కాలంలో ఉన్నామనే కఠోర సత్యం మనకు తెలుసు. ఈ బాధాకర వాస్తవాన్ని మనం నిరాకరించడం లేదు. అయితే మానవాళి అవిభాజ్య శ్రేయస్సు సాధనకు సమష్టిగా పనిచేసే సమాజంగా మనం ఇంకెంత మాత్రం సంఘటితం కాలేకపోతున్నాం. అజర్‌బైజాన్‌లోని బాకు నగరంలో ఇటీవల ముగిసిన 29వ అంతర్జాతీయ వాతావరణ సదస్సులో అది స్పష్టమయింది. వాతావరణ మార్పు నెదుర్కొనేందుకు ఒక సహకార పూరిత ప్రపంచాన్ని నిర్మించుకునే సంకల్పం విషయంలో కూడా చిత్తశుద్ధి చూపలేకపోయాం. క్లైమేట్ జస్టిస్ పేరిట వాతావరణ మార్పు నెదుర్కొనేందుకై పేద దేశాలకు నామమాత్ర ఆర్థిక సహాయాన్ని అందించేందుకు సంపన్న దేశాలు ముందుకు వచ్చాయి. చారిత్రకంగా వాతావరణ మార్పుకు కారణమైన ఆ దేశాలు పేద దేశాలకు ధర్మ బోధలు చేశాయి. కర్బన ఉద్గారాలు తక్కువగా ఉండే ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి పరచుకోవాలని చెప్పాయి. వాతావరణ మార్పుతో సంభవిస్తున్న నష్టాలను తాము అందించే ఆర్థిక సహాయంతో భర్తీ చేసుకోవాలని స్పష్టం చేశాయి. అయితే మానవాళి మనుగడకు ధరిత్రిని సురక్షిత ప్రదేశంగా మార్చేందుకు ఆ ఆర్థిక సహాయం ఎంత మాత్రం చాలదు. సంపన్న దేశాల వైఖరి వాతావరణ లక్ష్య సాధన ప్రాధాన్యాన్ని తక్కువ చేయడమే కాకుండా, పేద దేశాలను అవమానించడమేనని చెప్పక తప్పదు.

ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ ప్రారంభమైనప్పుడు ఒక సుస్థిర ప్రపంచ వ్యవస్థ ఏర్పడగలదనే ఆశాభావం నిండుగా వ్యక్తమయింది. పరస్పర ప్రయోజనాలను కాపాడుకోవాలనే లక్ష్యంతో ప్రపంచ దేశాలు వ్యవహరించాయి. అయితే వాటి అసలు లక్ష్యం ప్రపంచ శాంతి కానేకాదు, వ్యాపార ప్రయోజనాలను కాపడుకోవడమే. కార్మిక, పర్యావరణ భద్రత వ్యయాలను తగ్గించేందుకు తమ ఫ్యాక్టరీలను అభివృద్ధి చెందుతున్న దేశాలకు తరలించాయి. ఈ తరలింపుతో ఉత్పత్తి కార్యకలాపాలే కాకుండా వాతావరణ కాలుష్య వాయు ఉద్గారాలు కూడా తరలిపోయాయి. కర్బన ఉద్గారాల గణాంకాలను చూస్తే చైనా అగ్రస్థానంలో ఉంటుంది. పాశ్చాత్య సంపన్న దేశాల పరిశ్రమలు అధికంగా చైనాకు తరలిపోవడమే అందుకు కారణం. హరిత పరివర్తన అనివార్యమైన నేటి ప్రపంచం కొత్త వాస్తవాలను ఎదుర్కొంటున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా చైనాలో ఉత్పత్తి అవుతున్న సరుకులు చౌకగా పాశ్చాత్య సంపన్న దేశాలకు అందుతున్నాయి. ఉత్పత్తి కార్యకలాపాలు విదేశాలలో జరగడం వల్ల స్వదేశంలో నిరుద్యోగిత ప్రబలిపోతోంది. ఈ కారణంగానే విదేశాలలో ఉన్న అమెరికా ఫ్యాక్టరీలు అన్నిటినీ అమెరికాకు తీసుకువచ్చి అందరికీ ఉద్యోగాలు కల్పిస్తానని డోనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు.

వాతావరణ మార్పు విషమ యుగం ప్రారంభమైన 2024 సంవత్సంలోనే ప్రపంచ వ్యాప్తంగా సమాజాలు అన్నీ ఒక భిన్న యుగంలోకి ప్రవేశించాయి. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని భిన్నమైన– విధ్వంసక వర్తమానానికి పూర్తిగా విరుద్ధమైన– ఒక భవ్య భవిష్యత్తును నిర్మించుకోవడానికి సంకల్పించుకోవాలి, కార్య ప్రణాళికను రూపొందించుకోవాలి, లక్ష్య నిమగ్నులమవ్వాలి. ఇంకెంత మాత్రం గతంలో జీవించకూడదు. గతానికి ఖైదీలుగా ఉండిపోతే మనం అసలు మనుగడనే కోల్పోయే ప్రమాదమున్నది. ఒక కొత్త పొద్దుపొడుపులోకి పథనిర్దేశకులుగా మనం ప్రవేశించాలి; ఇంతవరకు మనం చేసిన తప్పులను అంగీకరిస్తూ ఒక కొత్త వాగ్దానాన్ని నెరవేర్చేందుకు మనం నిబద్ధులమవ్వాలి. లేనిపక్షంలో రాబోయే దశాబ్దాల విలువైన సమయాన్ని వ్యర్థం చేసినవాళ్లమవుతాం. పర్యవసానంగా వాతావరణ మార్పు ప్రభావాలు క్రమగా పెరిగిపోయి వాటి సుడిలో చిక్కుకుని అంతిమంగా ఒక శూన్యతలోకి ప్రస్థానించే ప్రమాదమున్నది. పొంచి ఉన్న ఈ ప్రమాద పరిస్థితిని మనం మార్చి తీరాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

భారత్ పరపతికి 'బంగ్లా' పరీక్ష

బంగ్లాదేశ్‌లో చెలరేగుతున్న అల్లర్లు, మైనారిటీల లక్ష్యంగా జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. అక్కడి తాత్కాలిక ప్రభుత్వ అసమర్థత లేదా పరోక్ష తోడ్పాటు వల్ల అవి తగ్గే సూచనలు కనబడడం లేదు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు దిగజారితే, ఆ ప్రభావం భారత్‌పై కూడా ప్రతికూలంగానే ఉంటుంది. భారత్‌తో స్నేహం కనపర్చే హసీనా ప్రభుత్వం, తన నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పెల్లుబికిన పౌర సమాజం ఆందోళనలతో కూలిపోయింది. ప్రజాస్వామిక ప్రభుత్వం నెలకొల్పే పేరిట ఆమెకు వ్యతిరేకంగా వ్యవహరించిన వివిధ వర్గాలు తాత్కాలికంగా యూనస్ అధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఆయన అధ్వర్యంలో పరిస్థితి చక్కబడడం అటుంచి, మైనారిటీలైన హిందువులు, బౌద్ధులు, క్రిస్టియన్లపై, వారి ఆస్తులు, ప్రార్థనా స్థలాలపై దాడులు పెరిగాయి. ఒక నివేదిక ప్రకారం ఈ మూడు నెలల్లో రెండు వేలకు పైగా ఈ తరహా దుశ్చర్యలు జరిగాయి. ప్రభుత్వం వైపు నుండి మొక్కుబడి ప్రకటనలు మినహా పరిస్థితి కుదుటపర్చే చర్యలు శూన్యం. మైనారిటీలకు రక్షణ కల్పించమని కోరుతూ జరుగుతున్న ఆందోళనలకు నాయకత్వం వహించిన ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ దాస్‌ని అక్కడి ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా భారత్‌లో తలదాచుకున్న మాజీ ప్రధాని హసీనా బంగ్లాదేశ్ నాయకత్వంపై తీవ్ర విమర్శలకు పాల్పడడం కూడా భారత్‌కు ఇరకాటమే. వారి అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చడం భారత్ విధానం కాదు. చూస్తూ చూస్తూ అక్కడ మానవ హక్కుల ఉల్లంఘన పట్ల ఉదాసీనంగా ఉండడం కూడా సాధ్యం కాదు. పొరుగుదేశం సైనిక రాజ్యంగానో, మత రాజ్యంగానో మార్పు చెందడం క్షేమం కాదు. భారత్ దౌత్యనీతికి, పరపతికి, వ్యవహార దక్షతకి ఇది పరీక్షా సమయం.

– డి.వి.జి. శంకరరావు

ఈ తెలుగు బిడ్డ శిల్పకళా తపస్వి

మన శిల్పులు సహజంగా ప్రముఖ వ్యక్తులు లేదా దేవతా శిల్పాలు చేస్తారు. అందుకు భిన్నంగా జీవితాలను మానవీయ కోణంలో కాంస్య శిల్పాలుగా మలచి జాతీయ గుర్తింపు పొందిన శిల్పి చౌదరి సత్యనారాయణ పట్నాయక్. జీవితాన్ని శిల్పకళా రంగానికి అంకితం చేసిన ఆయన శ్రీకాకుళం జిల్లా బాదంలో 1925 డిసెంబరు 6న జన్మించారు.

ఇష్టం లేకపోయినా తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన 'చిక్కవలస' కరణం బాధ్యతలు స్వీకరించి ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ప్రముఖ చిత్రకారుడు కూర్మాపు నరసింహం చిత్రాలు చూసి స్ఫూర్తి పొంది ఆయన వద్ద ఆయిల్ పెయింటింగ్, చాయా చిత్రకళ, డార్కురూం ప్రోసెసింగ్ పనులు నేర్చుకున్నారు. అనంతరం నరసింహం సూచనపై 1947లో మద్రాసులోని స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో నాటి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ సహకారంతో చేరారు. స్కూల్ ప్రిన్సిపాల్‌గా వున్న ప్రముఖ శిల్పి, చిత్రకారుడు దేవి ప్రసాద్‌రాయ్ చౌదరి స్టూడియోలో శిల్పాలు తయారు చేసే పద్ధతులు, పనిముట్లు వాడే విధానం, శిల్పాలకు తుది మెరుగులు దిద్దే తీరు అవగాహన చేసుకున్నారు. విద్యార్థి దశలో ఫ్రెంచ్ ఇంప్రెషనిస్టుల ప్రభావానికి లోనై సిగ, వ్యాన్ లాంటి నిపుణులను అనుకరించేవారు.



సామాన్యుడ్ని కూడా గాఢంగా ప్రభావితం చెయ్యాలంటే చిత్రకళ కంటే శిల్పమే సరి అయినదని భావించిన పట్నాయక్ జీవితాంతం ఆ రంగంలో అంకితభావంతో కృషి చేసారు. పట్నాయక్ కళా ప్రతిభ గుర్తించిన ప్రముఖ విద్యావేత్త డి.ఎస్.రెడ్డి ఆయనను పోస్టుగ్రాడ్యుయేట్ బేసిక్ ట్రైయినింగ్ కళాశాలలో సీనియర్ గ్రేడ్ డ్రాయింగ్ టీచర్‌గా నియమించారు. తర్వాత గుంటూరులో ప్రభుత్వ మహిళా కళాశాలలో రెండు దశాబ్దాలు శిల్పకళాచార్యునిగా పనిచేశారు.

మౌర్యులు, మొహంజదారో, శుంగ, కుషాణుల కాలం నాటి ఆకృతులకు రూపురేఖల్ని టెర్రకోట శైలిలో కాంస్యంపై చెక్కడంలో పట్నాయక్‌ది ప్రత్యేక శైలి. పట్నాయక్ తన గ్రామీణ జీవన శైలిని మర్చిపోలేదు. బంకమట్టితో ఆకృతిని దిద్ది మైనంతో మౌల్డ్ రూపొందించి కాంస్యంను కరిగించి ప్రతిమను తయారు చేయడంలో పట్నాయక్ విశేష ప్రతిభ కనపర్చేవారు. ప్రతి శిల్పంలోను నూతనత్వం, సహజత్వం చూపించేవారు.

1998లో గుంటూరులో తన పేరుతో పట్నాయక్ ఆర్ట్ గ్యాలరీని స్థాపించి తన చిత్ర, శిల్పాల్ని అందులో ప్రదర్శింపచేశారు. 2009లో ఆ గ్యాలరీని విశాఖలో నాటి ముఖ్యమంత్రి కె.రోశయ్య ప్రారంభించారు. దాదాపు ఒక దశాబ్దం పాటు నిరాటంకంగా నిర్వహించారు. 2020లో కరోనా సమయంలో ఆయన కుమారుడు శిల్పి అయిన రవిశంకర్ పట్నాయక్ కన్నుమూయడంతో ఆ గ్యాలరీ మూతపడింది.

కాంస్య శిల్పకళకు సంబంధించి పట్నాయక్ ఒక పుస్తకం రాశారు. కష్టపడి నేను అభ్యసించిన కాంస్య విగ్రహాల రూపకల్పన విద్య ఈ తరం వారికి అందించే ఉద్దేశంతో స్వీయ అనుభవాన్ని పుస్తక రూపంలో తెచ్చినట్టు ఆయన చెప్పారు. పట్నాయక్ శిల్పాల్లో అధిక శాతం మానవీయ దృక్పథంతో మలిచారు. మాతృత్వం, వాస్తవ జీవన చిత్రం, రసికత్వం వంటి అంశాల్ని ఆయన ఎక్కువ సృష్టించారు. ఆయన 'పేస్' పేరుతో రూపొందించినవి అత్యంత కీర్తి నొందాయి.

రాష్ట్ర లలితకళా అకాడమీ ఉపాధ్యక్షుడిగా, భారత శిల్పుల సమాఖ్య కార్యదర్శిగా పట్నాయక్ పనిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, బహుమతి పొందిన పట్నాయక్ ఆంధ్ర, నాగార్జున, తెలుగు యూనివర్శిటీలకు సలహా సంఘ సభ్యునిగా పనిచేశారు. రష్యా, పోలెండ్, జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా, హంగేరి, బల్గేరియా, రుమేనియా తదితర దేశాల్లో పర్యటించి, మన తెలుగు చిత్ర, శిల్పకళా విశిష్టతను సాటిచెప్పారు.

2011లో కేంద్ర ప్రభుత్వం వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా 'వయోశ్రేష్ఠ' సమ్మాన్ పురస్కారంతో సత్కరించింది. ఢిల్లీలోని ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'కళారత్న' అవార్డు అందుకున్నారు. దేశంలోని వివిధ చిత్రశాలల్లో పట్నాయక్ శిల్పాలు కొలువుదీరి వున్నాయి. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, కోల్‌కత్తా, గుంటూరు, విశాఖ తదితర ప్రాంతాల్లో 30 శిల్పప్రదర్శనలు నిర్వహించారు. పట్నాయక్ తన 97వ ఏట 2022 ఆగస్టు 8న కన్నుమూశారు.

○ సుంకర చలపతిరావు

(నేడు పట్నాయక్ జయంతి)

'ఇద్దరు పిల్లల' నిబంధనపై మేలైన చట్ట సవరణ

'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్నాడు గురజాడ. దేశ అభ్యున్నతైనా, రాష్ట్ర అభివృద్ధయినా జనాభా మీదే ఎక్కువ ఆధారపడి ఉంటుంది. అందుకే జనాభా తగ్గుదలని గుర్తించి భవిష్యత్‌లో సంతానోత్పత్తి రేటు పెంచేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తొలి అడుగు వేసింది. ఈ మార్పుకు ప్రజాప్రతినిధులే ఆదర్శంగా నిలవాలని అసెంబ్లీ సాక్షిగా కీలక నిర్ణయాన్ని తీసుకుంది.

ఆగస్టు 7న విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన కొలువుతీరిన క్యాబినెట్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేయాలని నిర్ణయించింది. నవంబర్ 13న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ తరఫున పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్ట సవరణ 2024ను, మునిసిపల్ శాఖా మంత్రి పొంగులేటి నారాయణ ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ చట్టాల సవరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. వీటిని నవంబర్ 18న సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సవరణల ద్వారా ఇకపై ఇద్దరు కన్నా ఎక్కువ సంతానం కలిగిన వ్యక్తులు సైతం స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి అర్హులవుతారు.

1991 జనాభా లెక్కల తర్వాత పెరుగుతున్న జనాభా, 3.7కి చేరిన సంతానోత్పత్తి రేటు అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలను సందిగ్ధంలోకి నెట్టాయి. పెరుగుతున్న జనాభా, సంతానోత్పత్తి రేటు పరిష్కారం కోసం అప్పటి కేరళ ముఖ్యమంత్రి కె. కరుణాకరన్ అధ్యక్షుడిగా 1992లో కమిటీ ఆన్ పాపులేషన్‌ను జాతీయ అభివృద్ధి సంస్థ (ఎన్‌డీసీ) ఏర్పాటు చేసింది. 1993లో ఈ కమిటీ నివేదిక సమర్పించి చిన్న కుటుంబాలను ప్రోత్సహించాలని, ఆ దిశగా రాజకీయంగా కూడా పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు చిన్న కుటుంబాలకు ప్రాముఖ్యతను ఇవ్వాలని సూచించింది. దాంతో ఇద్దరు పిల్లలున్న వ్యక్తులే గ్రామ పంచాయతీల ఎన్నికలలో పోటీ చేయడానికి అర్హులన్న నిబంధనను 1992లో రాజస్థాన్, 1993లో హర్యాణా, 1994లో ఒడిస్సాలలో అక్కడి ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. తర్వాత 2000లో వచ్చిన జాతీయ జనాభా విధానం (ఎన్‌పీపీ) కూడా నిర్దిష్టమైన లక్ష్యం లేకుండానే 2045 నాటికి జనాభాను స్థిరీకరించాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన ఆధారంగా మహారాష్ట్ర, గుజరాత్, బీహార్, అస్సాం, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో పాటు, కేంద్రపాలిత ప్రాంతాలైన దాద్రానగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యులు కూడా తమ తమ స్థానిక సంస్థలలో పోటీచేయాలంటే ఇద్దరు పిల్లలున్న వ్యక్తులే అర్హులన్న సవరణలు చేశాయి.

స్థానిక సంస్థల ఏర్పాటులో, రిజర్వేషన్లు కల్పించడంలో ముందంజలో ఉన్న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ దిశగా 1994 మే 30న నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉన్నవాళ్లు స్థానిక సంస్థల ఎన్నికకు అనర్హులనే చట్టాన్ని చేస్తూ ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1955కి, సెక్షన్ 21(బి)ను, ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ చట్టం 1965కు, సెక్షన్ 13ను చేర్చి సవరించింది. ఈ చట్టాన్ని తీసుకురావడమే కాక అప్పటి ప్రభుత్వం ప్రజలలో అవగాహన కల్పించి జనాభా తగ్గుదలను సాధించింది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో తగ్గిన జనాభా అప్పటి సవరణ చట్టాల పర్యవసానమే అని చెప్పవచ్చు.

ఆనాడు జనాభా తగ్గించాలన్న లక్ష్యంపై అనేక విమర్శలు రాకపోలేదు. ఈ విమర్శలతో పాటు 2003–05 సంవత్సరాల మధ్య జనన, లింగ నిష్పత్తి 88:100 నమోదు కావడంతో, కొన్ని రాష్ట్రాలు ఈ చట్ట సవరణల గురించి పునరాలోచించాయి. 2005లో ఛత్తీస్‌గఢ్, హర్యాణా, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఈ చట్టాన్ని వెనక్కి తీసుకున్నాయి.

> స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను తొలగిస్తూ చేసిన చట్ట సవరణ స్థానిక సంస్థల రాజకీయాలపై ప్రభావం చూపుతుంది. ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉన్నవాళ్లూ స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడం వల్ల ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణా జరుగుతుంది. ఇక చట్ట ముఖ్య ఉద్దేశ్యమైన జనాభా పెరుగుదల జరుగుతుందా, జరిగితే దాని పర్యవసానాల్ని ఎదుర్కోవడానికి రాష్ట్రం, రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయా లేదా అన్నది సమయం ఛేదించవలసిన సవాలు.



ప్రపంచంలో అన్ని దేశాలు భారతదేశాన్ని మానవవనరుల హబ్‌గా పేర్కొంటున్న రోజులలో, దేశ సగటు సంతానోత్పత్తి రేటు క్షీణించడం దేశ అభివృద్ధికి గొడ్డలిపెట్టు. దేశ సంతానోత్పత్తి రేటు 1993–94లో 3.7 ఉంటే, అది నేడు 2.11కు చేరింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంతానోత్పత్తి రేటు 2001లో 2.6 ఉంటే, ప్రస్తుతం 1.5కి దిగజారింది. తాజా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో పురుషుల సగటు సంతానోత్పత్తి వయసు ప్రస్తుతం 32.5 కాగా, అది 2047కి 40కి, స్త్రీల సంతానోత్పత్తి వయసు ప్రస్తుతం 29 కాగా, అది 2047 నాటికి 38కి పెరిగే అవకాశం ఉందని అంచనా. దీనివల్ల రాష్ట్రంలో యువకుల సంఖ్య బాగా తగ్గిపోతుంది. మానవ వనరులు లేక, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి కుంటుపడిపోతుంది.

ప్రభుత్వం ప్రజలు ఎక్కువ మంది పిల్లలను కనేందుకు ప్రోత్సహించే దిశగా చేసిన ఈ చట్ట సవరణ రాష్ట్ర అభివృద్ధికి పడిన ఒక అడుగని చెప్పవచ్చు. ఈ చట్ట సవరణ తిరిగి మూడవ శ్రేణి ప్రభుత్వంలో అందరికీ భాగస్వామ్యం కలిగిస్తూ, ప్రజాస్వామ్య విలువలపై ఉన్న విమర్శలకు తావు లేకుండా చేస్తుంది. ముందుచూపుతో ఆలోచిస్తే కేంద్ర ప్రభుత్వం 2026లో జనాభా ప్రాదిపదికన చేపట్టబోతున్న డీలిమిటేషన్‌లో కూడా దక్షిణ భారత రాష్ట్రాలకు చుక్కెదురయ్యే అవకాశం ఉంది. దీనిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు దక్షిణ రాష్ట్రాల రాజకీయవేత్తలు వారి అభిప్రాయాన్ని వినిపించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్– ఒకప్పుడు కేంద్రప్రభుత్వం సూచించిన కుటుంబ నియంత్రణ విధానాన్ని అమలు చేసిన దక్షిణ రాష్ట్రాలకు రేపు చేపట్టబోయే డీలిమిటేషన్ శిక్ష కాకూడదని, అందుకు కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్‌లో జనాభాని కాకుండా, రాష్ట్రాల ఆర్థిక పనితీరును పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. తమిళనాడు ముఖ్యమంత్రి కె. స్టాలిన్ కూడా ప్రస్తుతం దక్షిణ రాష్ట్రాల్లో కుటుంబాలు పదహారు మంది పిల్లలనైనా విద్యాబుద్ధులతో పెంచగలిగే స్థాయికి చేరుకోవాలనే దిశగా పనిచేయాలని తెలియజేశారు.

ప్రపంచంలో ఇప్పటికే దక్షిణ కొరియా 200 బిలియన్ డాలర్లను ఖర్చు చేసి, గత 16 సంవత్సరాలుగా జనాభా పెంచే దిశగా కృషి చేస్తోంది. సింగపూర్ 1.3 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తూ, ఆ దేశ మహిళలు తమ ఉద్యోగాలతోపాటు మాతృత్వాన్ని ఆనందించి, ఆస్వాదించే దిశగా చర్యలు తీసుకుంటోంది. చైనా కూడా ఎక్కువమంది పిల్లలు కలిగిన తల్లిదండ్రులకు పన్ను రాయితీలిస్తూ, బడ్జెట్లో శిశు ఆరోగ్య సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రోత్సాహకాలు కూడా అందిస్తోంది.

సంతానోత్పత్తి అనేది వ్యక్తిగత నిర్ణయమైనా దేశ సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వాలు చొరవ చేసుకోవడం ఆనాడైనా, నేడైనా వ్యక్తిగత హక్కులకు భంగమని మానవ హక్కుల నిపుణులు భావిస్తున్నారు. ఇది కుటుంబ ఆర్థిక స్థితిగతులు, ఆరోగ్యం వంటి ఇతర పరిస్థితులు, వారి వృత్తి వ్యాపారాలను బట్టి వైవాహికులు తీసుకోవాల్సిన నిర్ణయం. అంతేగాక సంతానోత్పత్తి అనేది ముఖ్యంగా మహిళలు, వారి సాధికారతపై ప్రభావం చూపించే అంశం. నగరాలలో చిన్న కుటుంబాలుగా నివసిస్తూ, వృత్తి వ్యాపారాల్లో నిమగ్నమైన దంపతులను ఇది ఒత్తిడికి గురిచేయవచ్చు. అలాగే ఇంకా జనాభా పెరగాలి అనుకుంటున్న ప్రభుత్వం, వారికోసం వైద్యం, మౌలిక వసతులు, విద్య, కనీస అవసరాలు, ఆహార భద్రతల కొరకు సంసిద్ధంగా ఉండాల్సిన అవసరం కూడా ఉంది.

ఏది ఏమైనా, ఈ చట్ట సవరణ స్థానిక సంస్థల రాజకీయాలపై ప్రభావం చూపుతుంది. ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉన్నవాళ్లూ స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడం వల్ల ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణా జరుగుతుంది. ఇక చట్ట ముఖ్య ఉద్దేశ్యమైన జనాభా పెరుగుదల జరుగుతుందా, జరిగితే దాని పర్యవసానాల్ని ఎదుర్కోవడానికి రాష్ట్రం, రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయా లేదా అన్నది సమయం ఛేదించవలసిన సవాలు.

■ ఓ. ప్రణతి

రాజనీతిశాస్త్ర అధ్యాపకులు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

కొత్తగా 53 జూనియర్ కళాశాలలు

ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్



- జనాభా ఆధారంగా 37 మండలాల్లో అవసరం
- రెండు పట్టణాభివృద్ధి సంస్థల్లోనూ డిమాండ్
- ఇప్పటికే రాష్ట్రంలో 3,381 కాలేజీల్లో ఇంటర్
- హైస్కూల్ ప్లస్‌లలో ఇకపై జూనియర్ లెక్చరర్లు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జూనియర్ కళాశాలలకు డిమాండ్ పెరుగుతోంది. తాజాగా జూనియర్ కాలేజీల అవసరంపై ఇంటర్ విద్యా మండలి సర్వే చేయగా.. రాష్ట్రవ్యాప్తంగా 37 మండలాల్లో 47 ఇంటర్ కళాశాలలు అవసరమని గుర్తించింది. అలాగే ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని రెండు పట్టణాభివృద్ధి సంస్థల్లో మొత్తం ఆరు కాలేజీల అవసరం ఉంది. ఈ మేరకు కొత్త కాలేజీల అవసరంపై ఇంటర్ విద్యామండలి చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం తాజాగా ఆమోదించింది. కొత్తగా 53 ప్రైవేటు జూనియర్ కాలేజీల ఏర్పాటు కోసం నోటిఫికేషన్ జారీకి అనుమతిచ్చింది.

ఎక్కడెక్కడ అవసరం అంటే..?

అల్లూరి జిల్లాలోని అనంతగిరి, కూనవరం, అనకాపల్లిలో మాడుగుల, రవికమతం, రాంబిల్లి, నక్కపల్లి, పరవాడ, అనంతపురం జిల్లాలో రాప్తాడు, యాడికి, బాపట్లలో సంతమాగులూరు, వేటపాలెం, కోనసీమలో ఐ.పోలవరం, కపిలేశ్వరపురం, రాయవరం, ఏలూరు జిల్లాలో టి.నర్సాపురం, ముసునూరు, గుంటూరులో మేడికొండూరు, కాకినాడలో కరప, కొత్తపల్లి, తొండంగి, కృష్ణాలో బాపులపాడు, గుడ్లవల్లేరు, దేవనకొండ, నంద్యాలలో పేపల్లి, ఎన్టీఆర్ జిల్లాలో చందర్లపాడు, పల్నాడులో క్రోసూరు, నాదెండ్ల, ఎడ్లపాడు, ప్రకాశంలో కొత్తపట్నం, కురిచేడు, పెద్దారవీడు, తాళ్లూరు, వెలిగండ్ల, పశ్చిమగోదావరిలో మొగల్తూరు, కడపలో మైలవరం, గోపవరం ప్రాంతాల్లో కొత్త కాలేజీలకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి యూడీఏలో రెండు, గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లి యూడీఏల్లో నాలుగు కాలేజీలు అవసరమని గుర్తించారు.

ఇప్పటికే భారీగా జూనియర్ కాలేజీలు

రాష్ట్రంలో ఇప్పటికే 3,381 విద్యాసంస్థలు ఇంటర్ విద్యను అందిస్తున్నాయి. అందులో 2వేలకు పైగా ప్రైవేటు కాలేజీలు, 470 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. ఇవి కాకుండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూల్స్, హైస్కూల్ ప్లస్‌లు, సాంఘిక సంక్షేమ, ఇతర సంక్షేమ సంస్థల పరిధిలోని కాలేజీలు ఇంటర్ విద్యను అందిస్తున్నాయి. భారీగా సంఖ్యలో కాలేజీలున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కాలేజీల అవసరం ఏర్పడుతోంది. పదో తరగతి పూర్తి చేసుకుని బయటకు వస్తున్న విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా కొత్త కాలేజీలు, అదనపు సీట్ల అవసరం కూడా ఏర్పడుతోంది. ప్రస్తుతం సుమారు 10 లక్షల మంది రాష్ట్రంలో ఇంటర్ చదువుతున్నారు.

'హైస్కూల్ ప్లస్'లలో మార్పులు!

ఉన్నత పాఠశాలల్లోనే ఇంటర్ విద్య అందించే ఉద్దేశంతో గత ప్రభుత్వం 292 పాఠశాలల్లో ప్రారంభించింది. వీటికి హైస్కూల్ ప్లస్‌లుగా పేరు పెట్టింది. కానీ పూర్తిస్థాయిలో బోధనా సిబ్బందిని కేటాయించలేదు. అవే పాఠశాలల్లో అర్హత కలిగిన టీచర్లకు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లుగా పదోన్నతి కల్పించి, వారిని ఇంటర్ బోధనకు కేటాయించింది. మరోవైపు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ముఖ్యంగా ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌కు అవసరమైన ల్యాబ్‌లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఏర్పాటు చేసినప్పటి నుంచి హైస్కూల్ ప్లస్‌లలో దారుణమైన ఫలితాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవస్థను బాగుచేయాలనే ఉద్దేశంతో అక్కడ పీజీటీల స్థానంలో జూనియర్ లెక్చరర్లను నియమించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మెరుగైన ఫలితాలు సాధించాలని చూస్తోంది. ఒకే కాంపౌండ్‌లో ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీ ఉండే విధంగా వాటి పేర్లు మార్చనుంది. కాగా, గత ప్రభుత్వం అనాలోచితంగా వీటిని ఏర్పాటు చేసిందని, వాటిని రద్దు చేయడం మేలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి.

ఇంటి వద్దే పశుగణన

- ఆన్‌లైన్ యాప్‌లో వివరాల నమోదు: వెటర్నరీ డైరెక్టర్

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):జాతీయ పశుగణన ప్రక్రియ పశువుల పెంపకందారుల ఇంటి వద్దే జరుగుతుందని పశు సంవర్థక శాఖ డైరెక్టర్ దామోదర నాయుడు తెలిపారు. ఆన్‌లైన్ యాప్‌లో 16 రకాల పశుజాతులు, పెంపకందారుల వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేస్తారని వెల్లడించారు. పెంపకందారులు కచ్చితమైన సమాచారమిచ్చి ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు. ఈ గణాంకాల ఆధారంగానే పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, ఇతర మందులు పశుపోషకులకు ఉచితంగా అందించడానికి వీలవుతుందని, పశు సంవర్థక శాఖ పథకాలు, కార్యక్రమాలకు రూపకల్పన జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 28 వరకు జరిగే ఈ సర్వేలో ఇప్పటి వరకు 25 శాతం పూర్తయినట్లు వివరించారు.

పాఠశాల ఎగ్గొట్టి.. కిడ్నాప్ కథ..!

- కారులో ఎత్తుకెళ్లారని చెప్పిన బాలిక
- భయంతో పోలీసులకు తండ్రి ఫిర్యాదు
- అసలు కథ చూపించిన సీసీ ఫుటేజీ

సీతానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక పాఠశాల ఎగ్గొట్టింది. తండ్రి ప్రశ్నించడంతో.. తాను కిడ్నాప్‌కు గురైనట్టు సినిమా స్టోరీ వినిపించింది. కూతురు చెప్పింది నిజమేనని నమ్మిన ఆ తండ్రి భయపడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాల్లో అసలు కథ బయటపడింది. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం లంకూరు గ్రామానికి చెందిన బాలిక (13) ఒక ప్రైవేట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. గురువారం ఉదయం స్కూలుకు బయల్దేరిన బాలిక అదే దారిలో ఉన్న శివాలయంలో దర్శనం చేసుకుని అక్కడ కూర్చుంది. మధ్యాహ్నం సమయానికే ఇంటికి చేరుకోవడంతో తండ్రి ఎందుకు వచ్చేశావని ప్రశ్నించాడు. దీంతో బాలిక కిడ్నాప్ స్టోరీ అల్లింది. ఐదుగురు వ్యక్తులు ఎర్రిగా బ్లాక్ కార్‌లో ముసుగులు వేసుకుని శివాలయం వద్ద ఉన్న తనను కిడ్నాప్ చేశారని తండ్రికి చెప్పింది. అయితే సీతానగరం గ్రామంలోని నాలుగు బొమ్మల సెంటర్‌లో ఆర్‌కే రెస్టారెంట్ వద్ద కారు ఆపి కిడ్నాపర్లు ఫోన్‌లలో మాట్లాడుతుండగా డోరు తీసుకుని పారిపోయి వచ్చానని తెలిపింది. దీంతో భయాందోళనకు గురైన తండ్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ సిబ్బంది పరుగులు తీశారు. సీతానగరంలో ఉన్న అన్ని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. శివాలయం వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా బాలిక శివాలయంలో కొంతసేపు కూర్చుని తర్వాత ఇంటికి వెళ్లినట్టు గుర్తించారు. బాలిక చెప్పిన కథకి, సీసీ కెమెరాల్లోని ఫుటేజీకి ఏ మాత్రం సంబంధం లేకపోవడంతో కిడ్నాప్ ప్రయత్నాలేమీ జరగలేదని పోలీసులు తేల్చేశారు. కేవలం స్కూల్ మానేయడానికే బాలిక ఈ కథ అల్లిందని.. ఐదుగురు కిడ్నాపర్లు ఉంటే తప్పించుకోవడం అంత తేలిక కాదని పేర్కొన్నారు.

కొడుకు మృతదేహంతో 70 కి.మీ. ప్రయాణం

- అంబులెన్స్ సమకూర్చని వైద్య సిబ్బంది
- 35 కి.మీ బస్సులో... 35 కి.మీ బైక్‌పై తరలింపు

కురుపాం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా పెంచుకున్న మూడేళ్ల కుమారుడి మృతదేహం ఒకవైపు.. చేతిలో చిల్లిగవ్వలేని పేదరికం మరోవైపు.. ఆ మృతదేహాన్ని 70 కిలోమీటర్లు ఎలా తీసుకెళ్లాలో తెలియని దీన స్థితిలో.. 'ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయండయ్యా..' అంటూ ఆ తండ్రి పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి సిబ్బందిని కన్నీటితో వేడుకున్నాడు. అంబులెన్స్ రిపేరులో ఉందని, తామేమీ చేయలేమని వారు చేతులెత్తేశారు. దీంతో ఆ తండ్రి పసిబిడ్డ మృతదేహంతో 35 కి.మీ. బస్సులో... మరో 35 కి.మీ బైక్‌పై ప్రయాణించి స్వగ్రామానికి చేరుకున్నాడు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం నీలకంఠాపురం గ్రామానికి చెందిన కొండగొర్రి అశోక్, స్వాతి దంపతుల కుమారుడు రోహిత్ (3) మంగళవారం బాగా ఏడుస్తుండడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. డాక్టర్ అభినవకుమార్ ప్రథమ చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అయితే రోహిత్ అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని తరలించేందుకు బాలుని తండ్రి అంబులెన్స్ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అశోక్, అతని అక్క.. రోహిత్ మృతదేహాన్ని భుజానవేసుకుని బస్సులో 35 కి.మీ. ప్రయాణించి కురుపాం చేరుకున్నారు. అక్కడి నుంచి స్నేహితుని బైక్‌పై మరో 35 కి.మీ. ప్రయాణంచేసి నీలకంఠాపురం చేరుకున్నాడు.

రూ.22.50 కోట్లతో పాస్ పుస్తకాలు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో ఆయన ఫొటోలు, పేరుతో ఇచ్చిన పాసుపుస్తకాల స్థానంలో కొత్తగా రాజముద్రతో పాసుపుస్తకాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాసు పుస్తకాలపై జగనన్న శాశ్వత భూ హక్కు అనే పేరును కూడా తొలగించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పాత పాసుపుస్తకాల స్థానంలో రైతులకు ఇకపై రాజముద్రతో కూడిన కొత్త వాటిని అందించాలని రెవెన్యూశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకోసం రూ.22.50 కోట్లు కేటాయించింది. అలాగే సర్వే రాళ్లపై జగన్, ఇతరుల పేర్లను తొలగించేందుకు మరో 12.50 కోట్లు కేటాయించింది. ఈ మేరకు రెండు పనులకు కలిపి రూ.35 కోట్ల నిధులు విడుదల చేస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇప్పటికే సర్వేరాళ్లపై జగన్ పేరు తొలగింపు పనులు మొదలయ్యాయి.



డైరెక్టర్లతో సమావేశమైన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

మాదిగల అభివృద్ధికి కలిసి కృషి చేద్దాం

- వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన అన్ని పథకాలు తిరిగి ప్రారంభిస్తాం: ఉండవల్లి శ్రీదేవి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాదిగల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లకు.. చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. గురువారం తాడేపల్లిలోని తన కార్యాలయంలో కార్పొరేషన్ డైరెక్టర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించడం తప్ప ఎస్సీల అభివృద్ధికి వినియోగించలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం మాదిగల అభివృద్ధికి నూరు శాతం కట్టుబడి ఉందని వారి అభ్యున్నతికి సీఎం చంద్రబాబు సహకారంతో కృషి చేస్తానని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీలకు రద్దు చేసిన అన్ని పథకాలు తిరిగి ప్రారంభిస్తున్నట్టు స్పష్టం చేశారు. మాదిగ, మాల, రెల్లి కార్పొరేషన్‌కు జగన్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని చెప్పారు.

పరిశ్రమలలో భద్రతపై సీఎం ప్రత్యేక దృష్టి

- ఇతర పరిశ్రమలకు కియా ఆదర్శం: మంత్రి వాసంశెట్టి

హిందూపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలలో భద్రతపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమను మరో మంత్రి సవితతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. కియలో కార్మికుల భద్రత గురించి ఆరా తీశారు. కియా సేఫ్టీ అధికారి రియాజ్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైర్ మాక్‌డ్రిల్, గ్యాస్ లీకేజీ డెమోను మంత్రులు తిలకించారు. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే పరిశ్రమలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోవాలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ... 'ఇతర పరిశ్రమలకు కియా ఆదర్శంగా నిలుస్తుంది. కియా అనుబంధ పరిశ్రమల్లో సుమారు 20వేల మంది ఉపాధి పొందుతుండటం హర్షణీయం. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం



కియ ప్రతినిధులతో మంత్రులు సవిత, వాసంశెట్టి సుభాష్

కారణంగా పలు పరిశ్రమల్లో భద్రతా లోపాలు తలెత్తాయి. 34 మంది మరణించారు. అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సీఎం చంద్రబాబు వసుధమిశ్ర కమిటీ ఏర్పాటు చేశారు. పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు, భద్రతా లోపాలను కమిటీ పరిశీలించి.. నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది. కియలో కార్మికుల భద్రత కోసం తీసుకున్న చర్యలను ఇతర పరిశ్రమలు కూడా పాటించాలి' అని అన్నారు. కియా ట్రైనింగ్ సెంటర్‌లో యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సవిత సూచించారు. కియాతో రాష్ట్రానికి, జిల్లాకు ఎంతో గుర్తింపు వచ్చిందని అన్నారు.



గురువారం కురిసిన వర్షానికి నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని మల్లెవేములలో దెబ్బతిన్న మినుము కాయలను చూపిస్తున్న రైతు

రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడింది. దీనిపై ఉన్న ఉపరితల ఆవర్తనం ఆగ్నేయ అరేబియా సముద్రంలో కొనసాగుతోంది. కాగా, బంగాళాఖాతం నుంచి వచ్చే తేమగాలులతో రాష్ట్రంలో గురువారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పశ్చిమ గోదావరి, శ్రీసత్యసాయి, కడప, కర్నూలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కళింగపట్నంలో 20.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

హెల్త్ వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ పోస్టుల భర్తీ ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ కె.బాబ్జీ వీసీగా రాజీనామా చేసిన తర్వాత ప్రభుత్వం కొత్త వీసీని నియమించలేదు. ప్రస్తుతం డీఎంఈగా ఉన్న డాక్టర్ నరసింహం ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్నారు. దాదాపు మూడు నెలల తర్వాత ప్రభుత్వం వీసీ పోస్టు కోసం సెర్చ్ కమిటీని నియమించింది. ఈ కమిటీలో మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ టి.రవిరాజును మెంబర్‌గా గవర్నర్ నియమించారు. హెల్త్ వర్సిటీ నుంచి మెంబర్‌గా డాక్టర్ సుబ్బారావు, కన్వీనర్‌గా ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును ప్రభుత్వం నియమించింది.

రాయచోటి ఘటనపై విచారణ చేయాలి: ఫ్యాప్టో

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో ఉపాధ్యాయునిపై విద్యార్థులు దాడిచేసిన ఘటనపై న్యాయ విచారణ జరిపించి, దోషులను వెంటనే శిక్షించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. టీచర్ ఇజాజ్ అహ్మద్ మృతిపై స్పందిస్తూ ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్.చిరంజీవి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఉన్నత విద్యామండలికి చైర్మన్‌ను నియమించాలి: ఎస్ఎఫ్ఐ

ఉన్నత విద్యామండలి అస్తవ్యస్తంగా మారిందని, ఖాళీగా ఉన్న చైర్మన్ పోస్టును వెంటనే భర్తీచేసి మండలిని గాడిలో పెట్టాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ మంత్రి లోకేశ్‌కు గురువారం లేఖ రాశారు.

రూసా ఎస్పీడీగా భరత్ గుప్తా

రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలను కళాశాల విద్యాశాఖ కమిషనర్ భరత్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల బదిలీల్లో భరత్‌గుప్తాను కేవలం కళాశాల విద్య కమిషనర్‌గా నియమించింది. ఇప్పుడు రూసా బాధ్యతలూ అప్పగించింది.

తిరుమలలో అన్యమత కడియాల విక్రయం, దుకాణం సీజ్

తిరుమల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అన్యమత గుర్తులు, పేర్లు ఉన్న కడియాల విక్రయం దుమారం రేపింది. కడియాన్ని కొనుగోలు చేసిన భక్తుడి ఫిర్యాదుతో టీటీడీ అధికారులు ఓ దుకాణాన్ని సీజ్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన సోదరులు శ్రీధర్, అఖిల్ శ్రీవారి దర్శనం కోసం బుధవారం తిరుమలకు వచ్చారు. పిల్లల కోసం సీఆర్వో ముందున్న ఎస్ఎన్‌సీ దుకాణాల షెడ్‌లోని ఓ దుకాణంలో ఓ స్టీల్ కడియంతో పాటు వేంకటేశ్వరస్వామి ఉంగరాన్ని కొనుగోలు చేశారు. కడియంపై జీసెస్ అని ఉండడాన్ని గమనించి వెంటనే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. చైర్మన్ ఆదేశాలతో టీటీడీ ఎస్టేట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దుకాణం వద్దకు వెళ్లి విచారించారు. మరికొన్ని కడియాలపై కూడా అలాంటి గుర్తులు, పేర్లు ఉండడాన్ని గుర్తించి ఆ దుకాణాన్ని తాత్కాలికంగా సీజ్ చేసి విచారణకు ఆదేశించారు.

భూకబ్జాలు, దాడులపై వినతుల వెల్లువ

- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదులు
- వినతులు స్వీకరించిన హోంమంత్రి అనిత
- బాధితులకు న్యాయం చేస్తామని హామీ

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో వైసీపీ మూకలు చేసిన అరాచకాలు, అక్రమాలు, భూకబ్జాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్‌లు వినతిపత్రాలు స్వీకరించారు. బాధితుల నుంచి అర్జీలు తీసుకుని వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

- గుంటూరు జిల్లా, కొత్తపేటలోని ప్రకాశ్‌నగర్‌లో కొన్నేళ్ల నుంచి వ్యభిచారం, గంజాయి తదితర చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు జరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన గుంజి అంకబాబు అనే వ్యక్తి విజ్ఞప్తి చేశారు.
- తమ పూర్వీకులు ఇచ్చిన స్థలాన్ని కొంత మంది కబ్జా చేశారని, వారి నుంచి తమ స్థలాన్ని విడిపించాలని తిరుపతి జిల్లా తుమ్మలగుంటకు చెందిన సరస్వతి అనే మహిళ వినతి పత్రం ఇచ్చారు.
- తమకు వారసత్వంగా వచ్చిన భూమిని డాక్టర్ గోపాల్, వెంకటేశ్వర్లు కబ్జా చేసి వారి పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ప్రశ్నించిన తమపై బైండోవర్ కేసులు పెట్టించి వేధిస్తున్నారని అనంతపురం జిల్లా గుంతకల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన డాక్టర్ ఎస్. మాధవరావు ఫిర్యాదు చేశారు.
- తమ గ్రామంలోని ఎంపీపీ స్కూల్ క్రీడా మైదానాన్ని వైసీపీ నేతలు పొట్లూరి పోలయ్య, మాదిరెడ్డి మాలకొండయ్య ఆక్రమించి విద్యార్థులకు ఆట స్థలం లేకుండా చేశారని ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం కోటాలపల్లి గ్రామానికి చెందిన ఎం. హరిబాబు విజ్ఞప్తి చేశారు.
- తాము టీడీపీ కార్యకర్తలమనే కారణంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసీపీ సర్పంచ్ గాంధీ, వారి కార్యకర్తలు కలిసి తమ ఇంటికి దారి లేకుండా అడ్డు గోడ కట్టారని చిత్తూరు జిల్లా కార్వేటి నగరానికి చెందిన సి. మోహనవల్లి తెలిపారు. ప్రశ్నించామన్న కారణంగా 35 మంది వైసీపీ కార్యకర్తలు తమ ఇంటిపై దాడి చేసి ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి తమ కుటుంబ పరువు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు.
- 2017లో ఏపీ సెక్యూరిటీ పోలీసు టెక్నికల్ బోటు సిబ్బందిగా నియమితులైన తమను వైసీపీ హయాంలో తొలగించారని 72 మంది సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు.

సంక్రాంతికి రేషన్‌కార్డులు లేనట్టే!

- ఇంతవరకూ ఉత్తర్వులివ్వని సర్కారు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హులైన పేదలకు కొత్త రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియ సంక్రాంతి పండుగకు పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తామని గొప్పలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేయడంతో రాష్ట్రంలో కొత్తగా పెళ్లిళ్లు చేసుకుని వేరు కాపురాలు పుట్టుకున్న జంటలు, గత ప్రభుత్వంలో రాజకీయ కారణాలతో రేషన్‌కార్డులు మంజూరు కానివారు వేల సంఖ్యలో కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త కార్డులు, స్ప్లిట్ కార్డులు, ఉన్న కార్డుల్లో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పుల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.40 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ కొత్త కార్డులు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. గత ప్రభుత్వం వైసీపీ రంగులతో ఇచ్చిన పాత కార్డులను తొలగించి, వాటి స్థానంలో కొత్తకార్డులను అందించేందుకు డిజైన్‌పై కసరత్తు కొనసాగుతోందని, త్వరలోనే కొత్తకార్డులను మంజూరు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పలు సందర్భాల్లో చెప్పారు. అందుకనుగుణంగా సివిల్ సప్లయిస్ అధికారులు కార్డుల డిజైన్‌పై ఇప్పటికే కసరత్తు పూర్తిచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించిన ప్రభుత్వం.. సంక్రాంతి కానుకగా రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులకు, ఇతర సర్వీసులకు ఈనెల 2వ తేదీ నుంచే దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుందంటూ వార్తలు వచ్చాయి. దీంతో కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారంతా దరఖాస్తులు చేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ దీనికి సంబంధించి ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. దరఖాస్తులు చేసుకోవడానికి ఆప్షన్ కూడా ఇవ్వలేదు. కొత్తకార్డుల మంజూరు విషయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నారు.

అపార్‌కు ఆధార్ ఇబ్బందులు

- ఆధార్, పాఠశాల రికార్డుల్లో వ్యత్యాసం
- తేడాలు ఉంటే తీసుకోని వెబ్‌సైట్
- రాష్ట్రవ్యాప్తంగా 77 శాతం మందికే అపార్

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఐడీల తయారీ పెద్ద తలనొప్పిగా మారింది. విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీల్లో ఉన్న వ్యత్యాసాలను విద్యాశాఖ వెబ్‌సైట్ తీసుకోకపోవడంతో అపార్ ఐడీల సృష్టి అసాధ్యంగా మారింది. ఇప్పటివరకూ 77 శాతం మంది విద్యార్థులకే అపార్ ఐడీలు సృష్టించారు. మిగిలిన వారికి ఇప్పట్లో ఐడీలు చేయడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. అయితే ఈ ఐడీల తయారీకి పాఠశాల విద్యాశాఖ అధికారులు తమపై ఒత్తిడి చేస్తున్నారని టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అపార్ ఐడీలు తయారు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ నిర్ణయం. పాఠశాలల్లో చేరిన నాటి నుంచి ఉన్నత విద్య పూర్తిచేసేవరకూ వారికి శాశ్వతంగా ఒక ఐడీ ఉండాలనే ఉద్దేశంతో అపార్ ఐడీలను తీసుకొచ్చింది. రాష్ట్రాలు ఈ ఏడాది నుంచి విద్యార్థులకు అపార్ ఐడీలు తయారు చేస్తున్నాయి. అందులో భాగంగా పాఠశాల విద్యాశాఖలో అపార్ ఐడీల సృష్టి ప్రారంభించిన రోజు నుంచీ ఇబ్బందులు తలెత్తుతూనే ఉన్నాయి. విద్యార్థుల పేర్లు పాఠశాల రికార్డుల్లో ఒక విధంగా, ఆధార్ కార్డుల్లో మరోవిధంగా ఉంటే వెబ్‌సైట్ వాటిని తీసుకోవట్లేదు. దాన్ని పరిష్కరించేందుకు టీచర్లు జనన ధృవీకరణ పత్రం తీసుకురావాలని విద్యార్థులకు సూచిస్తున్నారు. దాంట్లోనూ ఏమైనా తేడాలుంటే ఐడీ క్రియేట్ చేయడం సాధ్యం కావట్లేదు. ఆధార్ తీసుకునే సమయంలో చాలా తప్పులు దొర్లుతున్నాయి. ఆధార్ కార్డులు జారీలో అప్పట్లో హడావిడిగా పేర్లు నమోదుచేశారు. పుట్టిన తేదీల్లోనూ తప్పులు నమోదు చేశారు. ఇప్పుడు వాటిని సరిదిద్దడం ఇబ్బందిగా మారింది. ఆధార్‌లో తప్పులు సరిదిద్దాలంటే జనన ధృవీకరణ పత్రం అవసరం. అది లేని విద్యార్థులు ఏంచేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ తాత్కాలికంగా దీన్ని నిలిపివేసింది.

జనవరి 1 నుంచి కర్నూలులో

రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో జనవరి ఒకటో తేదీ నుంచి జనవరి 3 వరకు రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంఘిక నాటికలకు ఆదరణ కల్పించాలనే లక్ష్యంతో హైదరాబాదులోని మహతి క్రియేషన్స్ సంస్థ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో ఈ ఉత్సవాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సినీ, టీవీ నటుడు యు.సుబ్బరాయశర్మ సారథ్యంలో ఈ నాటకోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.

చంద్రబాబు సీఎం అయ్యాక
పోలవరం పనుల్లో వేగం

» త్వరలో ప్రాజెక్టును సందర్శిస్తా: జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ఏపీ సీఎం అయ్యాక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చెప్పారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయడానికి కేంద్రం కట్టుబడి ఉందని.. 2027 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. గురువారం ఢిల్లీలో గృహప్రవేశం సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులకు విందు ఇచ్చారు. ఈ సందర్భంగా తెలుగు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. త్వరలో పోలవరం సందర్శనకు వస్తానన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటికే చాలా నిధులు అందించామని, రాష్ట్రప్రభుత్వం ఖర్చు పెట్టిన సొమ్మును రీయింబర్స్ చేస్తున్నామని తెలిపారు. కాగా, పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసేందుకు, భద్రతకు సంబంధించి సాంకేతిక, నిర్మాణపరమైన అంశాలపై నలుగురు అంతర్జాతీయ నిపుణులతో కూడిన బృందం కీలక సిఫారసులు చేసిందని కేంద్ర జలశక్తి సహాయ మంత్రి రాజ్‌భూషణ్ తెలిపారు.

దర్యాప్తు అధికారి ముందు 29 వరకు హాజరు కానక్కర్లేదు

» వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి హైకోర్టు మినహాయింపు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి హైకోర్టు స్వల్ప ఊరట కల్పించింది. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా చార్జిషీటు దాఖలు చేసేవరకు.. లేదా మూడు నెలల పాటు ప్రతి నెలా 1వ తేదీ, 15వ తేదీన ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని విధించిన షరతును తాత్కాలికంగా సవరించింది. ఈ నెల 29 వరకు హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఆ తర్వాత యథాతథంగా షరతులు పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నేతిగుట్లపల్లె, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపు విషయంలో వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లిన తమపై మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారంటూ ఏఎస్‌ఆర్‌కే ప్రసాద్, సొహైల్ బాషా ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదుల ఆధారంగా మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మరికొందరిపై పుంగనూరు పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో మిథున్‌రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు పై షరతు విధించింది. దీనిపై మిథున్‌రెడ్డి తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. మిథున్‌రెడ్డి తరఫున న్యాయవాది కె.గుణశేఖర్ వాదనలు వినిపించారు.

మాజీ మంత్రి విడదల రజినిపై ఫిర్యాదు

చిలకలూరిపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజినిపై గురువారం యడవల్లి దళిత రైతులు పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ భూములను అన్యాయంగా, అక్రమంగా లాగేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రజినీ పైన, అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పైన కేసు నమోదు చేయాలని వారు కోరారు. తమను మభ్యపెట్టి విలువైన గ్రానైట్ నిక్షేపాలున్న భూములను చేజిక్కించుకున్నారన్నారు.

ఏపీలో గూగుల్ ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

అందిపుచ్చుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. ఈ ఒప్పందం ప్రకారం అంతర్జాతీయంగా ఏఐ రంగంలో వస్తున్న సాంకేతిక నైపుణ్యాలపై పాఠశాలలు,కళాశాల విద్యార్థులకు గూగుల్ శిక్షణ ఇవ్వనుంది. అలాగే స్టార్టప్ లు, సంప్రదాయ పరిశ్రమలు, చిన్న వ్యాపార సంస్థలకు అవసరమైన ఏఐ ఆధారిత సేవల కోసం శిక్షణా కార్యక్రమాలను చేపడుతుంది. ఆరోగ్య సంరక్షణ, పర్యావరణం, సుస్థిరత లాంటి కీలకాంశాల్లో ఏఐ అండ్ ఎంఎల్ సొల్యూషన్‌ను ఏకీకృతం చేయడానికి గూగుల్ రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుంది. ఏఐ ఆధారిత వ్యవస్థ ద్వారా ఆర్థిక వృద్ధికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను చేపడుతుంది. ఈ కార్యక్రమంలో ఈడీబీ సీఈవో సాయికాంత్‌వర్మ, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్‌కుమార్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో సానుకూల ప్రయోజనాలు: గూగుల్

పరిపాలనా వ్యవస్థలో ఏఐ ఉపయోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలన్న సీఎం చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకున్నామని గూగుల్ మ్యాప్స్ జనరల్ మేనేజర్ లలితా రమణి అన్నారు.

ఈజ్ ఆఫ్ లివింగ్ మా లక్ష్యం

ఈజ్ ఆఫ్ లివింగ్ మా ప్రభుత్వ లక్ష్యం. ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లు, సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, వారే సెల్‌ఫోన్ వంటి పరికరాల ద్వారా పొందేందుకు ఏఐ ఉపయోగపడుతుంది. యువతకు ఏఐ ఆధారిత భవిష్యత్తు అవకాశాలను కల్పించేందుకు ఏపీతో గూగుల్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం. క్లిష్టమైన రంగాల్లో ఏఐ సేవలను వినియోగించడం ద్వారా కార్యకలాపాలను సులభతరం చేయవచ్చు. ఏఐ ఆధారిత వర్క్‌ఫోర్సును సిద్ధం చేయడంలో గూగుల్ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ ఒప్పందం ద్వారా యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందుబాటులోకి వస్తుంది. తద్వారా అపార అవకాశాలు లభిస్తాయి.

- లోకేశ్, రాష్ట్ర మంత్రి

సీఎంతో గూగుల్ బృందం భేటీ

ఒప్పందం చేసుకోవడానికి ముందు చంద్రబాబుతో గూగుల్ క్లౌడ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అండ్ కంట్రీ ఎండీ విక్రమ్‌సింగ్ బేడీ బృందం సమావేశమైంది. ఒప్పందాన్ని ఒక గొప్ప ముందడుగా చంద్రబాబు అభివర్ణించారు.

ఒప్పందంలోని కీలకాంశాలు

విద్యా నైపుణ్యాభివృద్ధి

విద్యార్థులు, డెవలపర్లకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత నైపుణ్యాల కోసం 10 వేలమందికి గూగుల్ ఎసెన్షియల్ పేరుతో నైపుణ్య శిక్షణ కోర్సును అందిస్తుంది. రోజువారీ జీవితంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎలా ఉపయోగించాలి, ఏఐ ద్వారా ఉత్పాదకతా సామర్థ్యం ఎలా పెంచాలి వంటి అంశాలు ఈ కోర్సులో అంతర్భాగంగా ఉంటాయి. సైబర్ సెక్యూరిటీ, డేటా ఎనలిటిక్స్, జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో గూగుల్ క్లౌడ్ సర్టిఫికేషన్లు, స్కిల్ బ్యాడ్జ్‌లను గూగుల్ అందజేస్తుంది. ప్రభుత్వ ఏజెన్సీల కోసం స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లను అందించడానికి గూగుల్ క్లౌడ్ సహకరిస్తుది. స్కిల్లింగ్ ఇనీషియేషన్‌లలో గూగుల్ డెవలపర్ కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లు, ఆండ్రాయిడ్ యాప్ స్కిల్లింగ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌లకు గూగుల్ ద్వారా యాక్సెస్ లభిస్తుంది.

ఎకో సిస్టమ్‌కు సహకారం

స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎనేబుల్‌మెంట్, మెంటర్‌షిప్, ఎంటర్‌షిప్, నెట్‌వర్కింగ్ అవకాశాలు అందుతాయి. స్టార్టప్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ల కోసం గూగుల్ ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ ఎకో సిస్టమ్‌తో కలసి పనిచేస్తుంది.

సుస్థిరత

గాలి నాణ్యత, పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడంలో గూగుల్ ఏఐ ఆధారిత సేవలను అందిస్తుంది.

హెల్త్ కేర్

నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడంలో ఏఐ అప్లికేషన్‌లను అన్వేషించడం, హెల్త్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్స్ (హాయ్-డీఈఈ) ద్వారా పరిశోధనా కార్యక్రమాలకు గూగుల్ మద్దతు ఇస్తుంది.

ఏఐ పైలట్‌లు

వ్యవసాయం, ట్రాఫిక్ నిర్వహణ, వెబ్‌సైట్ ఆధునీకరణ, పౌరుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలలో క్లౌడ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రయోజనాలపై పైలట్ ప్రాజెక్టులకు గూగుల్ సహకరిస్తుంది.

విశాఖలో లక్ష కోట్లతో గూగుల్ క్లౌడ్ సెంటర్

» 11న డీల్.. 6 నెలల్లో పనులు ప్రారంభం

» నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంటు: సీఎం

విశాఖపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో క్లౌడ్ సెంటర్ ఏర్పాటుకు ఐటీ దిగ్గజం గూగుల్ ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గూగుల్ సంస్థ సుమారు రూ.లక్ష కోట్లకుపైగా పెట్టుబడితో క్లౌడ్ సెంటర్ ఏర్పాటు చేయనుందని విశాఖలో తెలిపారు. గూగుల్‌తో ఈ నెల 11వ తేదీన ఒప్పందం కుదుర్చుకుంటున్నామని, ఆరు నెలల్లో విశాఖలో పనులు ప్రారంభిస్తుందని తెలిపారు. అలాగే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీపాన సుమారు లక్ష కోట్ల రూపాయలతో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్లాంటు ఏర్పాటుకు దాదాపు అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అలాగే నక్కపల్లిలో మిట్టల్ సంస్థ దాదాపు రూ.80 వేల కోట్లతో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. విశాఖకు మెట్రో వస్తోందని చెప్పారు. ఈ ప్రాజెక్టులన్నీ కలిపి రూ.నాలుగు లక్షల కోట్లు పెట్టుబడులు విశాఖకు వస్తున్నాయని వివరించారు.

అల్లు అర్జున్‌పై కేసు నమోదు

» పుష్ప-2 షోలో తొక్కిసలాట ఘటనలో హీరో, ఇతరులపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు

» హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీ వెల్లడి



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు.. సంధ్య థియేటర్ యాజమాన్యం, అల్లు అర్జున్ సెక్యూరిటీ సిబ్బందిపైనా నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. ఈ ఘటనలో ఒక మహిళ (39)చనిపోగా, ఆమె కుమారుడు (9) చావుబతుకుల మధ్య ఉన్నాడు. అల్లు అర్జున్‌కు ఈ బాలుడు అభిమాని. అల్లు అర్జున్ డ్యాన్స్‌ను అనుకరిస్తూ ఆ చిన్నారి వేసిన స్టెప్పులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అల్లు అర్జున్‌ను చూడాలన్న కుమారుడి ముచ్చట తీర్చడం కోసమే బుధవారం రాత్రి సంధ్య థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లి.. ఆ కుటుంబం పెను విషాదంలో కూరుకుపోయింది. ఆ వివరాల్లోకి వెళితే.. పుష్ప-2 ప్రీమియర్ షో చూసేందుకు రేవతి, భాస్కర్ దంపతులు కుమారుడు శ్రీతేజ్, కుమార్తె సాన్విక (7)తో కలిసి వెళ్లారు. షో చూసేందుకు అల్లు అర్జున్ ఆ థియేటర్ వద్దకు వచ్చారు. అక్కడ పెద్దసంఖ్యలో ఉన్న అభిమానులు ఆయనను చూసేందుకు ఎగబడ్డారు. అల్లు అర్జున్ థియేటర్‌లోకి వెళ్లాక.. అభిమానులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అప్పుడు జరిగిన తోపులాటలో భాస్కర్, సాన్విక ఒకవైపు వెళ్లగా, రేవతి, శ్రీతేజ్ మరోవైపు చెదిరిపోయారు. ఈ క్రమంలో తొక్కిసలాటలో వారిద్దరు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. రేవతిని ఆస్పత్రికి తరలించి బతికించే ప్రయత్నం చేసినా, వీలు కాలేదు. శ్రీతేజ్‌ను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రికి తెచ్చేసమయానికి శ్రీతేజ్ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడని గురువారం ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇప్పటికీ బాలుడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నదని పేర్కొన్నాయి.

బాలుడి తండ్రి ఫిర్యాదుతో..

మృతురాలు రేవతి భర్త భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ వెల్లడించారు. ఈ కేసులో హీరో అల్లు అర్జున్, ఇతరులపై 105 (నిర్లక్ష్యం), 118(1) (ఎక్కువ మంది కారణంగా నేరం జరగడం), రెడ్‌విత్ 3(5) (గుంపుగా ఎక్కువ మంది ఒకే నేరం చేయడానికి కారణం) వంటి సెక్షన్‌లు నమోదు చేసినట్టు తెలిపారు. అల్లు అర్జున్ థియేటర్‌కు వస్తున్నట్టు యాజమాన్యం..పోలీసులకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. హీరో థియేటర్‌లోకి ప్రవేశించడానికి అనువుగా ఉండేలా ప్రత్యేకప్రవేశ ద్వారం ఏర్పాటు చేయలేదని చెప్పారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందితో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌కు వచ్చిన అల్లు అర్జున్.. నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా అక్కడకు సమీపంలోని క్రిస్టల్ హోటల్ నుంచి ఓపెన్ టాప్ కారులో లోపలికి వచ్చారని వివరించారు. దీంతో ఆయనతో సెల్ఫీలు దిగడానికి అభిమానులు పెద్ద ఎత్తున ఎగబడటంతో తొక్కిసలాట జరిగినట్లు పోలీసుల విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు.

వైసీపీ మాఫియాపై సిట్!

(మొదటి పేజీ తరువాయి)

అన్ని జిల్లాలకు వెళ్లి.. ఇతర విభాగాల అధికారులతో కలిసి ఆయా అంశాలపై ఆరా తీశారు. రెండు నెలలపాటు శ్రమించి నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. దీనిపై 'సిట్'ను నియమించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది.

ఇదీ నేపథ్యం...: అధికారంలో ఉన్న వాళ్లు అవినీతికి పాల్పడటం షరా మామూలే! కానీ... ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగింది వేరు. అప్పటి ముఖ్యమంత్రి నుంచి గల్లీ నాయకుల దాకా అధికారం అండగా చెలరేగిపోయారు. అధికారం అండతో 'మాఫియా' తరహా డీల్స్ జరిగాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో అనేక కంపెనీలు చేతులు మారిపోయాయి. రాష్ట్ర స్థాయిలో గనులు, పోర్టులు, డిస్టిలరీలు, సెజ్‌లు, హోటళ్లు, రిసార్టులు... ఇలా ఒక్కటేమిటి! ఎక్కడ ఆదాయం ఉంటే అక్కడ అడుగు పెట్టి... అసలు వాటాదారులను, యజమానులను తరిమేశారు. వాటిని వైసీపీ పెద్దలు సొంతం చేసుకున్నారు. ఇక జిల్లాల స్థాయిలో ఎక్కడికక్కడ వైసీపీ నేతలు తమ అనుచరగణంతో చెలరేగిపోయారు. భూకబ్జాలు, దందాలకు పాల్పడ్డారు. అప్పట్లో ఐదు శాతం మంది బాధితులు కూడా దీనిపై నోరు తెరవలేకపోయారు. అక్కడక్కడా ఫిర్యాదులు చేసినా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోలేదు. 95 శాతం మంది పూర్తి సైలెంట్‌గా ఉన్నారు. కొందరు భయంతో ఊళ్లు, ప్రాజెక్టులు వదిలి వెళ్లిపోయారు. ప్రభుత్వం మారిన తర్వాత బాధితులకు ధైర్యం వచ్చింది. టీడీపీ కార్యాలయానికి వందలూ, వేల సంఖ్యలో ఫిర్యాదుదారులు వచ్చి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదులు చేశారు... చేస్తున్నారు. ఈ దారుణాలను ఉపేక్షిస్తే ప్రజాస్వామ్యానికే అర్థం ఉండదని ప్రభుత్వం భావించింది. వీరందరికీ న్యాయం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగి... రెండు నెలలపాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశీలించి ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించింది.

కళ్లు తిరిగే స్థాయిలో...: విశాఖలో ప్రైవేటు భూముల ఆక్రమణ నుంచి అనంతపురంలో 'కియా'కు బెదిరింపుల దాకా... అనేక అంశాలను విజిలెన్స్ విభాగం తన నివేదికలో పొందుపరిచింది. రుషికొండకు గుండు కొట్టడం, గుడివాడలో క్యాసినోలు, కాకినాడలో ద్వారంపూడి బియ్యం దందా, గోదావరి జిల్లాలో ఆవ భూముల ఆక్రమణ, గుంటూరులో పిన్నెల్లి ఆగడాలు... ఇలా అనేక అక్రమాలను ఇతర విభాగాల అధికారులతో కలిసి నిగ్గు తేల్చారు. ఇక... రాష్ట్ర స్థాయి పెద్దల ఆదేశాల మేరకు జరిగిన డిస్టిలరీల ఆక్రమణ, వంతాడ లేటరైట్ గనుల కబ్జా, కాకినాడ పోర్టులో వాటాల బదిలీ, విశాఖలో విలువైన ప్రాజెక్టుల స్వాధీనం వంటి అంశాలనూ నివేదికలో సమగ్రంగా పొందుపరిచారు. గ్రామస్థాయి భూకబ్జాల నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగిన అరాచకాల దాకా అన్ని అంశాలనూ రెండు నెలలు శ్రమించి కూపీ లాగారు. ఈ దందాల తీరు, తీవ్రత చూసి ఉన్నతాధికారులు విస్తుపోయినట్లు తెలిసింది. కళ్లుతిరిగేలా సాగిన ఈ క్రైమ్‌పై సినిమా తీస్తే పది సీక్వెల్‌లూ సరిపోవని... సీరియల్ తీయాలంటే వందల ఎపిసోడ్లు కావాలని వ్యాఖ్యానిస్తున్నారు.

నవ్య | చిత్రజ్యోతి

గడ్డంతో గొడవ... సుఖాంతం



'అమరన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్నారు శివ కార్తీకేయన్. ఆయన నటించే 25వ చిత్రాన్ని.. 'గురు', 'ఆకాశమే హద్దు' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న సుధా కొంగర తెరకెక్కించనున్నారు. అయితే ఈ చిత్రం నిలిచిపోయిందని.. టెస్ట్ షూట్ సమయంలో శివ కార్తీకేయన్, సుధా కొంగర మధ్య విభేదాలు తలెత్తడమే కారణమని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తల్లో నిజం లేదని.. అనుకున్నట్లుగానే సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుందని తెలిసింది. ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందట. కాగా, ఈ సినిమా కోసం శివకార్తీకేయన్‌కు గడ్డం పెంచమని దర్శకురాలు చెప్పారట. అయితే, టెస్ట్ షూట్ సమయంలో మళ్లీ ఆమే గడ్డం ట్రిమ్ చేయమని చెప్పడంతో అది నచ్చక ఆయన సెట్స్ నుంచి వెళ్లిపోయారనే వార్త వైరల్ అయిన సంగతి తెలిసిందే.

హిందీ సినిమా చేస్తుందా?



నటి ప్రియాంక జోనాస్ బాలీవుడ్‌కు తిరిగి వచ్చేస్తున్నారనే వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. రీసెంట్‌గా సిటాడెల్ వెబ్ సిరీస్ షూటింగ్‌లో పాల్గొన్న ప్రియాంక తాను త్వరలో హిందీ సినిమా చేయబోతున్నట్లు హింట్ ఇచ్చారు. అయితే ఈ వార్తలు చక్కర్లు కొడుతుండగానే ప్రియాంక తల్లి మధు చోప్రా మాత్రం తమ ప్రొడక్షన్ హౌస్ కార్యకలాపాలను అమెరికాకు షిఫ్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆమె ఓ భారతీయ మీడియా సంస్థతో జరిపిన చాట్ ప్రియాంక బాలీవుడ్‌కు వచ్చే అవకాశాలు లేవనే వాదనకు బలం చేకూరుస్తోంది. 'మా ప్రొడక్షన్ హౌస్ 'పర్పల్ పెబ్బల్' అమెరికా తరలిపోయింది. ప్రస్తుతానికైతే ఇక్కడ ఏ సినిమాలూ చేయడం లేదు. కానీ ప్రియాంక ఇండియాకు వస్తే... అప్పుడు ఆలోచిస్తాం. ప్రస్తుతానికైతే ఎలాంటి ప్లాన్‌లు లేవు' అని పేర్కొన్నారు. ప్రియాంక రాకకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఆమె అభిమానులకు, మరీ ముఖ్యంగా 'జీలే జరా' మూవీలో ప్రియాంకతో కలసి నటించిన అలియా భట్, కత్రీనా కైఫ్‌లకు మధు చోప్రా మాటలు నిరాశ కలిగించాయి. 2021లో ప్రారంభమైన 'జీలే జరా' సినిమా షూటింగ్ కొన్ని కారణాల వల్ల మధ్యలోనే ఆటకెక్కినట్లు వార్తలొచ్చాయి. ఈ సినిమా నిర్మాణాన్ని ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఫర్హాన్ అక్తర్ మొదలు పెట్టారు. అయితే ఈ మూవీ అప్డేట్ గురించి ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు ప్రియాంక సమాధానాలు దాటవేశారు. ఈ సినిమా గురించి తన వద్ద సమాచారం లేదంటూనే... ఈ ప్రాజెక్టుపై ఆశావాదంతో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. కాగా, అనేక ఇంటర్నేషనల్ కమిట్‌మెంట్స్ ఉన్నప్పటికీ బాలీవుడ్‌కి తిరిగి వస్తున్నానంటూ తన అభిమానులను ఆటపట్టిస్తూ 'ఇక్కడ ఎంతో మంది నిర్మాతలను కలుస్తుంటాను. స్క్రిప్ట్‌లను చదువుతున్నాను. హిందీలో ఏదైనా చేయాలనే అమితాసక్తితో ఉన్నాను' అని పేర్కొన్నారు. ప్రస్తుతం హాలీవుడ్‌లో సిటాడెల్ సీజన్-2తో పాటు 'ద బ్లఫ్', 'హెడ్స్ ఆఫ్ స్టేట్' చిత్రాల షూటింగ్ పూర్తి చేశారు.



బుధవారం అక్కినేని నాగచైతన్య, శోభిత వివాహబంధంతో ఒక్కటయ్యారు. అన్నపూర్ణ స్టూడియోలో ఏయన్నార్ విగ్రహం సమీపంలోనే వీరి వివాహం జరిగింది. వివాహానంతరం ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి తన ఆనందం వ్యక్తం చేసిన నాగార్జున తన తండ్రి ఏయన్నార్ విగ్రహం దగ్గర తమ కుటుంబ సభ్యులందరూ కలసి దిగిన ఫొటోని గురువారం షేర్ చేసి 'డియర్ ఫ్రెండ్స్, ఫ్యామిలీ, ఫ్యాన్స్.. మీ ప్రేమ, ఆశీస్సులు ఈ వేడుకను ప్రత్యేకం చేశాయి. నా కుమారుడి పెళ్లి కేవలం కుటుంబ వేడుకే కాదు.. మీ అందరి వల్ల అది ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకమైంది. అక్కినేని కుటుంబం తరఫున మీ అందరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'పుష్ప 2' చిత్రం గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుకుమార్, నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్, సీఈవో చెర్రీ మెగాస్టార్ చిరంజీవి ఇంటికి వెళ్లి ఆయన్ని కలిసిన దృశ్యం

ప్రేమకథ ప్రారంభం



శ్రీ లక్ష్మీనరసింహ ఆర్ట్స్ ప్రొడక్షన్ బేనర్‌లో దీపక్ సరోజ్ హీరోగా తన్నీరు హరిబాబు నిర్మిస్తున్న నూతన చిత్రం గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సినిమాతో హరీశ్ గదగాని దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దీక్షిక, అనైరా హీరోయిన్లుగా నటిస్తున్నారు. దర్శకుడు వేణు ఉడుగుల క్లాప్ కొట్టగా, సుజిత్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలిషాట్‌కి సందీప్ డైరెక్షన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు హరీశ్ మాట్లాడుతూ 'ఇది కంప్లీట్ లవ్ జానర్ సినిమా. చిత్ర నిర్మాణాన్ని జనవరిలో మొదలుపెట్టి ఏప్రిల్‌లో ముగించేలా ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు. హీరో దీపక్ సరోజ్ మాట్లాడుతూ' నేను మంచి కథ కోసం చూస్తున్నప్పుడు ఈ అవకాశం వచ్చింది. అనూప్ రూబెన్స్ మంచి సంగీతం అందిస్తున్నారు' అని చెప్పారు. నిర్మాత హరిబాబు మాట్లాడుతూ 'ఈ సినిమాతో నిర్మాతగా పరిచయం అవుతున్నాను కథ చెప్పిన వెంటనే నాకు బాగా నచ్చింది' అని తెలిపారు. చిత్రంలో రఘుబాబు, హైపర్ ఆది, సత్య, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

దీపిక కాదు దిమ్రినే నంబర్ వన్!



'లైలా మజ్నూ', 'కళ' సినిమాల్లో కథానాయికగా నటించినా.. 'యానిమల్'లో చేసిన ఓ చిన్న పాత్రతో నేషనల్ వైడ్ సెన్సేషన్ అయ్యారు బాలీవుడ్ త్రిప్తీ దిమ్రి. ఇటీవలే 'బ్యాడ్ న్యూజ్', 'విక్కీ విద్య కా వో వాలా వీడియో', 'భూల్ భూలయ్యా-3' చిత్రాలతో ప్రేక్షకులను పలకరించారీ బ్యూటీ. తాజాగా, ఈ నటి ఓ అరుదైన గౌరవాన్ని పొందారు. ఐఎమ్‌డీబీ వెబ్‌సైట్, 2024లో అత్యంత ప్రజాదరణ పొందిన పది మంది భారతీయ స్టార్స్ లిస్ట్‌ను ప్రకటించింది. ఇందులో త్రిప్తి మొదటి స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఆమె అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ లిస్ట్‌లో రెండో స్థానంలో దీపిక పదుకొణే, తర్వాతి స్థానంలో 'ధడక్' ఫేమ్ ఇషాన్ కట్టర్, నాలుగో స్థానంలో షారుక్ ఖాన్, ఐదో స్థానంలో శోభిత ధూళిపాళ.. తొమ్మిదో స్థానంలో ఆలియా భట్, పదో స్థానంలో ప్రభాస్ ఉన్నారు.





గుణదల రైల్వే స్టేషన్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు (ఇన్‌సెట్) విశాలమైన ప్లాట్‌ఫామ్

గుణదల రైల్వేస్టేషన్‌కు మహర్దశ

విజయవాడ రైల్వేస్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా గుణదల ఏర్పాటు

విజయవాడ స్టేషన్‌పై రద్దీని నివారించేందుకు రైల్వేశాఖ నిర్ణయం

దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా ఉన్న బెజవాడ ఏ1 స్టేషన్‌పై రద్దీని తగ్గించటంతో పాటు కొంత భారాన్ని మోసేందుకు గుణదల రైల్వేస్టేషన్ సిద్ధమవుతోంది. రైల్వే అధికారులు రాయనపాడు తర్వాత గుణదలను రెండో శాటిలైట్ స్టేషన్‌గా ప్రకటించారు. విజయవాడ స్టేషన్‌లో నిలిచే చాలా రైళ్లు గుణదల నుంచే ఇక రాకపోకలు సాగిస్తాయి. రాయనపాడు శాటిలైట్ స్టేషన్ నగరానికి దూరంగా ఉండటం వల్ల రానున్న రోజుల్లో గుణదల రైల్వేస్టేషన్ క్రియాశీలకంగా పనిచేయబోతోంది. ఒకప్పుడు బెజవాడకు దూరంగా ఓ చిన్న రైల్వేస్టేషన్‌గా ఉన్న గుణదల మరికొద్ది రోజుల్లోనే విజయవాడ స్టేషన్ స్థాయిని అందుకోబోతుంది.

- శాటిలైట్ స్టేషన్ హోదాలో రూ.36.5 కోట్లతో రీ డెవలప్‌మెంట్ పనులు
- సిద్ధమవుతున్న నూతన ఆర్కిటెక్చర్ భవనాలు, విశాలమైన వెయిటింగ్ హాల్స్
- 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, 3 ప్లాట్‌ఫామ్‌లు, భారీ రూఫ్‌ల ఏర్పాటు

గుణదల రైల్వేస్టేషన్ అభివృద్ధిపై మీడియా టూర్ నిర్వహించిన రైల్వే అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమృత్ భారత్ స్కీమ్ ఫేజ్ - 1 కింద గుణదల రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్‌కు రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. గుణదల రైల్వేస్టేషన్‌ను రూ.36.5 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నారు. గుణదల రైల్వేస్టేషన్ రీడెవలప్‌మెంట్ తుది దశలో ఉంది. మరికొద్ది నెలల్లోనే అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా గురువారం రైల్వే అధికారులు మీడియా టూర్ నిర్వహించి గుణదల రైల్వే విశేషాలను వెల్లడించారు. ఏడీఆర్ఎం (ఇన్ఫ్రా) ఎడ్విన్, గతి శక్తి చీఫ్ ఇంజనీర్ రమణారావు, పీఆర్వో నుస్రత్‌లు గుణదల స్టేషన్ రీ డెవలప్‌మెంట్ గురించి మీడియాకు వివరించారు. గుణదల రైల్వేస్టేషన్‌ను అద్భుతమైన ఆర్కిటెక్చర్ నైపుణ్యంతో తీర్చిదిద్దుతున్నారు. విశాలమైన ప్లాట్‌ఫామ్‌లు, ఆధునికమైన స్టేషన్, అందులో వసతులను కల్పించారు. ప్రయాణికులకు వెయిటింగ్ హాల్స్, మరుగుదొడ్లు, ప్లాట్‌ఫామ్‌లపై ఆకర్షణీయమైన ఫ్లోర్, పై కప్పులపై సోలార్ ప్లేట్లను అమర్చడం వంటివి ప్రత్యేక ఆకర్షణలుగా ఉన్నాయి. గుణదల రైల్వేస్టేషన్‌ను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నారు.

మూడు దశల్లో పనులు

ప్రస్తుతం రూ.5.51 కోట్ల మేర ఖర్చు చేశారు. గుణదల రైల్వేస్టేషన్‌ను మూడు దశల్లో అభివృద్ధి చేస్తారు. మొదటి దశలో శాటిలైట్ స్టేషన్‌కు ఉండాల్సిన హంగులను కల్పించేందుకు అధునాతనంగా ముఖ భాగం కనిపించేలా డిజైన్ చేయటంతో పాటు సర్క్యులేటింగ్ ఏరియాను పెంచటం వంటివి చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం పొడవైన రైళ్లు ఇక్కడ ఆగేందుకు వీలుగా ప్లాట్‌ఫామ్‌లను కూడా పొడిగిస్తున్నారు. గ్రానైట్ ఫ్లోరింగ్, డీ వాటరింగ్ ఫ్లోరింగ్‌లతో ప్లాట్‌ఫామ్‌లను తీర్చిదిద్దుతున్నారు. మొత్తం మూడు ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌ల దగ్గర అతి పెద్ద రూఫ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై సోలార్ ప్యానెల్స్‌ను అమర్చుతున్నారు. రైల్వేస్టేషన్ అవసరాలకు ఈ సోలార్ ప్యానెల్స్ ద్వారా వచ్చే విద్యుత్‌శక్తిని వినియోగిస్తారు. మహిళలు, పురుషులు, దివ్యాంగులకు వేర్వేరుగా టాయ్‌లెట్లు ఏర్పాటు చేశారు. స్టేషన్ సమీపంలో 2,915 చదరపు మీటర్ల పార్కింగ్ వసతి కల్పించారు. విశాలమైన వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేశారు. పోర్టికోకు కూడా ఆకర్షణీయమైన మెరుగులు దిద్దుతున్నారు. కోచింగ్ రైళ్ల హాల్టింగ్‌కు ప్రత్యేక పనులు చేపడుతున్నారు. పన్నెండు మీటర్ల వెడల్పు కలిగిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు.



అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్న రైల్వే అధికారులు

నత్తనడక

హౌసింగ్‌పై అన్ని శాఖల పెత్తనం

పీఎంఏవై ఇళ్లు మార్చి 2025 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్

- క్షేత్ర స్థాయిలో ఆ దిశగా పడని అడుగులు
- డబ్బులు, ఇసుక, మెటీరియల్ ఇవ్వడంలో తాత్సారం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఎక్కడి పనులు అక్కడే

జిల్లాలో పీఎంఏవై ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మార్చి 2025 నాటికి ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ విధించినా ఆ దిశగా అడుగులు పడటంలేదు. లబ్ధిదారులకు మెటీరియల్ సరఫరాలో ఇబ్బందులు, కొరవడిన అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. బీలో బేస్‌మెంట్, బేస్‌మెంట్ లెవల్, రూఫ్ లెవల్, స్లాబ్ దశల్లో దర్శనమిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సొంత స్థలాలు, లే అవుట్లలో పీఎంఏవై కింద ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారు మార్చి 2025 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని కోసం హౌసింగ్ విభాగానికి ఓ రూట్ మ్యాప్‌ను కూడా నిర్దేశించింది. లబ్ధిదారులను అప్రమత్తం చేసేందుకు మార్చి 2025 తర్వాత ఎలాంటి బిల్లులు విడుదల చేయబోమని తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టే ఇళ్లకు డబ్బులు పెంపుదల చేస్తుందన్న ఉద్దేశంతో పలువురు పాత పథకం లబ్ధిదారులు కొత్త పథకంలో నిర్మించుకుందామన్న ఆలోచనతో పనులు చేపట్టడం లేదు. దీనిపై సమాచారం ఉన్న ప్రభుత్వం పాత పథకంలోని లబ్ధిదారులు కొత్త పథకంలోకి రారని స్పష్టంగా పేర్కొంది. మార్చి 2025లోపు ఇళ్లు కట్టుకోకపోతే బకాయిలు చెల్లించబోమని హెచ్చరించింది. అయినా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

జిల్లాలో ఇళ్ల మంజూరు ఇలా..

ఎన్టీఆర్ జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన (పీఎంఏవై) గ్రామీణ ఇళ్లకు సంబంధించి 2021- 22, 2024 - 25 సంవత్సరాలకు సంబంధించి 4,143 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటి వరకు 2,266 ఇళ్ల పనులు మొదలు కాలేదు. బిలో బేస్‌మెంట్ దశలో 394, బేస్‌మెంట్ లెవల్‌లో 190, రూఫ్ లెవల్‌లో 191 ఇళ్లు ఉన్నాయి. పూర్తయిన ఇళ్లు కేవలం 882 మాత్రమే. అలాగే పీఎంఏ బీఎల్‌సీ - అర్బన్ అండ్ రూరల్ 2020 - 21 , 2021 - 22, 2022-23 సంవత్సరాలకు సంబంధించి జగనన్న కాలనీల పేరుతో మంజూరు చేసిన ఇళ్లను పరిశీలిస్తే ఎన్టీఆర్ జిల్లాకు మొత్తంగా 1,08,836 ఇళ్లు మంజూరు అయ్యాయి. వీటిలో కేవలం 19,287 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. బిలో బేస్‌మెంట్ లెవల్‌లో 34,365 ఇళ్లు ఉన్నాయి. బేస్‌మెట్ లెవల్‌లో 20,177 ఇళ్లు ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే బేస్‌మెంట్ స్థాయిలోనే 54,542 ఇళ్లు ఇంకా ఉన్నాయి. రూఫ్ లెవల్‌లో కేవలం 3,056 ఇళ్లు, స్లాబ్ దశలో 4,634 ఇళ్లు ఉన్నాయి. ఈ పనుల్లో అంగుళం కూడా పురోగతి కనిపించటం లేదు.

పర్యవేక్షణ కొరవడటంతో..

గృహ నిర్మాణ సంస్థ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పునాదుల దశ, గోడల దశ, స్లాబుల దశలో ఉన్న ఇళ్ల పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. క్షేత్ర స్థాయిలో మెటీరియల్, బిల్లు చెల్లింపులు, డబ్బుల జమకు సంబంధించి ఉన్నత స్థాయి నుంచి సకాలంలో స్పందించకపోవటం వల్ల క్షేత్ర స్థాయిలో ఇళ్ల నిర్మాణాలలో తీవ్ర జాప్యం నెలకొంది. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లటంలో కూడా హౌసింగ్ అధికారులు విఫలమవుతున్నారు. హౌసింగ్ విభాగంలో రెగ్యులర్ ఉద్యోగులు, అధికారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవటం, ఉన్న అతి కొద్ది మంది పదవీ విరమణ దశలో ఉండటంతో మనకెందుకులే అన్న భావనలో ఉన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో చేస్తున్న ఉద్యోగులే పర్యవేక్షణ చేస్తున్నారు. వీరిపై గ్రామ సచివాలయాల ఉద్యోగులకు పెత్తనం అప్పగించటంతో.. పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది.


లబ్ధిదారులకు అందని సాయం

ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ విభాగం నుంచి పునాదులు వేసే ముందు ఐదు మెట్రిక్ టన్నుల ఇసుక, 40 సిమెంట్ బస్తాలు, 343 కేజీల ఇనుము, రూ.16,400 నగదు కలిపి మొత్తం రూ.50 వేల విలువైన సహాయాన్ని అందిస్తారు. ముందుగా ఇవి అందిస్తేనే పనులు మొదలు పెట్టడానికి అవకాశం ఉంటుంది. వీటిని అందించకుండా ముందు మీ ఖర్చుతో మొదలు పెట్టండి అనటంతో సమస్య వస్తోంది. గోడల నిర్మాణం దశలో ఐదు మెట్రిక్ టన్నుల ఇసుక, 10 సిమెంట్ బస్తాలు, రూ.44,930 నగదు కలిపి రూ.60 వేల మేర సహాయం అందించాల్సి ఉంటుంది. పై కప్పు దశకు వచ్చే సరికి ముందుగానే 20 సిమెంట్ బస్తాలు, 142 కేజీల ఇనుము, రూ. 16,280 డబ్బులు కలిపి మొత్తంగా రూ.40 వేల మేర సహాయాన్ని అందించాల్సి ఉంది. స్లాబ్ పనులు అయ్యాక ప్లాస్టింగ్ పూర్తి చేయటానికి 20 సిమెంట్ బస్తాలు, రూ.15,660 నగదు కలిపి మొత్తం రూ. 30 వేలు చెల్లించవచ్చు. వీటితో పాటు ఉపాధి హామీ పథకం కింద రూ. 27 వేలు, మరుగుదొడ్డికి రూ. 12 వేల మేర నగదు సహాయం చేయాల్సి ఉంటుంది.

రేపు కానూరుకు సీఎం చంద్రబాబు

కానూరు మురళీ రిసార్ట్స్‌లో ఊర్జావీర్ ప్రారంభోత్సవం

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ బాలాజీ



పెనమలూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు శనివారం కృష్ణాజిల్లాకు రానున్నారు. కానూరు మురళీ రిసార్ట్స్‌లో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఊర్జావీర్‌కు ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా ఎస్పీ గంగాధరరావుతో కలిసి గురువారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అస్త్రం

నగరంలో సత్ఫలితాలు ఇస్తున్న నూతన ప్రాజెక్టు

- నెల రోజుల్లో తగ్గిన ట్రాఫిక్ జామ్‌లు
- ప్రస్తుతం సరాసరి జామ్ 73 కిలోమీటర్లుగా రికార్డు
- అస్త్రంకు ముందు 112 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్



అడిగినా, అడకపోయినా అప్‌డేట్ ఇస్తుంది. ప్రతి 15 నిమిషాలకు ఒక అలెర్ట్ పంపుతుంది. ప్రయాణపు దూరాన్ని పర్యవేక్షిస్తుంది. బ్రేక్‌డౌన్ వస్తే నోటిఫికేషన్ బెల్ మోగిస్తుంది. విజయవాడ నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం కొత్తగా అమలు చేసిన అస్త్రం ప్రాజెక్టు చేస్తున్న పనులు ఇవి. నగరంలో ఏటీఎంఎస్ (అడాప్టివ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం) పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే వరకు ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ సమస్యలకు ఏదో ఒకలా ఉపశమనం కలిగించాలని అధికారులు భావించారు. ఇందులో భాగంగా అస్త్రంను ప్రయోగించారు. నెల రోజుల వ్యవధిలో ఈ ప్రాజెక్టు ఇచ్చిన ఫలితాలను బేరీజు వేసుకున్న ట్రాఫిక్ పోలీసులు హమ్మయ్య అనుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) వాస్తవానికి అస్త్రం ప్రాజెక్టును ఆగస్టు నెలలో పట్టాలెక్కించారు. అక్టోబరు వరకు దీని పని తీరు ఒక మాదిరిగా ఉండేది. అక్టోబరు నెలలో దసరా సందర్భంగా భక్తులు అంచనాలకు మించి రావడంతో పోలీసు అధికారులు డ్రోన్లకు పని చెప్పారు. నగరం వ్యాప్తంగా మిగతా 6లో..

రేషన్ మాఫియా భాయ్!

బెజవాడ కేంద్రంగా రేషన్ మాఫియా 'భాయ్' చెలరేగిపోతున్నాడు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల నుంచి వేలాది క్వింటాళ్లు కొనుగోలు చేసి ఆఫ్రికా దేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. తనకు బియ్యం అమ్మని వారిపై అధికారులతో దాడులు చేయించి భయపెడుతున్నాడు. తన చీకటి వ్యాపారాన్ని ఎవరూ అడ్డుకోకుండా ఉండేందుకు బ్లేడ్ బ్యాచ్‌ను పెంచిపోషిస్తున్నాడు. కోట్ల రూపాయల దందా నిర్వహిస్తున్న భాయ్ లక్షల రూపాయలు వెదజల్లుతూ సివిల్ సప్లయిస్, పర్యవేక్షణ వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకుని ఆడిస్తున్నాడు.



నగరం కేంద్రంగా రేషన్ అక్రమ రవాణా

- డీలర్లు, ఎండీయూల నుంచి వేలాది క్వింటాళ్లు కొనుగోలు
- తనకు అమ్మకపోతే ప్రభుత్వ వ్యవస్థలతో దాడులు
- చీకటి వ్యాపారానికి అండగా బ్లేడ్‌బ్యాచ్
- సివిల్ సప్లయిస్, పర్యవేక్షణ వ్యవస్థలకు భారీగా ముడుపులు
- ఒక్క గుంటూరు మార్గంలోనే బియ్యం రవాణా ద్వారా పక్షం రోజులకు రూ. 2.35 కోట్లు ఆర్జన

మిల్లర్లతో పార్టనర్‌షిప్‌లు.. నగరం నుంచి ఆఫ్రికా దేశాలకు బియ్యం ఎగుమతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ నగరంలోని సర్కిల్ - 1 పరిధిలో ఉంటున్న రేషన్ మాఫియా భాయ్ ఆఫ్రికా దేశాలకు బియ్యం ఎగుమతుల్లో మిల్లర్లకు పార్టనర్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. దేవీనగర్ పరిసర ప్రాంతాల్లో గోడౌన్లను ఏర్పాటు చేసుకుని చీకటి వ్యవహారం నడుపుతున్నాడు. తనపై దాడులకు తెగబడితే ప్రతిదాడులు చేయటానికి బ్లేడ్ బ్యాచ్‌ను కూడా పోషిస్తున్నాడు. సివిల్ సప్లయిస్, సంబంధిత పర్యవేక్షణ శాఖలకు డబ్బులు వెదజల్లుతూ వారిని తన చేతిలో పెట్టుకుని అక్రమ రేషన్ బియ్యం సామ్రాజ్యానికి భాయ్‌గా వెలుగొందుతున్నాడు. కొన్నేళ్లుగా బెజవాడ అడ్డాగా పేదల బియ్యాన్ని దేశ సరిహద్దులు దాటించేస్తున్నాడు. ప్రతి నెలా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ భాయ్‌కు చెందిన వాహనాలను పట్టుకుంటున్నారు. ఈ బియ్యం పేదల బియ్యం అని గ్యారంటీ ఏమిటని ఎదురు వాదించడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఫైన్లు కట్టించుకుని వదిలేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో భాయ్ అక్రమ వ్యాపారం

భాయ్ డీలర్లు, ఎండీయుల దగ్గర నుంచి సేకరించిన బియ్యం బస్తాలను తరలించటానికి లారీలను, వ్యాన్లను కాకుండా దోస్త్ వాహనాలను ఉపయోగిస్తాడు. ఒక్క గుంటూరు వైపే ఏడు దోస్త్ వాహనాలలో అక్రమ బియ్యాన్ని మిల్లులకు తరలిస్తున్నాడు. ఒక్కో దోస్త్ వాహనం రోజుకు నాలుగు ట్రిప్పులు వేస్తుంది. ఏడు దోస్త్‌లు కలిపి మొత్తం 28 ట్రిప్పులు వేస్తాయి. ఒక్కో దోస్త్ వాహనంలో 80 పేదల బియ్యం మూటలు ఉంటాయి. అంటే 40 క్వింటాళన్నమాట. ట్రిప్పులన్నీ లెక్కిస్తే రోజుకు 2,240 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తారు. ఈ లెక్కన నెలలో సగటున 15 రోజుల పాటు లెక్కవేస్తే 33,600 క్వింటాళ్ల పేదల బియ్యాన్ని తరలిస్తున్నాడు.

మిల్లులకు రేషన్ బియ్యం

ప్రతి రోజు మంగళగిరి, పెదవడ్లపూడి, గుంటూరు బైపాస్‌లలోని మిల్లులకు భారీ ఎత్తున భాయ్ అక్రమ బియ్యాన్ని తరలిస్తున్నాడు. పేదల బియ్యం వ్యాపారంలో ఆరితేరిన భాయ్ ఈ రంగంలో సాధిస్తున్న ఆదాయం చూస్తే నివ్వెరపోవాల్సిందే. కిలో బియ్యానికి రూ.15 తీసుకునేలా భాయ్ డీల్ చేసుకుంటాడు. మిల్లర్లకు రూ.22 చొప్పున అమ్ముతాడు. ఈ లెక్కన చూస్తే కేజీకి రూ. 7 చొప్పున చూస్తే ఒక క్వింటాల్‌కు రూ.700 చొప్పున ఆదాయం వస్తుంది. రోజుకు ఒక్క గుంటూరు వైపే 2,240 క్వింటాళ్లు తరలిస్తున్నాడు. దీనిలో రూ. 15.68 లక్షలు ఆర్జిస్తున్నాడు. అదే పక్షం రోజులకు వచ్చేసరికి రూ.2.35 కోట్ల మేర ఆదాయం వస్తోంది. ఒక రోజు వచ్చే ఆదాయాన్ని కాదనుకుంటే సివిల్ సప్లయిస్, దాని పర్యవేక్షణ సంస్థలను మేనేజ్ చేయటం పెద్ద కష్టమేమీ కాదు.

భారీగా మామూళ్లు

సివిల్ సప్లయిస్‌కు, పర్యవేక్షణ అధికారం కలిగిన సంస్థలకు ప్రభుత్వం ఎంత జీతం ఇస్తుందో తెలియదు కానీ భాయ్ ఇచ్చే జీతాలు మాత్రం ఐటీ కంపెనీలు ఇచ్చేంత ఉంటాయని సమాచారం. సివిల్ సప్లయిస్ శాఖలో అధికారిని బట్టి రేటు ఉంటుందని తెలిసింది. తన దారిలోకి వచ్చిన గత ఉన్నత స్థాయి అధికారులకు నెలకు రూ.లక్ష మామూళ్లు ఇచ్చేవారని సమాచారం. కింది స్థాయి అధికారులకు రూ.30 వేలకు తక్కువ ఉండవని తెలిసింది. పీడీఎస్ డీటీల స్థాయిలో కొందరికి రూ.10 వేల చొప్పున మామూళ్లను జీతంగా ఇస్తున్నారని సమాచారం. రేషన్ బియ్యాన్ని పర్యవేక్షించాల్సిన సంస్థ సివిల్ సప్లయిస్ కాకుండా మరో కీలక పర్యవేక్షణ సంస్థ కూడా ఉంది. ఆ సంస్థ అధికారికి నెలకు రూ. లక్ష జీతంగా ఇస్తున్నారని సమాచారం. దీంతో భాయ్ చెప్పినట్టుగా వ్యవస్థలన్నీ పని చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

అడ్డుకుంటే బ్లేడ్ బ్యాచ్‌తో దాడులు

తన దగ్గర పనిచేసే బ్లేడ్ బ్యాచ్‌కు మందు, విందు, వాహనాలను సమకూర్చటం వంటివి స్వయంగా భాయ్ చూసుకుంటాడు. తన వాహనాలను ఎవరైనా వెంబడిస్తే బ్లేడ్‌బ్యాచ్ దాడులకు దిగుతుంది. గుంటూరు వైపు మిల్లులకు తరలించిన పేదల బియ్యాన్ని మిల్లర్లకు చేరవేయటమే కాకుండా.. ఆయా మిల్లర్లతో పార్టనర్‌షిప్ వ్యవహారాలను కూడా నడుపుతున్నాడు. ఆయా మిల్లర్లతో ఉన్న పార్టనర్‌షిప్ కారణంగా అక్కడి నుంచి వయా కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు, వయా చత్తీస్‌గడ్ మీదుగా ముంబాయి పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు పేదల బియ్యాన్ని తరలిస్తున్నాడు. కాగా, కాకినాడ పోర్టులో షిప్‌లో పేదల బియ్యాన్ని పట్టుకున్న ప్రభుత్వం విజయవాడ కేంద్రంగా సాగుతున్న రేషన్ మాఫియాపై కూడా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

మోడల్ విలేజ్‌లుగా తేలప్రోలు, పరిటాల

ఉంగుటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మోడల్ విలేజ్‌లుగా కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామం, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రణాళికాబద్ధంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పరిపాలనా వికేంద్రీకరణతోపాటు స్థానికసంస్థలు స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నాయని కృష్ణా జిల్లా పరిషత్ సీఈవో కె.కన్నమనాయుడు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద దేశవ్యాప్తంగా 34 గ్రామాలను ఎంపిక చేస్తే వీటిలో ఈ రెండు గ్రామాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

సైబర్‌కు చక్‌షుతో చెక్

- స్పామ్ కాల్స్‌కూ ఇదే మందు
- ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించిన కేంద్రం
- చక్‌షులో ఫిర్యాదు చేయగానే నంబర్లు బ్లాక్



8లో

భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యంగా.. రెవెన్యూ సదస్సులు

- నేటి నుంచి జనవరి 8 వరకు పకడ్బందీగా నిర్వహణ

6లో

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



» దీపాంకర్ భట్టాచార్య

ధర్నాచౌక్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర ప్రమాదంలో పడిన భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులపై ఉందని సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) ప్రధానకార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. హామీల అమలుకు అందరినీ కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రైతులకు కనీస మద్దతు ధర, కార్మికవర్గానికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. విద్య, ఆరోగ్యం సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పేరుతో సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి సందర్భంగా దేశంలో, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. అదానీ, అంబానీల ఆదాయం పెరుగుదలతో పోలిస్తే సామాన్య, మధ్యతరగతి వర్గాల తలసరి ఆదాయం పెరుగుదల శూన్యమన్నారు.



మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో చర్చల్లో పాల్గొన్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఉద్యోగుల సమస్యలకు త్వరలో పరిష్కారం

» మంత్రి రాంప్రసాద్ రెడ్డితో చర్చలు సానుకూలం

» ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నేతల వెల్లడి

బస్‌స్టేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో చర్చలు సానుకూలంగా ముగిశాయని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ప్రకటించారు. ఉద్యోగులకు సంబంధించి 26 డిమాండ్లపై గురువారం మంత్రితో యూనియన్ నేతలు చర్చించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్యలు ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో ఇచ్చిన సర్క్యులర్ నెం.1ను యథావిధిగా అమలు చేస్తామని మంత్రి చెప్పారన్నారు. ఇదే సమయంలో పనిష్‌మెంట్లపై సంబంధిత అధికారులకు అప్పీలు చేసుకుంటే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. నైట్ అవుట్ అలవెన్స్‌లు, పదోన్నతులు, సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారన్నారు. ఉద్యోగుల, గుమస్తాల సమస్యలను సానుకూలంగా విన్నారని, త్వరలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర నేతలు పి.సుబ్రహ్మణ్యంరాజు, కె.నాగేశ్వరరావు, జి.నారాయణ రావు, పి.భానుమూర్తి ఎం.శంకరరావు, ఎన్.హెచ్.ఎస్.చక్రవర్తి, జోనల్ కార్యదర్శులు దాసరి శ్యామ్యూల్ బాబు, ఎం.రాజశేఖర్, వై.శ్రీనివాసరావు, బి.కృష్ణమూర్తి పాల్గొనగా, యాజమాన్యం తరపున ఎఫ్ఎ సుధాకర్, ఈడీ విజయరత్నం, వి.నాగేంద్రప్రసాద్, చాగంటి విమల, జయశంకర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా పేరెంట్స్‌డే నిర్వహించాలి



» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతి పాఠశాలలోను ఈనెల 7న మెగా పేరెంట్స్‌డే నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని 1363 పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌డే పండుగ వాతావరణంగా జరపాలన్నారు. తల్లిదండ్రులకు ఇప్పటికే ఆహ్వానాలు పంపామన్నారు. ప్రతి విద్యార్థికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు ఇవ్వాలన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నదీ తల్లిదండ్రులకు తెలియచేసేందుకు ఈ హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమం విజయవంతమయ్యేందుకు డీఈవో, డీవైఈవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

ఇండియన్ హ్యూమన్ రైట్స్ కౌన్సెలింగ్ డైరెక్టర్‌గా భుజంగనాయక్



పమిడిముక్కల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిలింగ్ జాతీయ డైరెక్టర్‌గా కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం కూడేరు గ్రామానికి చెందిన భుజంగనాయక్‌ను నియమిస్తూ ఉత్తరప్రదేశ్ లక్నో కేంద్ర కార్యాలయం ప్రతినిధులు నియామక పత్రం అందజేశారు. భుజంగ నాయక్ గతంలో నేషనల్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థులకు మానవహక్కులపై అవగాహన కల్పించేందుకు కృషిచేస్తానన్నారు.



సంక్రాంతి ముగ్గుల పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రవీంద్ర

తెలుగు సంస్కృతికి చిహ్నాలు ముగ్గులు

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయం ఉట్టిపడేలా ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్-అమెరికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ప్రపంచస్థాయి వేదికగా నిర్వహించనున్న ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొని లక్షలాది రూపాయలు గెలుచుకోవాలన్నారు. గురువారం సంక్రాంతి ముగ్గుల పోటీల కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. విజేతలకు వరుసగా రూ.25 లక్షలు, రూ.15 లక్షలు, రూ.10 లక్షలు, రూ.5 లక్షలు, రూ.2 లక్షలు బహుమతులుగా అందజేయనున్నట్టు చెప్పారు. 100 కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారన్నారు. 2025 జనవరి 4, 5 తేదీల్లో 6 నుంచి 10 తరగతి వరకు హిందూ కళాశాలలో వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 8, 9, 10 తేదీల్లో కబడ్డీ, జనవరి 12న పరుగుపందెం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

నకిలీ పాస్‌పోర్ట్‌తో ఆంధ్రా మహిళ అరెస్టు

చెన్నై, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సింగపూర్ నుంచి నకిలీ పాస్‌పోర్టుతో కోయంబత్తూరు చేరుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళను విమానాశ్రయ పోలీసులు అరెస్టుచేశారు. బుధవారం సాయంత్రం సింగపూర్ నుంచి విమానంలో వచ్చిన ప్రయాణికులను కోయంబత్తూరు విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా, కనకదుర్గ (36) అనే మహిళ వద్ద ఉన్న పాస్‌పోర్టు నకిలీదని తేలింది. కస్టమ్స్ అధికారులు ఆమెను విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో సదరు మహిళ వేరే వ్యక్తి పాస్‌పోర్టులో తనఫోటో పెట్టి సింగపూర్ వెళ్లినట్టు తేలింది. ఘంటసాలకు చెందిన ఆమె.. నాగేశ్వరరావు అనే వ్యక్తి తయారు చేసి ఇచ్చిన నకిలీ పాస్‌పోర్ట్ సాయంతో సింగపూర్ వెళ్లినట్టు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

వల్లూరుపాలెం కరకట్టపై

ధాన్యం రైతుల ధర్నా!

» దళారులు దోచుకుంటున్నారని ఆగ్రహం

» అధికారుల హామీతో విరమణ.. స్తంభించిన ట్రాఫిక్

తోట్లవల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దళారుల చేతుల్లో దగాకు గురవుతున్నామని, అధికారులు తమ సమస్యలను పట్టించుకోవటం లేదని గురువారం వల్లూరుపాలెం రైతులు కరకట్టపై ధర్నాకు దిగారు. రైతులు ఆచంట నాగసతీష్, రావి ధరణ్‌బాబు, కొనకాల వాసు, బడుగు రవిప్రసాద్, కాట్రగడ్డ సాయి, గంగాధర్ తదితర రైతులు పెద్దఎత్తున ధాన్యం బస్తాలు తెచ్చి కరకట్ట రోడ్డుపై అడ్డంగా పెట్టి ధర్నాకు దిగటంతో గంటపాటు కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్ స్తంభించింది. అధికారులు రావాలని, అప్పటి వరకు ధర్నా విరమించేది లేదని రైతులు భీష్మించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఎం.కృష్ణకుమారి, మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు అక్కడకు చేరుకోవడంతో రైతులు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్‌కె ఎందుకు ఉందని, ధాన్యం ఎందుకు కొనరని రైతులు మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే దళారులకు బస్తా ధాన్యాన్ని రూ.1,600, రూ.1,550కి అమ్మాల్సి వస్తోందని, దీంతో తమకు రూ.1,740 మద్దతు ధర లభించటం లేదని వాదనకు దిగారు. రైతుల వాదన విన్న అధికారులు ధాన్యం ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయించే బాధ్యత తమదని హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు. అంతకుముందు ఎస్ఐ అర్జునరాజు రైతులను ధర్నా విరమించాలని కోరటంతో వాగ్వాదం చోటు చేసుకుంది.



వల్లూరుపాలెం ఆర్ఎస్‌కెలో రైతుల సమస్యలు వింటున్న కలెక్టర్ బాలాజీ

ధర్నాపై ప్రభుత్వం సీరియస్..

» రాత్రి వరకు రైతులతో కలెక్టర్ బాలాజీ చర్చలు

వల్లూరుపాలెం ధాన్యం రైతుల ధర్నాపై ప్రభుత్వం స్పందించింది. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్డీవో హేల షారోన్ గురువారం రాత్రి ఆర్ఎస్‌కెకు చేరుకున్నారు. ధాన్యం రైతుల సమస్యలను తెలుసుకున్నారు. 1262 రకం ధాన్యాన్ని కొనటం లేదని, అధికారులు పట్టించుకోకపోవటంతో దళారులకు రూ.1,550కి, రూ.1,600లకు అమ్ముతున్నామని, మిల్లర్లు, దళారులు కలిసి తమను దోచుకుంటున్నారని రైతులు కలెక్టర్‌కు వివరించారు. రొయ్యూరు పీఏసీఎస్ కార్యదర్శి అనీల, వీఏఏ అశోక్‌చక్రవర్తిపై చర్యలకు ఆదేశించామని రైతులతో కలెక్టర్ చెప్పారు. 17 శాతం తేమ ఉంటే రూ.1,740 మద్దతు ధర ఇప్పిస్తామని, వాహనాలను సమకూర్చుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో సమీక్షించారు.

భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యంగా..

రెవెన్యూ సదస్సులు

» 6 నుంచి జనవరి 8 వరకు అత్యంత పకడ్బందీగా నిర్వహణ

» దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకూ పరిష్కారం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో ఎమ్మెల్యేలు బొండా ఉమ, శ్రీనివాసరావు, జేసీ నిధి మీనా

కృష్ణలంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకాలకు అనుగుణంగా విస్తృత ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 6నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయ, సన్నద్ధత సమావేశం జరిగింది. సమావేశానికి జేసీ నిధి మీనా, సెంట్రల్, తిరువూరు ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరావు, కొలికపూడి శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తదితరులు హాజరయ్యారు. రెవెన్యూ సదస్సులను విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, అధికారులు బృందాలుగా గ్రామాలను సందర్శించి ప్రజల వద్దకు వెళ్లి రెవెన్యూ, భూ సమస్యలను త్వరగా పరిష్కరించే లక్ష్యంతో సదస్సులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ప్రజల సమస్యలకు సంతృప్తికర పరిష్కారం

» మంత్రి సత్యకుమార్ యాదవ్

రెవెన్యూ సదస్సులపై జరిగిన సమన్వయ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా హాజరై మాట్లాడారు. ప్రజల భూ సమస్యలకు సంతృప్తికర పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు రూపకల్పన చేసిందని తెలిపారు. ప్రజలు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా అధికారులే ప్రజల వద్దకు వెళ్లి వారి రెవెన్యూ, భూ సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం జరుగుతుందన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల సమస్యలను పారదర్శకతతో, జవాబుదారీతనంతో పరిష్కరించేలా కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు.

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న సమస్యలకూ, కోర్టు కేసులకు పరిష్కారం చూపేలా సదస్సులను నిర్వహించనున్నట్టు వివరించారు. ఇప్పటికే పరిష్కరించిన సమస్యలను కూడా ప్రజలకు వివరించి, ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం జరుగుతుందని, అవసరమైతే పునఃపరిశీలన చేయడం జరుగుతుందన్నారు. తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, మండల సర్వేయర్, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధితో పాటు అవసరమైతే అటవీ, దేవదాయ శాఖల అధికారులు కూడా గ్రామానికి వెళతారన్నారు. సదస్సుల వివరాలను గ్రామ పంచాయతీ, టాం టాం, కరపత్రాలు తదితరాల ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. అన్ని పిటీషన్లను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ, తిరువూరు, నందిగామ ఆర్డీఓలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, అధికారులు హాజరయ్యారు.

ఇదో గొప్ప కార్యక్రమం

- ఎమ్మెల్యే బొండా ఉమా

ప్రజల భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం గొప్ప కార్యక్రమం. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గతంలో రీ సర్వే పేరిట కొత్త సమస్యలు ఎదురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. వారికి ఈ సదస్సుల్లో పరిష్కారం లభిస్తుంది.

అత్యంత పారదర్శకంగా..

- ఎమ్మెల్యే కొలికపూడి

ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. రైతువారీ పట్టాభూమి అయినా సెక్షన్ 22(ఎ)లో ఉన్న వాటికి సదస్సుల్లో సంతృప్తికర పరిష్కారం లభించనుంది.

జిల్లా అధికారుల పర్యవేక్షణలో..

కృష్ణలంక : ఎన్టీఆర్ జిల్లాలో 320 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధితో పాటు విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, తిరువూరు పట్టణ వార్డు సచివాలయ పరిధిలో ఈనెల 6వ తేదీన రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకొంటామన్నారు. సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ఒక్కొక్క మండలానికి ఒక జిల్లాస్థాయి అధికారిని పర్యవేక్షకులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

రెవెన్యూ సదస్సుల పర్యవేక్షకులు వీరే..

1. ఎ.కొండూరు మండలం : ఎం.హనుమంతరావు, పశుసంవర్ధక శాఖ
2. గంపలగూడెం : డీవీవీఎస్ఎన్ రాజు, ప్రాజెక్ట్ డైరెక్టర్, మెప్మా
3. విసన్నపేట : చక్రణి, జిల్లా మత్స్యశాఖ
4. రెడ్డిగూడెం : పి.బాలాజీ కుమార్, జిల్లా ఉద్యాన శాఖ
5. తిరువూరు : ఎ.రాము, ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా
6. జగ్గయ్యపేట : జి.ఉమామహేశ్వరరావు, కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్ష
7. వత్సవాయి : యు.శ్రీనివాసరావు, జిల్లా యువజన సంక్షేమ
8. పెనుగంచిప్రోలు : ఎ.కృష్ణచైతన్య, జిల్లా లీగల్ మెట్రాలజీ
9. నందిగామ : జి.ఉమాదేవి, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ
10. చందర్లపాడు : బి.నాగరాజు, డిప్యూటీ డైరెక్టర్ గ్రౌండ్‌వాటర్
11. కంచికచర్ల : టీవీ సతీష్, డీఎం సివిల్ సప్లయిస్
12. వీరులపాడు : పీఎం సుభాని, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఏపీఎంఐపీ
13. జి.కొండూరు : ఎ.పాపారావు, జిల్లా పౌరసరఫరాల శాఖ
14. మైలవరం : పి.లావణ్యకుమారి, జిల్లా పంచాయతీ
15. ఇబ్రహీంపట్నం : టి.సత్యనారాయణ, ఎస్ఈ, ఆర్అండ్‌బీ
16. విజయవాడ రూరల్ : జి.కపూర్, జిల్లా హౌసింగ్
17. విజయవాడ సెంట్రల్ : ఎ.రవీంద్రరావు, ఫారెస్ట్ శాఖ
18. విజయవాడ నార్త్ : జెడ్.రమేష్, ఎస్ఈ, పంచాయతీరాజ్
19. విజయవాడ వెస్ట్ : ఎస్.విద్యాసాగర్, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్
20. విజయవాడ ఈస్ట్ : డి.చంద్రశేఖర్, అదనపు కమిషనర్, వీఎంసీ

9న ప్రభుత్వ ఐటీఐలో

అప్రెంటీస్ మేళా

భారతీనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళాలో భాగంగా సోమవారం ఉదయం 9గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ ఎం.కనకారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో పలు ప్రముఖ కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉమ్మడి కృష్ణాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో శిక్షణ తీసుకొని సర్టిఫికెట్స్ పొందిన విద్యార్థులు మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌తోపాటు పాస్‌పోర్టు ఫోటోస్‌తో హాజరుకావలసిందిగా కోరారు. వివరాలకు 9298605175 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వన్‌టౌన్ : కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యంపై గురువారం కృష్ణలంక స్టేషన్‌లో కేసునమోదైంది. శనైశ్చర స్వామి ఆలయ సమీపంలో కృష్ణానదిలో వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించి ఒడ్డుకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాల లోపు వయస్సు ఉంటుందని, ఒంటిపై ఎరుపు రంగు గళ్ల షర్టు, నలుపు రంగు జీన్స్ ప్యాంటు, నలుపు రంగు మాస్క్ ధరించినట్టు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అస్త్రం

(5వ పేజీ తరువాయి)

డ్రోన్లను గాల్లో తిప్పి ఆయా మార్గాల్లో ఉన్న పరిస్థితిని కమాండ్ కంట్రోల్ సెంటర్లలోని వీడియో వాల్‌పై ప్రత్యక్షంగా పరిశీలించారు. డ్రోన్లు ఇచ్చిన ఫలితాలతో వాటిని అస్త్రానికి అనుసంధానం చేశారు. ఈ డ్రోన్ ఆపరేషన్ అస్త్రానికి మరింత తోడ్పాటును ఇచ్చింది. అస్త్రం ప్రాజెక్టుకు ముందు నగరం మొత్తం మీద ఒక రోజులో ట్రాఫిక్ జామ్‌లు 3వేల కిలోమీటర్లకు పైబడి ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 2వేలకి తగ్గింది.

రెడ్‌సిగ్నల్ పడిందంటే చాలు..

విజయవాడ నగరంలో ట్రాఫిక్ పరంగా అనేక హాట్ జంక్షన్లు ఉన్నాయి. బెంజ్‌సర్కిల్, రామవరప్పాడు



రింగ్, గొల్లపూడి వై జంక్షన్, పోలీసు కంట్రోల్ రూం కూడళ్లలో ఒక వైపు రెడ్‌సిగ్నల్ పడిందంటే మిగిలిన అన్ని వైపులా వాహనాలను క్షణాల్లో చాంతాడంత పొడవున ఆగిపోతాయి. ఇలా ఎంతసేపు ఆగితే అంత పొడవున ట్రాఫిక్ స్తంభించిపోతోంది. వీటితోపాటు విజయవాడ - గుంటూరు జిల్లాను కలిపే కనకదుర్గ వారధిపై ఏ చిన్న వాహనం బ్రేక్‌డౌన్ అయినా ట్రాఫిక్ వారధి దిగువ వరకు ఆగిపోతుంది. ఆ ప్రభావం నగరంలో మిగిలిన కూడళ్లపై తీవ్రంగా పడుతుంది. ఈ ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతుండడంతో వాహనదారుల్లో అసహనం పెరిగిపోతోంది. సకల సదుపాయాలతో కూడిన వ్యవస్థ అందుబాటులోకి వచ్చే వరకు తాత్కాలిక పరిష్కార మార్గాన్ని అన్వేషించాలని అధికారులు భావించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిబ్బంది నియామకం

నగరంలో ట్రాఫిక్ సమస్య ఒక్కో కూడలిలో ఒక్కో విధంగా ఉంటోంది. గూగుల్ మ్యాప్, ఓలా, ఉబర్, టామ్‌టామ్, భువన్, ఓపెన్ స్ట్రీట్ వంటి మ్యాప్‌లను అధ్యయనం చేసి ట్రాఫిక్ జామ్‌లపై ఒక అంచనాకు వచ్చారు. అస్త్రం అలర్ట్‌లను పరిశీలించడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. దీనికి ఒక టెలిగ్రాం గ్రూపును ఏర్పాటు చేసి అలర్ట్‌లు తీసుకోవడం మొదలుపెట్టారు. అస్త్రం ప్రాజెక్టుకు ముందు నగరంలో అన్ని కూడళ్లలో ట్రాఫిక్ జామ్‌లు ఒక రోజులో 3వేల కిలోమీటర్ల పైచిలుకు ఉండేవి. అక్టోబరు నెల నుంచి అధికారులు దీనిపై బాగా దృష్టి కేంద్రీకరించారు. డ్రోన్లతో ఆయా కూడళ్లలో పరిస్థితిని సమీక్షించి సంబంధిత సిబ్బందికి అలర్ట్ ఇస్తున్నారు. ఈవిధంగా చేయడంతో అక్టోబరు నెలలో నగరంలో మొత్తం ట్రాఫిక్ జామ్‌లు ఒక రోజుకు 3,468 కిలోమీటర్లుగా గుర్తించారు. ఆ నెలలో సరాసరి ట్రాఫిక్ జామ్ 112 కిలోమీటర్లు ఉండేది. ఇది నవంబరులో ట్రాఫిక్ వివిధ కూడళ్లలో మొత్తం 2,203 కిలోమీటర్ల వరకు నిలిచిపోయింది. ఈ నెలలో ట్రాఫిక్ జామ్ సరాసరి 73 కిలోమీటర్లుగా రికార్డయింది. నెల రోజుల వ్యవధిలో ట్రాఫిక్ జామ్‌లు 1,265 కిలోమీటర్లకు తగ్గింది.



భూగర్భజలాల నిర్వహణ, నియంత్రణ పథకంలో

రాష్ట్రంలో 1.41 లక్షల చ.కిమీ మ్యాపింగ్

» ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్రమంత్రి నివేదిక

వన్‌టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ జలాల నిర్వహణ, నియంత్రణ పథకంలో 188 గ్రామాలు ఉన్నాయని, జాతీయ ఆక్విఫర్ మ్యాపింగ్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కింద 1.41లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగం ఉందని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుమళ్ల ప్రసాదరావులు లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 25లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగం మ్యాపింగ్ పూర్తయిందని, ఈ సమాచారం ఆయా ప్రజాప్రతినిధులకు, స్థానిక అధికారులకు పంపినట్టు తెలిపారు. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ గత మూడేళ్లలో చట్ట ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకుందని, 5,568 కేసుల్లో జరిమానాలు విధించినట్టు, 1150 కేసుల్లో పర్యావరణ పరిహారం కూడా వసూలు చేసినట్టు తెలిపారు. 2026 వరకు మాత్రమే భూగర్భ జలాల నిర్వహణ, నియంత్రణ పథకం అమలులో ఉంటుందని, కొత్త అంశాలను చేర్చే ప్రణాళికలు ప్రస్తుతం ఏమీలేవని మంత్రి తెలిపారు.

అమృత్ పథకం కింద రూ. 128 కోట్లు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అమృత్ పథకం కింద విజయవాడ నగరం, గుడివాడ మున్సిపాలిటీకి నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, పార్కుల అభివృద్ధి నిమిత్తం రూ.128.53 కోట్లు మంజూరు చేయడం జరిగిందని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి పార్లమెంటు సమావేశాల్లో అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి కేంద్ర సహాయ మంత్రి టోకన్ సాహూ సమాధానం ఇచ్చారు. విజయవాడ నగరానికి 128.53 కోట్ల విలువైన ఎనిమిది ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. కాగా గుడివాడ పట్టణంలో కోవిడ్ కారణంగా పూర్తికాని అమృత్ పనులు 2025 మార్చి 31 నాటికి పూర్తవుతాయన్నారు.



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద టీడీపీ, గౌడసంఘ నాయకులు

రెచ్చిపోతున్న ఆకతాయిలు!

» గౌతు లచ్చన్న విగ్రహంపై బురద జల్లి అవమానం

» బాధ్యులపై చర్యలకు నేతల వినతి



విగ్రహానికి పాలాభిషేకం

గుడ్లవల్లేరు, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ గౌతులచ్చన్న ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు.. జాతీయ నాయకుడు.. సమాజంలో అణగారిన వర్గాల కోసం, రైతుల కోసం పోరాటాలు, పాదయాత్రలు చేసిన యోధుడు. కొందరు ఆకతాయిలు సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలనే ఆయన విగ్రహంపై బురద చల్లారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ విభాగ ప్రధాన కార్యదర్శి కొనగళ్ల జగన్నాథం(బుల్లయ్య) అన్నారు. గురువారం ఉదయం కౌతవరం గ్రామంలో గౌతులచ్చన్న విగ్రహంపై గుర్తుతెలియని వ్యక్తులు బురద చల్లారు. ఆ పక్కనే జూనియర్ ఎన్టీఆర్, కొనకళ్ల నారాయణ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీ బ్యానర్‌ను చింపి, బురద చల్లారు. ఈ దుశ్చర్యను నిరసిస్తూ గురువారం టీడీపీ నేతలు, లచ్చన్న అభిమానులు, గౌడసంఘ నాయకులు విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. గుడ్లవల్లేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొనకళ్ల బుల్లయ్య, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బుల్లయ్య మాట్లాడుతూ, కొంతమంది ఆకతాయిలు దుశ్చర్యల ద్వారా సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలని ఇలాంటిపనులకు పాల్పడ్డారని, పోలీసులు దీనికి కారకులైన వారిని గుర్తించి శిక్షపడేలా చేయాలని కోరారు. అభిమానులు ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం లచ్చన్న విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈడే మోహన్, ఈడే కృష్ణ, బెల్లంకొండ ఏడుకొండలు, నరసింహారావు, పోతురాజు, తాతారావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మణరావు, బొబ్బా నరసింహారావు, రాంబాబు, పెంటయ్య, సత్తిబాబు, ఎ.రామ్మోహనరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికలు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల గుర్తింపు యూనియన్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగింది. దక్షిణ మధ్య రైల్వే ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఉద్యోగులకు నూజివీడు స్టేషన్‌లో బుధ, గురువారాల్లో పోలింగ్ నిర్వహించారు. యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో డీఎంఆర్కేఎస్, ఐఆర్ఎంయూ, ఆర్ఎంయూ, ఎస్‌సీఆర్ఈఎస్, ఎస్‌సీఆర్ఎంయూ సంఘాలు పోటీ పడుతున్నాయి. ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో నూజివీడు, ఏలూరు స్టేషన్లలో బూత్‌లు ఏర్పాటు చేశారు. 277 ఓట్లుకుగాను గురువారం సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 239 కోట్లు పోల్ అయినట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. ఈనెల 12న డివిజన్ కేంద్రమైన సికింద్రాబాద్‌లో కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సివిల్స్ అభ్యర్థుల భోజనం సరఫరాకు 10లోగా దరఖాస్తు చేసుకోండి : జేసీ

కృష్ణలంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ, గొల్లపూడిలోని బీసీ భవన్‌లో నిర్వహించే యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందే అభ్యర్థులకు భోజనం సరఫరాకు ఆసక్తిగల మెస్, క్యాటరింగ్ సంస్థలు, వ్యక్తులు ఈనెల 10వ తేదీ 2 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎన్‌టీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ధ్రువపత్రాల నకళ్లను గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి, దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి, డోర్ నెం.74-2-1/5, అశోక్‌నగర్, పండరిపురం, రోడ్డు నెం.8, విజయవాడ-520007లో స్వయంగా సమర్పించాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	98, 106, 117
చికెన్ విత్ స్కిన్	188
చికెన్ స్కిన్‌లెస్	198

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విజయవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు గురువారం కృష్ణలంక స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక స్టేషన్ పరిధి, శనైశ్చర స్వామి ఆలయం సమీపంలోని కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని ఒడ్డుకు తరలించి పరిశీలించారు. మృతదేహం వద్ద ఆధారాలు లేనందున ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 40 ఏళ్ల లోపు వయస్సు ఉంటుందని, ఒంటిపై ఎరుపు రంగు గళ్ల షర్టు, నలుపు జీన్స్ ప్యాంటు, నలుపు మాస్క్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం షాపును తొలగించండి

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు సీపీఎం నేతల వినతి



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకుడు దోనేపూడి కాశీనాథ్ తదితరులు

కృష్ణలంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక 22వ డివిజన్‌లోని సత్యం హోటల్ సెంటర్‌లో నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణం తొలగించాలంటూ గురువారం సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి కాశీనాథ్ స్థానికులతో కలిసి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ మద్యం షాపును తక్షణమే తొలగించాలంటూ స్థానికులతో సంతకాల సేకరణ జరిపి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో మద్యం షాపును స్థానికులు వ్యతిరేకిస్తున్నందున, భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం వుందని, ప్రభుత్వం తక్షణమే చొరవ చూపి మద్యం షాపును తీసేయాలని కోరారు. ఇక్కడ నుంచి మద్యం షాపును తొలగించేంత వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తూనే వుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, బత్తుల చిన్నారావు, కోరాడ రమణ, కె.కుమారి, దమయంతి, తవిటమ్మ, స్థానికులు పాల్గొన్నారు.



తంగెళ్లమూడి భాస్కరరావు పార్కులో బీటలువారిన గోడ, ధ్వంసమైన జారుడుబల్ల, ఊయల



ఏపీఐఐసీ కాలనీ పార్కులో తూగుడు బల్లకు విరిగిన సీటు, పనిచేయని తిరుగుడు యంత్రం

వీఎంసీ పార్కులు సమస్యలకు నెలవు

● ఆటపరికరాలు ధ్వంసం ●వెలగని లైట్లు ● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా ● కొరవడిన పర్యవేక్షణ

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

నాలుగో డివిజన్‌లోని కమర్షియల్ టాకీస్ కాలనీలోని తంగెళ్లమూడి భాస్కరరావు వీఎంసీ పార్కు, ఏపీఐఐసీ కాలనీ ఉన్న వీఎంసీ పార్కుల్లో నెలకొన్న సమస్యలతో పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. పార్కులు నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో ఆట పరికరాలు ధ్వంసమైపోయాయి. గతంలో కాలనీలోని వీఎంసీ పార్కుల పర్యవేక్షణ విషయంలో కొంత మేరకు కాలనీ అసోసియేషన్ తరపున నిధులు కేటాయించేవారు. మిగిలిన నిధులు కార్పొరేషనర్ నుంచి వచ్చేవి. దీంతో పార్కులో ఏమైనా మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించేవారు. ప్రస్తుతం గత కొన్నేళ్లుగా కార్పొరేషన్ నిధులు విడుదల కాకపోవడంతో పార్కులు అధ్వానంగా మారాయి.

వెలగని లైట్లు.. ఏపీఐఐసీ కాలనీలోని వీఎంసీ పార్కులో ఏర్పాటు చేసిన లైట్లు సరిగా పనిచేయడం లేదు. వీటిని ఆసరాగా తీసుకొని కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

ప్రమాదకరంగా మారిన గోడ.. కమర్షియల్ టాకీస్ కాలనీలో తంగెళ్లమూడి భాస్కరరావు వీఎంసీ పార్కు ఉంది. మెయిన్ గేట్ వైపున ఉన్న గోడ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. కాలనీలోని చిన్నారులు సెలవు సమయంలో ఆటలు ఆడుకోవడానికి వస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు.

ఆట పరికరాలు ధ్వంసం ... కమర్షియల్ టాకీస్ కాలనీ, ఏపీఐఐసీ కాలనీ పార్కుల్లోని ఆటపరికరాలు ధ్వంసమయ్యాయి.. కాలనీలోని చిన్నారులు సెలవు సమయంలో ఆటలు ఆడుకోవడానికి సమీప కాలనీలోని వీఎంసీ పార్కుకు వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602

సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి





● 16వ డివిజన్ ఇస్కాన్ టెంపుల్ వెనుక సిటికేబుల్ ఆఫీసు ఎదురురోడ్డు పల్లంగా ఉండడంతో వీధిలోని యూజీడీ అంతా ముందుకు ప్రవహించకుండా వెనకకు వస్తోంది. యూజీడీ సమస్యతో పాటు సైడ్ డ్రెయిన్ మురుగు నీరు కూడా ప్రవహించే అవకాశం లేకపోవడంతో, మురుగు నీరు నిలిచి దోమలుపెరిగి నరకం అనుభవిస్తున్నాం.శాశ్వత పరిష్కారం చూపమని స్థానిక కార్పొరేటర్‌తో పాటు అధికారులను కోరుతున్నా ఏదో ఒకటి చెబుతున్నారు గాని పరిష్కారం చూపడం లేదు. వెంటనే పరిష్కారం చూపాలి.
-శివ, స్థానికుడు

● ఈ సమస్య మూడు రోజుల క్రితం మా దృష్టికి రావడంతో యూజీడీ పైప్‌లైన్ క్లీన్ చేశాం. ఇక్కడ పైప్‌లైన్ వ్యర్థాలు ముందుకు వెళ్లకుండా వెనకకు వస్తుండడంతో సమస్య ఉత్పన్నమవుతుంది. దీని పరిష్కారం కోసం ప్రపోజల్ పెట్టాం. కార్పొరేషన్ నుంచి అనుమతి, నిధులు మంజూరు కాగానే శాశ్వత పరిష్కారం చేస్తాం. అప్పటి వరకు మ్యాన్‌హోల్ వద్ద యూజీడీని క్లీన్ చేస్తాం. అదే విధంగా రోడ్డు చివర నిలుస్తున్న మురుగునీరు ప్రవహించే అవకాశం లేకపోవడంతో నీరు నిలుస్తుంది. దానిని కూడా పరిష్కరిస్తాం. -జశ్వంత్, ఏఈ యూజీడీ

(రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి)

జీవశాస్త్ర విభాగంలో ఉపాధి అవకాశాలు అపారం

మొగల్రాజపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్రం చదివే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయని కొలంబియాలోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరి ప్రొఫెసర్ రోమన్ ఆర్ గంటా చెప్పారు. గురువారం పీబీ సిద్ధార్థ కళాశాల బయో టెక్నాలజీ, బోటనీ, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో బీఎస్సీ విద్యార్థులకు జీవశాస్త్రంలో ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ కెరీర్ అవకాశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఔషధ తయారీలో జీవశాస్త్ర అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.లలితా ప్రియాంక, బోటనీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, శ్రావణి, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉండాలి

● స్టెల్లాలో వరల్డ్ సాయిల్ డే వేడుకల్లో ప్రిన్సిపాల్ జెసింతా క్వాడ్రస్



ర్యాలీగా వెళుతున్న విద్యార్థినులు

పటమట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ, ఆహారభద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మారిస్ స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెసింతా క్వాడ్రస్ తెలిపారు. గురువారం కళాశాలలో అగ్రి కల్చర్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ సాయిల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగటానికి అగ్రికల్చర్ డిగ్రీ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా తమ పరిశోధనలను విస్తృతపరచుకోవాలని పిలుపునిచ్చారు. అగ్రికల్చర్ డిగ్రీ విద్యార్థినులు సమాజానికి సందేశం ఇచ్చే మైమ్ ప్రదర్శన చేశారు. అనంతరం కళాశాల నుంచి నిర్మలా జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సాయిల్ డే సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణస్వామి, మనోజ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సత్యనారాయణపురం, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ నల్లగేటు ఫీడర్ లైన్‌లో గురువారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు పి. రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటినెన్స్, లెవన్‌కేవీ లైన్లు మరమ్మతుల కారణంగా తాడంకి వారి వీధి, రామాలయం వీధి, గడియారం వారి వీధి, అబ్బూరి వారి వీధి, వ్యాకరణం వారి వీధి, ముదిగొండ వారి వీధి, తిరుమలశెట్టి వారి వీధుల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతందని వినియోగదారులు గమనించాలన్నారు.



కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ తదితరులు

వాకింగ్‌కు అనుమతులివ్వండి

● కమిషనర్‌కు వాకర్ల వినతి

ఆటోనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లయోలా కళాశాల ప్రాంగణంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ, తులసీ మోహన్, రావి రమేష్, ధూళిపాళ శ్రీనివాస్, కృష్ణారావు, బసవేశ్వరరావు తదితరులు విజయవాడ మున్సిపాల్ కార్పొరేషన్‌లో కమిషనర్ ధ్యాన్‌చంద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు వివరించినట్లు తెలిపారు. గత 25 ఏళ్లుగా వాకర్లు అక్కడ వాకింగ్ చేస్తున్నారని, కొవిడ్ ఆంక్షలతో ఆగిపోయిందని వివరించారు. సాధారణ పరిస్థితులు ఏర్పడినా వాకింగ్‌కు కళాశాల యాజమాన్యం అనుమతిని నిరాకరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వాకింగ్ ట్రాక్ మూసివేయడంతో వృద్ధులు, యువత రహదారులపై వాకింగ్ చేస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదంలో కొంత మంది మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు. వాకింగ్ అవకాశం కల్పించాలని కమిషనర్‌ని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చినట్లు తెలిపారు.

ల్యాప్‌టాప్ అందజేత



దుర్గా భవానీకి ల్యాప్‌టాప్ అందిస్తున్న గద్దె క్రాంతికుమార్

మొగల్రాజపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పు పరిధి 6వ డివిజన్‌లో తల్లిదండ్రులు లేని సీనియర్ కార్యకర్త దుర్గాభవానీకి టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ గురువారం ల్యాప్‌టాప్ అందజేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన స్వంత నిధులు రూ.45వేలతో కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌ను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు నియోజకవర్గంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా ఎమ్మెల్యే గద్దె సహాయం చేయడానికి ముందుంటున్నారని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ మాట్లాడుతూ దుర్గాభవానీకి అండగా ఉన్నందుకు గద్దె రామ్మోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లి దుర్గాప్రసాద్, పిట్టల గోవింద్, పొనుగుమాటి మోహన్‌రావు, కంది వలస అచ్యుత్, పాల్గొన్నారు.



వ్యాపారుల బండ్లను వెనక్కి సర్దిస్తున్న వీఎంసీ అధికారులు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

● 5వ ట్రాఫిక్ సీఐ, వీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

మొగల్రాజపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పేరుతో ట్రాఫిక్ నిబంధనలను మీరి వ్యాపారం పేరుతో రోడ్లను ఆక్రమించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే వారి మీద కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని 5వ ట్రాఫిక్ సీఐ రవికుమార్, వీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రఘునందన్‌రావులు హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ పర్యవేక్షణలో క్రీస్తురాజపురం, సిద్ధార్థ జంక్షన్, మదర్ థెరెస్సా జంక్షన్, పిన్నమనేని రోడ్డులో ఆక్రమణలపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైడు కాల్వలను దాటి రోడ్డు మీదకు వచ్చి వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న బండ్లను, బడ్డీలను కొన్ని చోట్ల తొలగించారు, కొన్ని చోట్ల వెనక్కు జరిపించారు. మరొకసారి రోడ్లను ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వారిని హెచ్చరించారు.

ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను తక్షణమే రద్దు చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



బందిల దొడ్డి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

మొగల్రాజపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల మీద మోపుతున్న విద్యుత్ భారాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మొగల్రాజపురం బందిల దొడ్డి వద్ద గురువారం ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి రాగానే పెంచారని అన్నారు. గతంలో స్మార్ట్‌మీటర్‌ల ఏర్పాటులో అదానీ కంపెనీతోపాటు షిర్డిసాయి కంపెనీ జగన్ బినామీ అని చెప్పిన కూటమి పార్టీలు, ఇంకా షిర్డిసాయి కంపెనీ చేతిలో కాంట్రాక్టు ఎందుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లుపెట్టే ఆలోచన విరమించకుంటే ప్రజాపోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నగర కార్యదర్శి కృష్ణ, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.క్రాంతికుమార్, పటమట మురహరి, దావులూరి శ్రీనివాస్, దూపం శివకుమార్, శేషకుమారి, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్న జగన్: లుక్కా

వన్‌టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వంపై ఆందోళనలు, ధర్నాలు చేయమని వైసీపీ శ్రేణులకు జగన్ ఇచ్చిన పిలుపు చూసి ప్రజలు చీదరించుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. గురువారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అబద్ధాలతో పాలన సాగించాడని, ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందినప్పటికీ కూడా అబద్ధాలతో కాలం గడుపుతూ ప్రజలను మోసం చేయటానికి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. గత ఎన్నికల్లో జగన్ రెడ్డి చేసిన అరాచకాల వలనే ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 సీట్లకే పరిమితం అయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి తప్పులు, ఒప్పులు తెలుసుకుని ప్రజలకు క్షమాపణ చెబితే వచ్చే ఎన్నికల్లో అయినా ప్రతిపక్ష హోదా కల్పిస్తారని, లేనిపక్షంలో వైసీపీ భూస్థాపితం అవుతుందని హెచ్చరించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో మూడు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు ఇండియన్ రౌండ్ పోటీలను సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రారంభించారు. విజేతలకు పతకాలను రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, కోశాధికారి జి.ప్రేమ్‌కుమార్, కృష్ణా జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అందజేశారు.

ఇండియన్ రౌండ్ విజేతలు

పురుషులు: జి.వెంకట లోకేష్, బి.బైరాగినాయుడు, ఎ.సుధాకర్ నాయుడు. ఎ.సాత్విక్. **మహిళలు:** కె.శారదాని, సాయి సుజియా, పి.సాయి గీతిక, ఎన్.నిఖిల

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

మొగల్రాజపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐదవ ట్రాఫిక్ సీఐ రవికుమార్ చెప్పారు. గురువారం మొగల్రాజపురం శారద కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రోడ్డు మీద ఎపుడు ఎడమవైపునే నడవాలని, లైసెన్సు లేకుండా వాహనాలు నడపవద్దని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడపడం నేరం అని చెప్పారు. రోడ్లమీద గుంపులుగా ఉండి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, ఎడాపెడా రోడ్డుదాటడం చేయవద్దని సూచించారు. కళాశాల యాజమాన్యాలు కూడా కళాశాల బస్సులను ఒకటి వెళ్లిన తరువాత ఒకటి నిలపాలని, అన్ని తరగతులు ఒకే సమయానికి వదలకుండా కాస్త విరామం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ట్రాఫిక్ ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

మీ పేరు మీద విదేశాల నుంచి వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి. మీ పై కేసు నమోదైంది. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు చేసే ఫోన్లు ఇవి.

మీ బ్యాంక్ అకౌంట్ కేవైసీ చేయించుకోవాలి. ఈరోజే ఆఖరి గడువు. మీ అకౌంట్ నంబరు, ఇతర వివరాలు చెప్పండి. సైబర్ నేరాల్లో మరో కోణం ఇది.

మీ పేరుతో ముంబైలో మరో సిమ్‌కార్డు ఉంది. దాన్ని మనీలాండరింగ్‌కు ఉపయోగించిన వ్యక్తిని అరెస్టు చేశాం. మీ పై ముంబై క్రైం బ్రాంచ్‌లో కేసు నమోదు చేశాం. విచారణ రండి. ఇదో రకం

సార్... మా వద్ద మంచి విల్లాలున్నాయి. మీ అబ్బాయిని మా విద్యాసంస్థలో చేర్పించండి. మా వద్ద మంచి హెల్త్ పాలసీ ఉంది. మేం మీకు మంచి టూర్ ప్యాకేజీ ఇస్తాం. ఇవన్నీ కమర్షియల్ కాల్స్. ఈ కమర్షియల్ వ్యక్తులు ప్రయాణాల్లో ఉన్నప్పుడు, బిజీగా ఉన్నప్పుడు వస్తుంటాయి. ముఖ్యమైన కాల్ అని భావించి ఆన్సర్ చేస్తే వాళ్లు చెప్పేది వినడం తప్ప మరొకటి చేయలేని పరిస్థితి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ.



ఇలా సైబర్ నేరగాళ్లు, కమర్షియల్ సంస్థలు చేయించే కాల్స్ నుంచి సురక్షితంగా ఉండడానికి కేంద్ర టెలికం సంస్థ ఒక అప్లికేషన్‌ను తీసుకువచ్చింది. చక్షు పేరుతో సంచార్‌సాతి పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. డిజిటల్ అరెస్టుకు సంబంధించి, పెట్టుబడులకు సంబంధించి వచ్చే కాల్స్‌తోపాటు వాణిజ్యపరమైన ప్రకటనలతో వచ్చే కాల్స్‌కు చక్షు ద్వారా చెక్ పెట్టవచ్చు. ఈ పోర్టల్ ఫిర్యాదు నమోదు చేయగానే ఇక నంబర్‌ను ఎలాంటి కాల్ రాదు. ఫిర్యాదును స్వీకరించిన వెంటనే ట్రాయ్ ఆ నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెడుతుంది.

సైబర్‌కు చక్షుతో చెక్

- స్పామ్ కాల్స్‌కూ ఇదే మందు
- ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించిన కేంద్రం
- చక్షులో ఫిర్యాదు చేయగానే నంబర్లు బ్లాక్

ఫిర్యాదు ఇలా చేయండి

- సర్వీసెస్.ఇండియా.జీవోవీ.ఇన్ వెబ్‌పేజీని ఓపెన్ చేయాలి. దానికి దిగువన చక్షు - రిపోర్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్ ఉంటుంది. దీన్ని ఓపెన్ చేయాలి. ఇలా ఓపెన్ చేసిన తర్వాత రెండు పట్టికలు కనిపిస్తాయి.

మొదటి పట్టికలో..



- రిపోర్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్ (రిసీవ్డ్ విత్‌ఇన్ లాస్ట్ 30 డేస్) అని ఉంటుంది.
- రెండో పట్టిక రిపోర్ట్ అన్‌సోలిసిటెడ్ కమర్షియల్ కమ్యూనికేషన్ (యూసీసీ)/స్పామ్ (రిపోర్ట్ విత్‌ఇన్ 3 డేస్ ఫర్ యాక్షన్) అని ఉంటుంది.
- పార్శిల్‌లో డ్రగ్స్ వచ్చాయని, ఇతర రాష్ట్రాల క్రైం బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నామని, కేవైసీ చేయించుకోవాలని వాయిస్ వాల్స్, వీడియోకాల్స్ వచ్చినప్పుడు మొదటి బాక్స్‌లోని కంటిన్యూ రిపోర్టింగ్‌ను క్లిక్ చేయాలి.
- తర్వాత రిపోర్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్ ఓపెన్ అవుతుంది.
- దీనికి దిగువన మీడియం ఆఫ్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్ అని ఉంటుంది.
- ఇందులో కాల్స్ ఎస్ఎంఎస్, వాట్సాప్ అని మూడు మీడియంలు ఉంటాయి.
- వాయిస్ కాల్స్ వస్తే కాల్స్‌ను, సందేశాలు వస్తే ఎస్ఎంఎస్, వాట్సాప్ మెసేజ్‌లు, వీడియో కాల్స్ వస్తే వాట్సాప్‌ను ఎంపిక చేసుకోవాలి.
- తర్వాత సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్ డిటైల్స్ బాక్స్ ఉంటుంది.
- ఇందులో సెలక్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్ కేటగిరి ఉంటుంది.
- దీనిలో కేవైసీ రిలేటెడ్ టు బ్యాంక్/ఎలక్ట్రిసిటీ/గ్యాస్/ఇన్సూరెన్స్ పాలసీ, ఇంపార్సినేషన్ యాజ్ గవర్నమెంట్ అఫిషీయల్/రిలేటివ్, ఫేక్ కస్టమర్ కేర్ హెల్ప్‌లైన్, ఆన్‌లైన్ జాబ్/లాటరీ/గిఫ్ట్/లోన్ ఆఫర్స్, సెక్స్‌టార్షన్, మల్టిపుల్ ఆటోమేటెడ్/రోబో కమ్యూనికేషన్, మాలిసియస్ లింక్/వెబ్‌సైట్, ఎనీ అదర్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ అని కేటగిరీలు ఉంటాయి. వచ్చిన కాల్ ఏ కేటగిరి చెందిందో ఎంపిక చేసుకోవాలి.
- తర్వాత అటాచ్ ఏ స్క్రీన్‌షాట్ అని ఉంటుంది. ఇందులో దానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను తీసి 1ఎంబీ సైజు ఉండేలా చూసుకుని అప్‌లోడ్ చేయాలి.
- అనంతరం డేట్ అండ్ టైం ఆఫ్ ది సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్ బాక్స్ ఉంటుంది. ఈ రెండు వివరాలను పూర్తి చేయాలి.
- దీనికి దిగువన ఉండే ఎంటర్ కంప్లైంట్ డిటైల్స్ బాక్స్‌లో దేనిపై ఫిర్యాదు చేస్తున్నారో ఆ వివరాలను పూర్తిగా టైపు చేయాలి.
- ఇది పూర్తి అయిన తర్వాత పర్సనల్ డిటైల్స్ కాలమ్ ఉంటుంది. ఇందులో పేరు, ఫోన్ నంబర్‌ను టైపు చేయాలి.
- తర్వాత బాక్స్‌లో ఓటీపీ వెరిఫికేషన్ అండ్ సబ్‌మిషన్ అని ఉంటుంది.
- దీనికి దిగువన ఉన్న బాక్స్‌లో ఉండే అంకెలు, అక్షరాలను వాటికి కింద ఉండే బాక్స్‌లో టైపు చేయాలి. తర్వాత ఫోన్‌కు ఓటీపీ వస్తుంది.
- ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయగానే ఫిర్యాదు రిజిస్ట్రేషన్ అవుతుంది.
- తర్వాత ట్రాయ్ ఆ కాల్స్‌ను బ్లాక్ చేస్తుంది.

రెండవ పట్టికలో..

- ఇది పూర్తిగా మార్కెటింగ్ కాల్స్, మెసేజ్‌లకు సంబంధించినది.
- రెండో పట్టిక రిపోర్ట్ అన్‌సోలిసిటెడ్ కమర్షియల్ కమ్యూనికేషన్ (యూసీసీ)/స్పామ్ (రిపోర్ట్ విత్‌ఇన్ 3 డేస్ ఫర్ యాక్షన్) అని ఉంటుంది.
- మొదటి పట్టిక మాదిరిగానే దీన్ని పూర్తి చేయాలి.

పోలీసుశాఖ ప్రతిష్ట పెరిగేలా పనిచేయాలి

- ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు



సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీ రాజశేఖర్ బాబు

గుణదల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో హోంగార్డులుగా పనిచేస్తున్న వారు పోలీసుశాఖ ప్రతిష్ట మరింత పెరిగేలా పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు అన్నారు. హోంగార్డుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు గాను ఏఆర్ గ్రౌండ్స్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ హాల్ నందు వెల్ఫేర్ మీటింగ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హోంగార్డును సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హోంగార్డులు మరణించినా లేదా పదవీ విరమణ చేసినా ఇచ్చే ఒక రోజు కాంట్రిబ్యూషన్ రూ.5లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలని కోరగా త్వరగానే చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే హోంగార్డుల నివాసాలకు దగ్గర్లోనే డ్యూటీలు పడేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వృద్ధాప్య పింఛన్, పిల్లల చదువుల నిమత్తం విద్యాదీవెన వంటి ప్రభుత్వ పథకాలు వర్తించేలా ప్రయత్నం చేస్తానన్నారు. కానిస్టేబుల్ పరీక్షలకు సన్నద్ధమయ్యే హోంగార్డ్స్‌కు ఫ్రీ కోచింగ్ ఇప్పించేలా చర్యలు తీసకుంటానన్నారు. వృత్తిపరంగా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సీపీతోపాటు డీసీపీలు గౌతమి షాలి, కృష్ణమూర్తి నాయుడు, హోంగార్డ్స్ కమాండెంట్ టి.ఆనందబాబు, హోంగార్డ్స్ డీసీపీ కె.వి.ఎస్.ఎన్.పరమేశ్వరరావు, హోంగార్డ్స్ ఆర్.ఐ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛత వైపు సాంకేతిక అడుగులు

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత వైపు సాంకేతిక అడుగులు వేస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో డ్రోన్ సర్వేలెన్స్ అవసరమని, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో గురువారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్వచ్ఛ విజయవాడపై సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర ఎండీ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యర్థ నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డ్రోన్ల నిర్వహణను సమన్వయపరుస్తూ డ్రోన్ సర్వేలెన్స్ ద్వారా ప్రస్తుతం ఉన్న సమస్యలను ఎలా తీర్చవచ్చు, ఎలా తీర్చగలం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర మాట్లాడుతూ నగరంలోఇ వ్యర్థ నిర్వహణలో ఉన్న పలు సమస్యలను వివరించారు. దోమలు పెరగకుండా ఉండేందుకు, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించేందుకు, కుక్కలు, ఆవుల వివరాలు సేకరించేందుకు, ఇతర అంశాలపై ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్ సర్వేలెన్స్ పని చేయాలన్నారు. ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎం.సి 1 భాగ్యలక్ష్మి, ఎంసి 2 దశరథ్ రామిరెడ్డి, చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్ర, విజయవాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంచార్జ్ వెహికల్స్ ఎస్ పాదం, బయాలజిస్టు సూర్యకుమార్, డ్రోన్ టీం సభ్యులు, నియో స్కై నిపుణులు శరత్ చంద్ర, హను పాల్గొన్నారు.

సుస్వరాల సంగమం సినీ గీతాల గానం

విజయవాడ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాగలహరి ఆధ్వర్యంలో గురువారం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన చిత్ర గీతాలాపన సుస్వరాల సంగమంగా శ్రోతలను రస జగత్తులో విహరింపజేసింది. స్వాతి మీరాకుమార్ పర్యవేక్షణలో రాగలహరి లోగో ఆవిష్కరణ, సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు సత్కారం నిర్వహించారు. స్వాతి మీరా కుమార్, సూర్యకామేశ్వరి, పరమేశ్వరి, షబానా, అయ్యప్పన్, సాయికృష్ణ, డి.మోహన్ రాజు, వీరాంజి నాయక్ తదితరులు మహా కనకదుర్గ, శివశంకరి, హిమగిరి సొగసులు, వేదం అణువణువున నాదం, ఎన్నెన్నో జన్మల బంధం, కలిసే కళ్లలోన, నడక కలిసిన వంటి 26 పాటలను శ్రావ్యంగా భావయుక్తంగా పాడి హర్షధ్వానాలు అందుకున్నారు. రవిబాబు, సురేష్‌లు కీబోర్డ్‌తో, తబలాతో వెంకట్, ప్రవీణ్ ప్యాడ్స్‌తో, జాబ్‌తో కొండయ్య, గిటార్‌తో సతీష్‌లు నిండుగా సహకరించారు. టి.వేణుగోపాలరావు, ఎస్ఏవి ప్రసాదరావు, ఎల్ఎస్ఎం రామశ్రీ, ముష్టి శ్రీనివాస్, పరుచూరి విజయలక్ష్మి, ఆర్. వీరభద్రరావు, డేవిడ్‌రాజులు లోగోను ఆవిష్కరించిన అనంతరం గాయనీ గాయకులను సత్కరించారు.

8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

- జిల్లాలో 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు
- డీఈవో యూవీ సుబ్బారావు

కృష్ణలంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో పరీక్ష 10 కేంద్రాల్లో జరుగుతుందన్నారు. జెడ్పీ హైస్కూల్ (నందిగామ), శ్రీ విద్య హైస్కూల్ (రైతుపేట, నందిగామ), శ్రీ చైతన్య హస్కూల్ (రైతుపేట, నందిగామ), జెడ్పీ గర్ల్స్ హైస్కూల్ (నడిమి, తిరువూరు), గవర్నమెంట్ హైస్కూల్ (తిరువూరు), కేబీసీ జెడ్పీ బాలుర హైస్కూల్ (పటమట, విజయవాడ), కేఎస్ఆర్ జెడ్పీ బాలికల హైస్కూల్ (పటమటలంక, విజయవాడ), ఏకేటీపీ ఎంసీ హైస్కూల్ (ఎస్ఎన్ పురం, విజయవాడ), ఎంకే బేగ్ ఎంసీ హైస్కూటల్ (ఏఎస్ నగర్, విజయవాడ), గాంధీ మున్సిపల్ హైస్కూల్ (వన్‌టౌన్, విజయవాడ)లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు డీఈవో వివరించారు. మొత్తం 2,248 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.


దీక్షలో పాల్గొన్న గాంధేయవాదులు

గాంధేయవాదులంతా ఏకం కావాలి

- పలువురు గాంధేయవాదులు

ధర్నాచౌక్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గాంధేయవాదులంతా ఏకం కావాలని, వారసత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీ సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు నీలం రాంబాబు నాయడు, జాతీయ అధ్యక్షుడు చందన్‌పాల్, మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఏపీ సర్వోదయ మండల్ ఆధ్వర్యంలో సామాజిక సత్యాగ్రహ దీక్ష స్థానిక జింఖాన గ్రౌండ్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారణాసి (కాశీ)లో 1948లో సర్వసేవా సంఘం 12.89 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసిందన్నారు. ఆ స్థలంలో మహనీయుల మధుర జ్ఞాపకాలతో కూడిన గాంధీ సామాజిక సేవా కుటీర సముదాయాలు, సుమారు 42 కట్టడాలను చేపట్టడం జరిగిందన్నారు. అటువంటి స్థలాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కూల్చివేసి దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ ఘటనను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా గాంధేయవాదులంతా సత్యాగ్రహ దీక్ష చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అధిక సంఖ్యలో గాంధేయవాదులు పాల్గొన్నారు.



సౌత్‌జోన్ టెన్నిస్‌కు ఎన్టీఆర్ వర్సిటీ టీమ్

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మణిపాల్ అకాడమీ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఉమెన్ టెన్నిస్ టోర్నీలో పాల్గొనే ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ టీమ్ అక్కడకు పయనమైందని వర్సిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తులు తెలిపారు. వై యశస్వి (చినకాకాని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల), బీ లక్ష్మీ సాయిరితిక (విశాఖ ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల), కే చరిష్మా నాగరాణి (గుంటూరు హారిక కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి) ఆర్ హేమ హర్షిణి, ఆర్ దీపికా కీర్తి (విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాల) క్రీడాకారులు టీమ్‌లో ఉన్నారని, వీరికి కోచ్ కమ్ మేనేజర్ ఎన్ నల్లయ్య (ఫిజికల్ డైరెక్టర్) వ్యవహరిస్తారన్నారు. టీమ్‌ను వైస్ చాన్సలర్ డీఎస్‌వీఎల్ నర్సింహం, రిజిస్ట్రార్ రాధికారెడ్డి అభినందించారు.


మాట్లాడుతున్న సౌత్ ఏసీపీ బంగార్రాజు

ఏటీఎం వినియోగదారులను మోసం చేస్తున్న వ్యక్తి అరెస్టు

- సుమారు రూ.2లక్షల నగదు, 78 ఏటీఎం కార్డులు స్వాధీనం

వన్‌టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కౌంటర్ల వద్దకు వచ్చే వినియోగదారులకు మాయమాటలు చెప్పి వారి డబ్బులను దొంగిలిస్తున్న వాంబేకాలనీకి చెందిన చింతల సురేష్ బాబు (47)ను గురువారం కృష్ణలంక పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు నిందితుడి వద్ద సుమారు రూ.2లక్షల నగదు, 78 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. గురువారం విజయవాడ బస్టేషన్ ప్రాంగణంలోని అవుట్ పోస్టులో సౌత్ ఏసీపీ యూ బంగార్రాజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలను వివరించారు. విజయవాడ వాంబే కాలనీకి చెందిన చింతల సురేష్ బాబు ట్రాక్టర్ మెకానిక్. 2017లో ఓ వృద్ధుడికి మాయమాటలు చెప్పి అతడి ఏటీఎం కార్డుతో డబ్బులు డ్రా చేసుకుని జల్సాలు చేసుకున్నాడు. నవంబరు 21న కృష్ణలంక భాస్కర్‌రావుపేట ఎస్‌బీఐ ఏటీఎం వద్ద ఓ వ్యక్తికి నకిలీ కార్డును ఇచ్చి అతడి ఒరిజినల్ కార్డును దొంగిలించి డబ్బులు డ్రా చేసుకున్నాడు. దీంతో బాధితుడు ఈనెల 3న కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు విజయవాడ బస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని సమాచారం తెలుసుకున్న క్రైం ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద రూ.2లక్షల నగదు, 78 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

వేర్వేరుగా ఇద్దరి ఖాతాల నుంచి నగదు మాయం

వేర్వేరుగా ఇద్దరు ఖాతాదారుల బ్యాంకు ఖాతాలో నగదు మాయమైనట్టు గురువారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో 2 కేసులు నమోదయ్యాయి. ఇబ్రహీంపట్నం, సత్యనారాయణపురం ఎస్టీ కాలనీకి చెందిన కె.రామకృష్ణ ఇరిగేషన్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 4న డబ్బులు డ్రా చేసేందుకు గొల్లపూడి ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ వ్యక్తి రామకృష్ణను మోసం చేసి ఏటీఎం కార్డు తీసుకుని వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి రూ.20వేలు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో విద్యాధరపురం కామకోటి నగర్, శంకరమఠం వీధిలో ఉంటున్న గోరింట్ల మృత్యుంజయ శాస్త్రి ఈనెల 3న గొల్లపూడిలోని ఏటీఎం కౌంటర్ వద్దకు వెళ్లాడు. డబ్బులు రాకపోవడంతో ఓ వ్యక్తి గమనించి బాధితుడు ఏటీ ఎం తీసుకుని డబ్బులు డ్రా చేసినట్టు నటించి కార్డు ఇచ్చేశాడు. కొద్దిసేపటికి శాస్త్రి సెల్‌ఫోన్‌కు రూ.20వేలు విత్ డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గన్నవరం ఎయిర్‌పోర్టులో తుపాకీ బులెట్ల కలకలం

గన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో తుపాకీ బుల్లెట్లు కలకలం రేపాయి. ఇంజనీరింగ్ విద్యార్థి వద్ద రెండు బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకుని అతడిపై ఆమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన ఆర్య.. కేఎల్‌యూలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. హర్యానా వెళ్లేందుకు గురువారం ఉదయం విమానాశ్రయానికి వచ్చాడు. సెక్యూరిటీ స్క్రీనింగ్ వద్ద అతడి బ్యాగులో రెండు తుపాకీ బుల్లెట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని గన్నవరం స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. తన తండ్రి బ్యాంకు సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నారని, అందుకే బుల్లెట్లు ఉన్నట్లు తెలిపాడన్నారు. అతడిపై ఎఫ్ఐఆర్ కట్టి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న దుర్గగుడి ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి, డిప్యూటీ ఈవో రత్నరాజు

భవానీ దీక్షల విరమణల అవగాహనకు ప్రచార రథం

వన్‌టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 21వ నుంచి ప్రారంభం కానున్న భవానీ దీక్షల విరమణలను పురస్కరించుకుని భవానీలకు పూర్తి అవగాహన కల్పించేందుకు దేవస్థానం అధికారులు గురువారం ప్రచార రథాన్ని ప్రారంభించారు. దుర్గగుడి ముఖ్య అర్చకుడు ఆర్. శ్రీనివాస శాస్త్రి పర్యవేక్షణలో అర్చకులు పూజలు నిర్వహించి డిప్యూటీ ఈవో రత్నరాజుతో కలిసి వాహనాన్ని ప్రారంభించారు. ఈ ప్రచార రథం 6 నుంచి 12 వరకు ఉదయం 8 గంటలకు తణుకు నుంచి ప్రారంభమై చుట్టుపక్కల ప్రాంతాల్లో భవానీలకు అవగాహన కల్పించనున్నారు. ఈ రథంలో పలువురు అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

కళావేదికపై భక్తి సంగీతం

దుర్గగుడి కళావేదికపై గుంటూరు జిల్లా తెనాలికి చెందిన డాక్టర్ ఓ రమేష్ బాబు భక్తి సంగీత ప్రదర్శనను నిర్వహించారు. పలు కీర్తనలను ఆలపించి ఆహూతులను అలరించారు. అనంతరం డిప్యూటీ ఈవో రత్నరాజు రమేష్ బాబును సత్కరించి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

నేటి నుంచి విజయ్ మర్చంట్ ట్రోఫీ

- మంగళగిరి, మూలపాడులో ఏర్పాట్లు పూర్తి

మంగళగిరి సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ దేశవాళీ టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీ గ్రూపు-డీ మ్యాచ్‌లు ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్నాయని ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సానా సతీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రోఫీకి సంబంధించి మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, మూలపాడులోని డీవీఆర్, సీపీ మైదానాలను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ఈ నెల 6 నుంచి 8 వరకు కర్ణాటక-విదర్భ (మంగళగిరి), రాజస్థాన్-జార్ఖండ్ (మూలపాడు డీవీఆర్), అస్సాం-ఉత్తరాఖండ్ (మూలపాడు సీపీ), 11 నుంచి 13 వరకు రాజస్థాన్-ఉత్తరాఖండ్ (మంగళగిరి), ఝార్ఖండ్-కర్ణాటక (మూలపాడు డీవీఆర్), జమ్మూకశ్మీర్-విదర్భ (మూలపాడు సీపీ), 17 నుంచి 19 వరకు రాజస్థాన్-విదర్భ (మంగళగిరి), జమ్మూకశ్మీర్-కర్ణాటక (మూలపాడు డీవీఆర్), జార్ఖండ్-ఉత్తరాఖండ్ (మూలపాడు సీపీ), 22 నుంచి 24 వరకు కర్ణాటక-ఉత్తరాఖండ్ (మంగళగిరి), రాజస్థాన్-జమ్మూ కశ్మీర్ (మూలపాడు డీవీఆర్), జార్ఖండ్-విదర్భ (మూలపాడు సీపీ), 28 నుంచి 30 వరకు జమ్మూ కశ్మీర్-జార్ఖండ్ (మంగళగిరి), ఉత్తరాఖండ్-విదర్భ (మూలడపాడు డీవీఆర్), రాజస్థాన్-కర్ణాటక (మూలపాడు సీపీ) మధ్య మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు.

జీఎస్టీ రిజిస్ట్రేషన్‌పై అవగాహన ఉండాలి

ఆటోనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంపోర్ట్స్, ఎక్స్‌పోర్ట్స్, అంతర్రాష్ట్రాల కంపెనీలు టర్నోవర్‌తో సంబంధం లేకుండా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, జీఎస్టీ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంతి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ జీఎస్టీ బీఎల్ ఆదినారాయణ అన్నారు. గురువారం ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాలులో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు బీవీఎస్‌టీ సాయి, ఉపాధ్యక్షుడు పి.శ్రీరామ్ ప్రసాద్, సెక్రటరీ టీవీ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పవన్ కుమార్ సరాఫ్, కోశాధికారి బీవీఎం రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు, ఏడీసీపీ రామకృష్ణ, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు

- పరిశీలించిన సీపీ రాజశేఖర్ బాబు

వన్‌టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 21 నుంచి నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లపై గురువారం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ వి.రాజశేఖర్ బాబు, ఈఈ టి.వైకుంఠరావు, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ, వన్‌టౌన్ సిఐ, ఆలయ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా హోమగుండాలు, అన్నదానం, ప్రసాద విక్రయాల కౌంటర్లు, క్యూలు, కేశఖండనశాల, బందోబస్తు, ట్రాఫిక్ తదితరాలపై పరిశీలనలు జరిపారు.


విద్యార్థిని ధీరజ్‌శ్రీకృష్ణను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

ఏషియన్ యోగా చాంప్‌కు భాష్యం విద్యార్థి ఎంపిక

గుంటూరు (విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను చదువుతోపాటు వారు ఎంచుకున్న రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. విజయవాడ అశోక్‌నగర్ భాష్యం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ధీరజ్ శ్రీకృష్ణ ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన యోగా చాంపియన్‌షిప్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం భాష్యం రామకృష్ణ విద్యార్థిని అభినందిస్తూ మాట్లాడారు. ఏషియన్ యోగ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యోగాస్పోర్ట్స్ అసోసియేషన్ తరఫున జనవరి 6 నుంచి 8న సింగపూర్‌లో జరిగే 10వ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరుపున విద్యార్థి ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. ఈ సందర్భంగా ధీరజ్‌శ్రీకృష్ణను అభినందిస్తూ భాష్యం రామకృష్ణ రూ. లక్ష చెక్కును అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

రైతుబజార్‌లో దుకాణాలకు దరఖాస్తులు

కృష్ణలంక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో సాంబమూర్తి రోడ్ రైతుబజారు నందు 16 దుకాణాలకు అర్హత గల డ్వాక్రా/డ్వాక్రా గ్రూపుల నుంచి దరఖాస్తులు కోరడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి అర్హులైన డ్వాక్రా/డ్వాక్రా గ్రూపులు ఈ ప్రకటన వెలువడిన వారంలోపు దరఖాస్తులను ఎస్టేట్ ఆఫీసర్, రైతుబజార్, సాంబమూర్తిరోడ్ లేదా జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ యార్డ్, గొల్లపూడి విజయవాడ వారికి సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.


రేడియోనో, టీవీనో పెడితే... ప్రేమతో నిండిన సినిమా పాటలు 24 గంటలూ వినిపిస్తాయి. ప్రేమకు బలైపోయిన దేవదాసులు, లైలా మజ్నూ కథలు సరే సరి. ఇలా ప్రేమ మన జీవితాన్ని ఆక్రమించుకుంటూ ఉంటుంది. చాలామందిలో 'నేను ప్రేమించగలనా?' అనే సందేహాన్ని సమాజంలోని ఈ వాతావరణం పుట్టిస్తూ ఉంటుంది. జిడ్డు కృష్ణమూర్తి సిద్ధాంతంలో కూడా ప్రేమ ఒక ముఖ్యమైన అంశం. అయితే దాని కోణం వేరు.

ఈ ప్రేమ నిజం కాదు!

వాస్తవిక జీవితంలో ప్రేమ పేరుతో ముడిపడిన బాంధవ్యాలు అనతికాలంలోనే నిరాశ, ద్వేషం, అసూయ, క్రౌర్యం కింద మారుతాయి. దంపతులకు వైవాహిక జీవితంలో ఆశించిన వాంఛలు తీరనప్పుడు, విధేయతలో లోపాలు కనిపించినప్పుడు... తొలి దశలో ఉన్న ప్రేమ మాయమై, ద్వేషం మిగిలిపోతుంది. 'ప్రేమకు ద్వేషంతో ఏదైనా సంబంధం ఉందా? కొండంత ధైర్యాన్ని, శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించ వలసిన ప్రేమ అధైర్యానికి, అనుమానాలకు ఎలా దారి తీస్తుందో చెప్పమంటా'రు కృష్ణమూర్తి. ఆయన సిద్ధాంతం ప్రకారం 'వినడం', 'చూడడం' అనేవి మానవ బాంధవ్యాలలో చాలా ముఖ్యమైన ప్రక్రియలు. ఆయన దృష్టిలో ఆ మాటలకు నిర్వచనాలు వేరు. మనం ఎదుటివారిని చూడం, వారు చెప్పేది వినం. అంటే... ఎదుటి వ్యక్తిని చూస్తున్నప్పుడు మన అహంకారం - అంటే 'నేను' అనే భావం, మనోవికారాలు, ఆలోచనలు, అభిప్రాయాలు, కోరికలు, ఇష్టాయిష్టాలు, ఉద్వేగాలు... ఆ ఎదుటి వ్యక్తికి, మన కళ్ళకు మధ్య అడ్డుగోడలా నిలబడతాయి. మనం వాటిని ఆ వ్యక్తికి ఆపాదిస్తాం. తెలిసో, తెలియకో వాటినే ఆ వ్యక్తిలో చూస్తాం తప్ప... ఆ వ్యక్తిని నిజంగా చూడం. మన దృష్టి మీద, అవగాహన మీద లెక్కలేనన్ని ప్రభావాలుంటాయి. మనం నిరంతరం వాటి వశంలో ఉంటాం.

ప్రభావాల నియంతృత్వం

నిర్మొహమాటంగా చెప్పాలంటే ఎదుటి మనిషి మనం చేరుకోలేని ఒక పరాయి ద్వీపం. అతడి అంతరంగంలో దాగి ఉన్న రాగద్వేషాలు, ఆలోచనలు, వాంఛలు, భయాలు, గాయాలు మనకు కనపడవు. వాటిని మనం కేవలం ఊహించుకుంటాం. ఈ ఊహకు మించి మనకు అతని గురించి ఏమీ తెలీదు. ప్రభావాలు మన కళ్ళకు కళ్ళాల్లా ఉన్నంత కాలం ఎదుటి వ్యక్తి నేరుగా, ప్రత్యక్షంగా మన అనుభూతిలోకి రాడు. అందుకే "ఎవరైనా 'నేను ఫలానా వ్యక్తిని ప్రేమిస్తున్నాను' అంటే అది చాలా సందేహాస్పదం. నీ ఊహకు మించి అసలు ఆ వ్యక్తి ఎవరో కూడా నీకు తెలీదు, మరి ఆ వ్యక్తిని ప్రేమించడం ఎలా వీలవుతుందో చెప్పు" అంటారు కృష్ణమూర్తి. వినడంలో కూడా అదే సమస్య. ఎదుటి వాడు చెప్పేది వింటున్నప్పుడు కూడా మన మీద ప్రభావాల నియంతృత్వం ఉంటుంది. వారు చెప్పేది అర్థం చేసుకొనే మనస్థితం మనకు ఉండదు. "ప్రేమించడంలో మొదటి మెట్టు ఎదుటి వ్యక్తిని చూడడం, ఆ వ్యక్తిని సంపూర్ణంగా తెలుసుకోవడం. అంటే మొదట నేను నామీద ఉన్న ప్రభావాల్ని అన్నిటినీ వదిలించుకుని, మనస్సుని శుభ్రపరిచి, ఎదుటి వాడిని చూడగలగాలి. అన్ని ప్రభావాలను విసర్జించినప్పుడు మనిషికి నిజమైన స్వేచ్ఛ



వస్తుంది. స్వేచ్ఛ పొందిన మనిషికి భయం ఉండదు. భయంలేని స్వేచ్ఛాజీవికి మాత్రమే ప్రేమించే తాహతు ఉంటుంది" అని ఆయన చెబుతారు. ఇదంతా విన్నవారిలో "నన్ను పూర్తిగా తమ అదుపులో పెట్టుకున్న ఈ ప్రభావాల్ని నేను ఎలా వదిలించుకోవాలి?' అనే ప్రశ్న తలెత్తుతుంది. "దానికి ఏదైనా మానసిక విశ్లేషణ లాంటి టెక్నిక్, యోగాసనాల్లాంటి అభ్యాసం, ఏదైనా మంత్రం, ఉపదేశం ఉంటుందా?" అని అడుగుతారు. ఈ సందర్భంలో మనకు కృష్ణమూర్తి ప్రత్యేకత కనిపిస్తుంది. టెక్నిక్, అభ్యాసం, ఉపదేశం లాంటివి మనిషికి స్వేచ్ఛని ఇవ్వలేవు. ఉన్న ప్రభావాల్ని వదిలించుకునే బదులు మనిషి కొత్త ప్రభావాల పరాధీనతకు గురౌతాడు. ఈ కారణం వల్లే కృష్ణమూర్తి మనకు ఏ మార్గమూ చూపరు, ఏ నియమాలనూ విధించరు.

ఎలా బయటపడాలి?

'మనిషి రకరకాల ప్రభావాల స్వాధీనంలో ఉన్నాడు' అనే విషయాన్ని ఒక సిద్ధాంతపరంగా, ఒక ఆలోచనాపరంగా విశ్లేషించి... వాటిని వదిలించుకోవడానికి శ్రమపడడం వల్లనో, దాన్ని ఒక సాధనగా మార్చుకోవడం వల్లనో ఏ ఫలితమూ ఉండదు. తీవ్రమైన పంటినొప్పిని ఎలా వాస్తవమైన విషయంగా గుర్తించి, భరిస్తామో అదే తీవ్రతతో మన మీద ఉండే ప్రభావాలను గుర్తించగలిగితే... అవి వాటంతట అవే మాయమైపోతాయి. అప్పుడు మనం సంపూర్ణమైన స్వతంత్రతను, ప్రేమించడానికి అనివార్యమైన యోగ్యతను పొందే అవకాశం ఉంటుంది. మానవ సంబంధాలలో తలెత్తే అన్ని సమస్యలకు పరిష్కారం... ప్రభావాల నియంతృత్వాన్ని గుర్తించడంలో ఉంటుంది.

• గుంటూరు వనమాలి



భగవద్గీత నేటికీ ఆచరణయోగ్యమేనా?

భగవద్గీతను అయిదు వేల ఏళ్ళ క్రితం అప్పటి దేశ, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా శ్రీకృష్ణుడు చెప్పాడు. కానీ ప్రస్తుతం పరిస్థితులు వేరు. మన జీవనగతులు వేరు. అలాంటప్పుడు నేటికీ గీత ఆచరణయోగ్యమైనదేనా? దీనికి సమాధానం ఏమిటంటే... ఇటీవలి కాలంలో కొవిడ్ మహమ్మారి ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూశాం. అయితే సమాజంలో నిశ్శబ్దంగా వ్యాపిస్తున్న మరొక మహమ్మారి ఉంది. అదే మానసిక రుగ్మత. ఆతృత, ఆవేదనలు, నిరాశా నిస్పృహలు, అసంతృప్తి, భయాందోళనలు లాంటి అంతర్గత బలహీనతలతో నేటి మానవుడు సతమతం అవుతున్నాడు. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితులు ఉన్న నేటి సమాజానికి భగవద్గీతా విజ్ఞానం సాంత్వన చేకూర్చి, మనసును నిర్మలంగా చేయగలదు.

భగవద్గీత ఆవిర్భవించిన రోజు గీతా జయంతి. మార్గశిర శుక్లపక్ష ఏకాదశి నాడు సనాతనమైన ఈ గీతాజ్ఞానాన్ని శ్రీకృష్ణుడు లోకానికి అందించాడు. 'మాసానాం మార్గశీర్షోహం... మాసములలో మార్గశీర్ష మాసాన్ని నేను' అంటూ అర్జునుడికి ఈ పవిత్రమైన మాసం విశిష్టతను ప్రత్యేకంగా వివరించాడు. కాబట్టి మార్గశీర్ష మాసం శ్రీకృష్ణునితో అభిన్నమయినదే కాకుండా... ఆధ్యాత్మిక సాధనకు ఎంతో శుభప్రదమైనది కూడా. భగవద్గీతలో తెలిపిన నియమాలను మానవుడు అంగీకరిస్తే జీవితాన్ని పరిపూర్ణం చేసుకోగలడు. జీవిత సమస్యలన్నిటికీ శాశ్వతమైన పరిష్కారం చేకూర్చగలడు. అదే సంపూర్ణ భగవద్గీతా సారాంశం.

భగవద్గీత మూల సూత్రం

భగవద్గీత మూల సూత్రాన్ని వివరిస్తూ చివరి అధ్యాయంలో శ్రీకృష్ణుడు "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ/ అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః... సర్వ విధాలైన ధర్మాలను త్యజించి, కేవలం నన్నే శరణు పొందు. నిన్ను సర్వ పాపాల నుంచి విముక్తుణ్ణి చేస్తాను. భయపడకు" అని చెప్పాడు. జీవితంలో సంభవించే సకల భయాందోళనల నుంచి, గత పాపకర్మ ఫలితాల నుంచి ఉపశమనాన్ని కాంక్షించేవారు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుణ్ణి తక్షణం శరణు వేడడమే తరుణోపాయం. సకల మానవ జాతికి అర్జునుడి ద్వారా శ్రీకృష్ణుడు ఉపదేశించిన సందేశం ఇది.

శరణాగతి ఇలా...

"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు... ఎల్లప్పుడూ నన్నే స్మరించు. నా పట్ల భక్తితో ఉండు. నన్ను పూజించు. నాకు నమస్కరించు. అలా చేయడం వల్ల నీవు తప్పకుండా నన్ను చేరుకుంటావు. ఇది నేను నీకు ఇచ్చే వాగ్దానం. ఎందుకంటే, నువ్వు నాకు చాలా ప్రియమైన మిత్రుడవు" అని చెప్పాడు కృష్ణభగవానుడు. పై శ్లోకం శరణాగతిలోని నాలుగు అంశాలను వివరిస్తుంది:

మన్మనా భవ (సదా కృష్ణుణ్ణే స్మరించడం): ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాలను నిత్యం భగవంతుణ్ణి స్మరించడానికి అనుకూలంగా తీర్చిదిద్దుకోవాలి. శ్రీకృష్ణుణ్ణి మన మనస్సులో, హృదయంలో నిలుపుకొన్నప్పుడు ఎలాంటి పాపభీతి లేకుండా, విశుద్ధంగా జీవించగలం. శ్రీకృష్ణుడి పవిత్రనామాలను జపించడం వల్ల లోకంలోని సకల విపత్తుల నుంచి ఉపశమనం పొందగలం.

మద్భక్తో (శ్రీకృష్ణుడి భక్తుడు కావడం): శ్రీకృష్ణుడి మేనమామ కంసుడు సైతం ఎల్లప్పుడూ ఆయన గురించే ఆలోచించేవాడు. అయితే అది శత్రుత్వంతో కూడిన ఆలోచన. అది భగవంతుణ్ణి స్మరించే పద్ధతి కాదు. శ్రీకృష్ణుణ్ణి భక్తిపూర్వకంగా సేవించడానికి అనువైన నవవిధ భక్తి మార్గాలను ఆచార్యులద్వారా నేర్చుకోవాలి. కుల, ప్రాంత, లింగ, జాతి, వర్ణభేదాలేవీ ఎంచకుండా ఎవరైనా ఈ భక్తి మార్గాలను అనుసరించవచ్చు జీవితంలో పురోగతి సాధించడానికి ఇది లోకంలో సముచితమైన మార్గం.

మద్యాజీ (శ్రీకృష్ణుణ్ణి అర్చించడం): ప్రతి రోజూ శ్రీకృష్ణుణ్ణి పూజించాలి. ధూపం, పుష్పం, నీరు మొదలైన వాటిని సమర్పించవచ్చు. అలా భగవంతుడికి సమర్పించినవి ప్రసాదం అవుతాయి. ధూపం ఇల్లు అంతటినీ పవిత్రం చేయగలదు. కృష్ణప్రసాదం ఇంద్రియాలను పరిశుద్ధం చేస్తుంది. ఈ విధమైన నిత్యారాధన మన ఇంటిని, జీవితాలను పవిత్రం చేస్తుంది. సకల పాపాల నుంచి విముక్తి ప్రసాదిస్తుంది.

మాం నమస్కురు (శ్రీకృష్ణుడికి నమస్కరించడం): భగవంతుడికి కేవలం నమస్కారం చేసినంత మాత్రాన ఆయనకు ప్రియమైన భక్తులు కాగలం. అలాంటి భక్తులకు సకల శుభాలు చేకూరుతాయి. భగవద్గీతలోని ఈ సూత్రాలను ఆచరిస్తే... జన్మ, మృత్యు, జరా, వ్యాధులను అధిగమించి, శ్రీకృష్ణుని దివ్య ధామాన్ని చేరుకొని, శాశ్వతమైన నిత్య యవ్వన జీవితాన్ని ఆస్వాదించగలం.

గీతా జయంతిని ఎలా ఆచరించాలి?

గీతా జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలి. శ్లోక, ప్రతిపదార్థ, భావాలను చదివి, అర్థం చేసుకొని... తమ జీవితాలను శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లేలా తీర్చిదిద్దుకోవాలి.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్,
9396956984

విధి బలీయం

గజ భుజంగ విహంగమ బంధనం
శశి దివాకరయో గ్రహపీడనం
మతిమతాంచ విలోక్య దరిద్రతాం
విధి రహో బలవానితి మే మతిః... విధికి ఎంతటివారైనా తలవంచవలసిందేనని తన నీతి శతకంలోని ఈ శ్లోకంలో భర్తృహరి వివరించాడు. ఆ శ్లోకాన్ని...

ఫణులు గజములు బక్షులు బట్టువడుట
రవిసుధాకరులకునైన రాహుబాధ
బుద్ధిమంతుల లేమియు బొసగ జూచి
విధి బలాఢ్యుడటంచు భావింతు మదిని... అంటూ తెలుగువారికి అందించాడు ఏనుగు లక్ష్మణకవి.



భావం: పట్టుకోవడం దాదాపు అసాధ్యమైన పాములు, ఏనుగులు, పక్షులు కూడా బందీలు అవుతూ ఉంటాయి. తమ కాంతితో లోకాలన్నిటినీ ప్రకాశింపజేసే సూర్యుణ్ణి, చంద్రుణ్ణి రాహువు పట్టి పీడిస్తూ ఉంటాడు. ఎంతో తెలివైనవారు, మంచి బుద్ధి కలిగినవారు సంపదకు నోచుకోకుండా దరిద్రంతో జీవిస్తున్నారు. ఇవన్నీ చూసినప్పుడు విధి చాలా బలీయమైనదని, దాన్ని తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదని అనిపిస్తూ ఉంటుంది.

స్వర్గం, నరకం లేవు...

పచ్చని గడ్డి, కలప, మొక్క జొన్న పైర్లతో ధన ధాన్య సమృద్ధమైన సేతవ్యా గ్రామాన్ని పాయాసికి కోసల రాజు ప్రసేనజిత్తు బహుమతిగా ఇచ్చాడు. ఒకసారి కుమార కాశ్యపుడు దాదాపు 500 మంది భిక్షువులతో కలిసి కోసల రాజ్యంలో తిరుగుతూ, సేతవ్యా గ్రామానికి ఉత్తరాన ఉన్న శింశుపారణ్యంలో బస చేశాడు. బుద్ధుడి ప్రత్యక్ష శిష్యులలో కుమార కాశ్యపుడు అగ్రగణ్యుడు. అతను అనుభవజ్ఞుడు, విద్యావంతుడు, వివేకి. తాత్త్విక విషయాలను వివరించగలిగే నేర్పరి. పైగా అర్హమైన స్థానానికి ఎదిగినవాడు.


నాలుగు వాదాలు...

పాయాసి భౌతికవాది. కనిపించే వాటిని తప్ప వేరేవాటిని ఒప్పుకొనేవాడు కాదు. అతనికి ఆస్తికత సన్నగిల్లింది. పరలోకాలు, పాప పుణ్యాలు కనిపించవు కాబట్టి వాటిని నమ్మేవాడు కాదు. జీవుడు మరణానంతరం మళ్ళీ పుడతాడనే సిద్ధాంతాన్ని కూడా అతను అంగీకరించేవాడు కాదు. కానీ పాయాసి సిద్ధాంతాన్ని కుమార కాశ్యపుడు ఒప్పుకోలేదు. అప్పుడు తన సిద్ధాంతాన్ని సమర్థించుకోవడానికి నాలుగు వాదాలను పాయాసి ప్రతిపాదించాడు.

- చైతన్య స్వరూపమైన ఆత్మ కనిపించదు కదా, అందుకే అది లేదు. స్వర్గ-నరకాలు లేవు. అందుకే మరణానంతరం మానవుడు తిరిగి జన్మించడు.
- మనిషి మళ్ళీ పుట్టడు కాబట్టి... ధార్మికులైన ఆస్తికులను కూడా మరణభయం వెంటాడుతుంది. మళ్ళీ ఈ లోకానికి రాలేమనే ఆలోచనే ఆ భయానికి కారణం. చావంటే అందరికీ భయమే. మరణం అనివార్యం అని తెలిసి కూడా జ్ఞానులను సైతం ఈ భీతి ఎందుకు వెంటాడుతుంది?
- ఆత్మ అనేది అసలు లేనే లేదు, కాబట్టి మనిషి మరణించినప్పుడు అది ఎవరికీ కనిపించదు. లేనిది ఎలా కనిపిస్తుంది?
- ఆత్మ శరీరం నుంచి వేరయ్యాక ఆ శరీర భారం తగ్గాలి. కానీ శరీర భారం ఇంకాస్త పెరుగుతుంది. అందుకే ఆత్మ లేదు.

స్వర్గం గురించి ఎందుకు తెలుసుకోలేమంటే...

పాయాసి రాజు ప్రస్తావించిన పై వాదనలను కుమార కాశ్యపుడు వరుసగా ఖండించాడు. మొదటి వాదంపై మాట్లాడుతూ "మృత్యు దండనను పొందిన అపరాధిని ఉరి తీసే ముందు... అతడు మిత్రులతో, బంధువులతో కలవడానికి రాజు ఎలాగైతే అనుమతించడో... అదే విధంగా నరకంలో తీవ్ర దుర్గతి పాలైన ప్రాణి భూలోకానికి వచ్చి, పరలోకం గురించి మీకు చెప్పడానికి యముడు అనుమతించడు. ఇక 'త్రాయస్త్రింశ లోకం'లో, అంటే స్వర్గంలో ఉన్న ప్రాణి అక్కడి భోగభాగ్యాలను విడిచి మళ్ళీ ఈ కష్టసాధ్యమైన భూలోక జీవితంలోకి ప్రవేశించాలని అనుకోడు. అపవిత్రం, దుర్గంధభూయిష్టం, హేయం అయిన మలకూపం నుంచి బయటపడి... స్వచ్ఛమైన వస్త్రాలను ధరించి, పంచేంద్రియాలతో, పంచభోగాలను అనుభవించే మనిషి మళ్ళీ ఇలాంటి చోట ప్రవేశించాలని ఎలా అనుకోడో... అదే విధంగా స్వర్గలోకంలో నివసించిన ప్రాణి మళ్ళీ భూలోకానికి రావడానికి అసలు ఇష్టపడడు. అంతేకాదు, స్వర్గలోకంలో అతడు అనుభవించే భోగభాగ్యాలను, స్థితిగతులను భూలోకంలో నివసించే మానవులు తెలుసుకోకపోవడానికి మరో కారణం ఉంది. భూలోకంలో నివసించే మనుషులకు వంద సంవత్సరాల కాలం... స్వర్గవాసులకు ఒక్క రోజుతో సమానం. అలాంటి వేయి దైవీ సంవత్సరాలు స్వర్గ లోక దేవతల ఆయుఃప్రమాణం. అలాంటప్పుడు... స్వర్గలోక నివాసులైన వారు ఆ లోకంలో రెండు మూడు రోజులు భోగభాగ్యాలను అనుభవించి, ఆ విషయాలను మీతో చెప్పడానికి భూలోకానికి తిరిగి వస్తే... అంతవరకూ వారి మాటలు వినడానికి మీరు జీవించి ఉంటారా? అందుకే చనిపోయిన వ్యక్తి మళ్ళీ తిరిగి వచ్చి, పరలోకం గురించి చెబితేనే పరలోకాన్ని నమ్ముతాననడం అవివేకం. అది తెలివైన ఆలోచన కాదు" అన్నాడు. కానీ కుమార కాశ్యపుడు వర్ణించిన దేవతల దీర్ఘాయువును పాయాసి ఒప్పుకోలేదు. అది ఉత్త భ్రమ అన్నాడు. "స్వర్గలోక దేవతల దీర్ఘాయువు గురించి నేను ఎప్పుడూ వినలేదు. అందుకే నేను ఈ విషయాన్ని అంగీకరించను" అన్నాడు. కుమార కాశ్యపుడు అంతటితో వదిలిపెట్టలేను. అతణ్ణి ఒప్పించడానికి ఒక జన్మాంధుడి ఉదాహరణ ఇచ్చాడు. "సూర్య తేజం వల్ల వచ్చే తెలుపు రంగును, చంద్రప్రభ వల్ల వచ్చే వెన్నెలను చూడలేని ఒక పుట్టు గుడ్డివాడు... సూర్య చంద్రుల అస్తిత్వాన్ని స్వీకరించనట్టే... పాయాసి కూడా పారలౌకిక విషయాలను అంగీకరించ లేదు" అన్నాడు. "కుమార కాశ్యపుడు చెప్పిన ప్రకారం. పారలౌకిక విషయాలను మనిషి తన మామూలు కళ్ళతో చూడలేడు. దానికి దివ్య చక్షువు అవసరం. కాబట్టి పరలోకం లేదని అనడం కూడా ఆధారం లేని విషయమే" అని చెప్పాడు.



ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు
జేఎన్‌యు, న్యూఢిల్లీ,
91 98189 69756



రాక్షస గుణాలు అంతం కావాలంటే...

పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మ దేవుడి గురించి కఠోరమైన తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షం అయ్యాక... తనకు మరణం లేకుండా వరం ఇవ్వాలని కోరాడు. అలాంటి వరం సాధ్యం కాదని బ్రహ్మదేవుడు చెప్పగా... తారకాసురుడు బాగా ఆలోచించి, శివుడి కుమారుడి చేతిలో మాత్రమే మరణించే వరం ఇవ్వాలని అడిగాడు. ఎందుకంటే ఆ సమయానికి శివుని భార్య సతీదేవి అగ్నిలోకి దూకి ఆత్మార్పణ చేసుకుంది. ఆ బాధతో శివుడు హిమాలయాల్లో తపస్సులో లీనమై ఉన్నాడు. శివుడు తపస్సును భగ్నం చేసే సాహసులెవరూ లేరు. ఒకవేళ శివుడు తపస్సు నుంచి బయటకు వచ్చినా... ఆయనకు భార్య లేదు కాబట్టి కుమారుడు కలిగే అవకాశం లేదని తారకాసురుడు భావించాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని అనుగ్రహించాడు.

నేడు సుబ్రహ్మణ్య షష్ఠి

కుమారస్వామి జననం...

ఆ తరువాత తనను చంపేవారెవరూ లేరనే గర్వంతో తారకాసురుడు విర్రవీగాడు. ముల్లోకాలను తన దారుణ కృత్యాలతో గడగడలాడించాడు. దేవేంద్రుణ్ణి తరిమేసి స్వర్గలోక ఆధిపత్యాన్ని తీసుకున్నాడు. అప్పుడు తమకు తరుణోపాయం సూచించాల్సిందిగా దేవతలందరూ నారదుణ్ణి వేడుకున్నారు. సతీదేవి పర్వతరాజైన హిమవంతుడి కుమార్తెగా... పార్వతి పేరుతో మళ్ళీ జన్మించిందని, ఆమె శంకరుడికి పత్ని అవుతుందని నారదుడు చెప్పాడు. ఆ తరువాత దేవతలందరూ కలిసి సప్తర్షుల సాయంతో శివ పార్వతులకు వివాహం జరిపించారు. వారి సంతానమే కుమారస్వామి లేదా కార్తికేయుడు. ఆరు ముఖాలు ఉంటాయి కాబట్టి ఆయనకు 'షడాననుడు', 'షణ్ముఖుడు' అని, నెమలి ఆయన వాహనం కాబట్టి 'శిఖి వాహనుడు' అని, ఋషి పత్నులైన కృత్తికల దగ్గర పెరగడం వల్ల 'కృత్తికాసూనుడు', 'కార్తికేయుడు' అనే నామాలు ఏర్పడ్డాయి. ఆయనను సుబ్రహ్మణ్య స్వామి, మురుగన్, వేలాయుధన్, దండపాణి.. ఇలా అనేక పేర్లతో పిలుస్తారు.

తారకాసుర సంహారం...

కార్తికేయుడి జననం మార్గశిర శుద్ధ షష్ఠి నాడు జరిగింది. ఆయన ద్వారా తమకు స్వేచ్ఛ రాబోతోందని దేవతలు సంతోషించగా, తారకాసురుడి అనుచరుల్లో నిరాశ, భయాందోళనలు పెరిగాయి. కుమారస్వామికి విశ్వామిత్ర మహర్షి 'గుహ' అనే నామాన్ని ఇస్తూ... వేదజ్ఞానాన్ని ప్రసాదించాడు. అగ్ని దేవుడు 'శక్తి' అనే ఆయుధాన్ని ఇచ్చాడు. అనంతరం కైలాసానికి యువరాజుగా కార్తికేయుడు పట్టాభిషిక్తుడు అయ్యాడు. వివిధ దేవతలు తమ ఆయుధాలను, శక్తులను బహుమతులుగా ఇచ్చారు. దేవతల సేనాధిపతిగా ప్రకటించారు. కొంతకాలానికి తారకాసురుడు నాశనమయ్యే సమయం వచ్చింది. వారిద్దరి మధ్యా జరిగిన యుద్ధంలో తారకాసురుడు మరణించాడు. గణేశుడు గణాలన్నిటికీ రాజైతే కార్తికేయుడు సర్వసైన్యాధ్యక్షుడు. మన శరీరంలో కుడివైపున ఉండే పింగళా నాడిని ప్రభావితం చేసే శక్తికి ప్రతీకగా ఉంటాడు. ఆ శక్తి మన ప్రాణశక్తితో అనుసంధానమై ఉంటుంది. కార్తికేయుడి అనుగ్రహం పొందడం వల్ల... పసిపిల్లల్లో ఉండే అమాయకత్వంతో కూడిన తేజస్సు, చక్కటి క్రియాశీలత, చెడుని అంతమొందించే అంతర్గత దైవశక్తి లభిస్తాయి. భగవంతుడి పట్ల వినయ విధేయతలు, నాయకత్వ లక్షణాలు, అందరికీ మార్గదర్శకత్వం చేయగల శక్తి, దైవికమైన జ్ఞానం, వివేకం కలుగుతాయి. మన సూక్ష్మ శరీరంలో కార్తికేయుడి స్థానం కుడివైపు మూలాధార చక్రంలో ఉంటుంది. మన లోపల ఉన్న కుండలినీ శక్తి ఆ చక్రాన్ని దాటి పైకి రావాలంటే... మనలో కార్తికేయుడి గుణగణాలు ఉండాలి. ఆ గుణగణాలు ఏమిటో, కార్తికేయుడి ఆశీస్సులు ఎలా పొందాలో శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో వివరించారు.

కార్తికేయుడి నివాసం మన సూక్ష్మ శరీరంలోని కుడివైపున మూలాధార చక్రమే అయినా... పింగళి నాడి మొత్తం మీద ఆయన ప్రభావం ఉంటుంది. అందుకే ఆయనకు 'సుపింగళా' అనే పేరు ఏర్పడింది. మూలాధార చక్రం శుభ్రమైనప్పుడు... పింగళానాడి మొత్తం శుభ్రమవుతుంది. మనలోని మూలధార చక్రం, ఆజ్ఞా చక్రం ఒకదానితో ఒకటి పరిపూర్ణమైన సంబంధం కలిగి ఉంటాయి. కాబట్టి మూలాధార చక్రం కుడిభాగం శుభ్రమైతే ఆజ్ఞాచక్రం కుడిభాగం కూడా శుభ్రపడుతుంది. మనలో అహంకారాన్ని నియంత్రించుకొనే శక్తిని మెరుగుపరుస్తుంది. మనలోని రాక్షస గుణాలు అంతం కావాలంటే కార్తికేయుడి అనుగ్రహం కావాలి. అంటే కుడివైపున మూలధార చక్రం బలంగా ఉండాలి. ఈ చక్రం శుభ్రమయ్యేకొద్దీ మనలోని అనవసరమైన ఆలోచనలు తగ్గుతాయి. అంతర్గత ప్రశాంతత కలుగుతుంది. కార్తికేయుడి ఆశీస్సులు ఉన్న వ్యక్తి ఇతరులను శాసించగలుగుతాడు. ఇలా శాసించగలిగే శక్తి పురుషులకు వారి మాటల ద్వారా, చురుకుదనం ద్వారా, వ్యక్తిగత విజయాల ద్వారా లభిస్తే... మహిళలకు సహనం, హుందాతనం, క్షమాగుణం, కరుణ, అందరినీ ఆదరించే గుణం ద్వారా లభిస్తుంది.

> గణేశుడు గణాలన్నిటికీ రాజైతే కార్తికేయుడు సర్వసైన్యాధ్యక్షుడు. మన శరీరంలో కుడివైపున ఉండే పింగళా నాడిని ప్రభావితం చేసే శక్తికి ప్రతీకగా ఉంటాడు. ఆ శక్తి మన ప్రాణశక్తితో అనుసంధానమై ఉంటుంది. కార్తికేయుడి అనుగ్రహం పొందడం వల్ల... తేజస్సు, చక్కటి క్రియాశీలత, చెడుని అంతమొందించే అంతర్గత దైవశక్తి లభిస్తాయి.

సాధారణంగా కొన్ని దేవాలయాలలో రెండు సర్పాలు ఒకదానితో ఒకటి మెలికలు తిరుగుతూ ఉన్న శిల్పం మనకు కనిపిస్తుంది. ఆ శిల్పంలోని రెండు సర్పాలు మన సూక్ష్మ శరీరంలో ఇడా, పింగళా నాడులు ఒకదానితో ఒకటి మెలికలు తిరిగి... ఆరు శక్తి కేంద్రాలను లేదా షట్చక్రాలను ఎలా ఏర్పరుస్తాయో సూచిస్తాయి. వీటినే 'చంద్రనాడి, సూర్యనాడి' అని కూడా పిలుస్తారు. మన వెన్నెముక అడుగు భాగాన త్రికోణాకార ఎముకలో ఉండే కుండలినీ శక్తి... ఈ రెండు నాడుల మధ్య ఉండే సుషుమ్నా నాడి ద్వారా పైకి వచ్చి, మన మాడు పైభాగంలో ఉండే బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, మన చుట్టూ ఉన్న, సర్వవ్యాపితమైన భగవంతుడి పరమ చైతన్య శక్తితో ఐక్యం అవుతుంది. అప్పుడే సాధకుడికి యోగ ప్రాప్తి కలుగుతుంది. ప్రతి నిత్యం సహజయోగ సాధన ద్వారా దీన్ని సాధించగలమనీ, కార్తికేయుడి గుణాలను, శక్తులను మనలో స్థిరపరుచుకోగలమనీ శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో స్పష్టం చేశారు.

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ

12 మందిని కాపాడేందుకు చేతులు కలిపిన భారత్-పాక్

» అరేబియా సముద్రంలో నావ మునక

» నావికులను కాపాడిన ఇరుదేశాల కోస్ట్‌గార్డ్స్

న్యూఢిల్లీ, డిసెంబరు 5: ఉత్తర అరేబియా సముద్రంలో మునిగిపోతున్న ఓ నావ నుంచి 12 మంది భారతీయ నావికులను కాపాడేందుకు భారత్-పాక్ చేతులు కలిపాయి. ఇందుకోసం భారత కోస్ట్‌గార్డ్(ఐసీజీ), పాకిస్థాన్ సముద్ర భద్రత దళం(పీఎంఎస్‌ఏ) అరేబియా సముద్రంలో సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ వివరాలను ఐసీజీ అధికారులు గురువారం 'ఎక్స్'లో పంచుకున్నారు. బుధవారం గుజరాత్ తీరంలోని పోరుబందర్ నుంచి ఇరాన్‌కు బయలుదేరిన నావ.. ద్వారకకు పశ్చిమాన 270 కిలోమీటర్ల దూ రంలో.. పాకిస్థాన్ సెర్చ్ అండ్ రెస్క్యూ(ఎస్‌ఏఆర్) ప్రాదేశిక జలాల్లోకి వెళ్లగానే ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. దాంతో నావ మునిగిపోతుండడంతో.. ముంబైలోని మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్(ఎంఆర్‌సీసీ)కు ఎమర్జెన్సీ కాల్ అందింది. ఎంఆర్‌సీసీ నుంచి గాంధీనగర్‌లోని కోస్ట్‌గార్డ్ వాయవ్య విభాగం ప్రధాన కార్యాలయం, పాకిస్థాన్ ఎంఎస్‌ఏకు సందేశాలు వెళ్లాయి. కోస్ట్‌గార్డ్ అధికారులు ఐసీజీఎస్-సార్థక్‌ను రంగంలోకి దింపారు. ఆలోగా పీఎంఎస్‌ఏ సిబ్బంది హెలికాప్టర్ ద్వారా గాలింపు చేపట్టి, మునుగుతున్న నావను గుర్తించారు. వాణిజ్య నౌక ఎంవీ-కాస్కోగ్లోరీ సిబ్బంది కూడా నౌకను గుర్తించడంలో సాయపడ్డారు. భారత కోస్ట్‌గార్డ్ సమయానికి అక్కడికి చేరుకుని, నౌకలోని 12 మందిని కాపాడారు.

షేక్ హసీనా ప్రసంగాలపై నిషేధం: బంగ్లా ట్రైబ్యునల్

ఢాకా, డిసెంబరు 5: మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రసంగాలను ప్రసారం చేయకూడదంటూ బంగ్లాదేశ్‌లోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) గురువారం నిషేధం విధించింది. ఆమె చేసే విద్వేషపూరిత ప్రసంగాలను ప్రధాన స్రవంతి మీడియాలోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ ప్రసారం చేయకూడదని ఆదేశించింది. మానవాళికి వ్యతిరేకంగా ఆమె నేరాలు చేశారంటూ దాఖలైన పలు ఫిర్యాదులపై విచారణ జరగనున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ఇచ్చింది. దేశం నుంచి పరారయిన అనంతరం ఆమె ఇటీవల తొలిసారిగా మీడియాతో మాట్లాడుతూ తాత్కాలిక ప్రభుత్వ నాయకుడు మహమ్మద్ యూనస్‌పై విమర్శలు చేశారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ట్రైబ్యునల్ ఆమె ప్రసంగాల ప్రసారంపై నిషేధం విధించింది.

రైల్లో సీటు కోసం కొట్టుకున్నారు

» కత్తులు, రాడ్లతో దాడి.. ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

అమేథీ, డిసెంబరు 5: రైలులో సీటు కోసం మొదలైన చిన్నపాటి గొడవ చినికి చినికి పెద్దదై ఒకరినొకరు చంపుకొనేంత వరకు పోయింది. ఓ వర్గం యువకులు మరో వర్గంపై కత్తులు, రాడ్లతో దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. యూపీలోని అమేథీ నుంచి తన సొంతూరు మాడేరికస్ వెళ్లేందుకు తౌహిద్ (24) అనే యువకుడు జమ్మూ నుంచి వారాణసీ వెళ్తున్న బేగంపూర ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలు లఖ్‌నవూ, నిహాల్‌ఘర్ స్టేషన్ల మధ్యలో ఉండగా సీటు విషయమై తౌహిద్‌కు రైలులోని మరికొందరు యువకులతో గొడవ మొదలైంది. ఇది పెద్దదై ఆ యువకులు తౌహిద్‌పై కత్తులు, రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన తౌహిద్ ఈ విషయం తన సోదరులు తాలిబ్ (20), తౌసిఫ్ (27)కు చెప్పడంతో రైలు మాడేరికస్ రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే వారు రైలెక్కి యువకులతో గొడవకు దిగారు. ఆ యువకులు వారిపైనా కత్తులు, రాడ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు గాయాలపాలైన తౌహిద్, తాలిబ్, తౌసిఫ్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తౌహిద్ మృతి చెందాడు. దాడి చేసిన యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యూకేలో జంక్‌ఫుడ్‌పై టీవీ ప్రకటనలు బంద్!

లండన్, డిసెంబరు 5: ఊబకాయంతో బాధపడుతున్న పిల్లల సంఖ్య దేశంలో రోజురోజుకి అధికమవుతున్న వేళ యూకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జంక్ ఫుడ్‌గా పరిగణించే పిజ్జా, బర్గర్, పేస్ట్రీ, వాఫీ, ప్యాన్ కేక్, ఫ్రెంచ్ ఫ్రైస్ తదితర ఆహార పదార్థాలు, శీతలపానీయాల ప్రకటనలను టీవీల్లో పగటి పూట ప్రసారం చేయడంపై నిషేధం విధించింది. ఆయా ప్రకటనలను రాత్రి తొమ్మిది గంటల తర్వాతే ప్రసారం చేసుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఈ అంశాలను అమలు చేయనుంది. అయితే, ఈ నిషేధం కేవలం జంక్ ఫుడ్‌పై మాత్రమే కానీ ఆహారాన్ని సరఫరా చేసే రెస్టారెంట్లు, వ్యాపార సంస్థలకు వర్తించదు. ఆయా ప్రకటనలను పిల్లలు చూడకుండా చెయ్యడంవల్ల వారిని జంక్ ఫుడ్‌కు కాస్త దూరం చెయ్యవచ్చనేది ప్రభుత్వ ఆలోచన.

ఢిల్లీలో కాస్త తగ్గిన కాలుష్యం

» రవాణా వాహనాలపై నిషేధం వద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 5: ఢిల్లీలో వాయు కాలుష్యం కాస్త తగ్గినందున భారీ రవాణా వాహనాల రాకపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని గురువారం సుప్రీం కోర్టు సూచించింది. ఉదయం 8 గంటల సమయంలో గాలి నాణ్యత సూచిక 161 పాయింట్ల మేర ఉండడంతో దాన్ని కాస్త అనుకూలమైన పరిస్థితిగా పరిగణిస్తారు. అందువల్ల శ్రేణీకృత స్పందన కార్యాచరణ ప్రణాళిక-4 (గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-జీఆర్‌ఏపీ)ని అమలు చేయాల్సిన పనిలేదని తెలిపింది. జీఆర్‌ఏపీ-4 అమలు చేస్తే అత్యవసర సేవలు మినహాయిస్తే నగరంలోకి భారీ రవాణా వాహనాలకు అనుమతి ఉండదు. డీజిల్‌తో నడిచే మధ్యతరహా రవాణా వాహనాల రాకపైనా నిషేధం అమలవుతుంది. గాలి నాణ్యత పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతానికి జీఆర్‌ఏపీ-4 అమలు చేయాల్సిన అవసరం లేదని, దాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొంది.

వారందరి డీఎన్‌ఏ ఒకటే: యూపీ సీఎం యోగి

అయోధ్య, డిసెంబరు 5: అయోధ్య మందిరం కూల్చివేత, సంభాల్ హింస, బంగ్లాదేశ్‌లో అశాంతి ఘటనల వెనకున్న వారందరి డీఎన్‌ఏ ఒకటేనని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. గురువారం అయోధ్యలోని రామ్‌కథా పార్క్ వద్ద రామాయణ్ మేళాను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. '500 ఏళ్ల క్రితం అయోధ్యలో బాబర్ సేనాధిపతి ఏం చేశాడో గుర్తుందా? అదే సంభాల్‌లో జరిగింది. బంగ్లాదేశ్‌లోనూ అదే జరుగుతోంది' అని అన్నారు. మన ఐక్యతలో చీలికలు సృష్టించిన వ్యక్తులు, వారి వారసులు ఇప్పటికీ ఇక్కడ ఉన్నారని, కులం పేరుతో వారు సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తూనే ఉన్నారన్నారు. కాగా ఆదిత్యనాథ్ వ్యాఖ్యల పట్ల సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, అఖిలేశ్ యాదవ్ స్పందించారు. ముఖ్యమంత్రి డీఎన్‌ఏ గురించి మాట్లాడి ఉండాల్సింది కాదన్నారు. తాము డీఎన్‌ఏను చెక్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, సీఎం కూడా చెక్ చేయించుకోవాలని సూచించారు.

సీఎంగా ఫడణవీస్ ప్రమాణం

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి

» డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్ ప్రమాణం

ముంబై, డిసెంబరు 5: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు, వేలాదిమంది జనం మధ్య మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణం చేశారు. గురువారం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఫడణవీస్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం, డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ శిందే (60), అజిత్‌పవార్ (65) ప్రమాణం చేశారు. శిందే ప్రమాణం చేయటానికి ముందు.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రేలకు కృతజ్ఞతలు తెలుపుతూ కొద్దిసేపు ఉపన్యసించారు. గవర్నర్ ప్రమాణం చేయించడానికి ఉద్యుక్తులవటంతో.. ప్రసంగాన్ని ఆపి ప్రమాణం చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంల ప్రమాణంతో.. రెండు వారాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ ముగ్గురు మినహా మిగిలిన మంత్రులు ఎవరూ ప్రమాణ స్వీకారం చేయలేదు. శాసనసభ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందే మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని బీజేపీ నాయకుడు ఒకరు చెప్పారు. ఈ నెల 23న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ-శివసేన-ఎన్సీపీ కూటమి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నప్పటికీ.. సీఎం పదవి కోసం ఏక్‌నాథ్ శిందే పట్టుబట్టటంతో సందిగ్ధత నెలకొన్న విషయం తెలిసిందే. పలు పర్యాయాల సంప్రదింపులు, చర్చల అనంతరం శిందే.. బీజేపీకే



ఫడణవీస్‌ను అభినందిస్తున్న ప్రధాని మోదీ

సీఎం పదవి ఇవ్వటానికి అంగీకరించారు. 54 ఏళ్ల ఫడణవీస్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయటం ఇది మూడోసారి. 2014లో తొలి పర్యాయం ఐదేళ్లపాటు సీఎంగా పదవిలో కొనసాగిన ఆయన, 2019లో రెండోసారి సీఎంగా ప్రమాణం చేసినప్పటికీ.. ఉద్ధవ్ ఠాక్రే మద్దతు ఉపసంహరణతో ఐదు రోజుల్లోనే రాజీనామా చేశారు. శిందే మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి సీఎం పదవి చేపట్టడం మహారాష్ట్రలో ఇదే ప్రథమం.

పలువురు ప్రముఖుల హాజరు

ఫడణవీస్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీతోపాటు కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్‌గడ్కరీ, జేపీనడ్డా, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, నితీశ్ కుమార్, హిమంతబిశ్వ శర్మ, మోహన్ యాదవ్, ప్రమోద్ సావంత్, నాయబ్‌సింగ్ సైనీ, భూపేంద్ర పటేల్, పుష్కర్‌సింగ్ ధామి హాజరయ్యారు. వీరితోపాటు బాలీవుడ్ ప్రముఖులు షారూక్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, రణ్‌బీర్‌కపూర్, మాధురీదీక్షిత్, సంజయ్‌దత్, పారిశ్రామికవేత్తలు ముఖేశ్ అంబానీ, నోయల్ టాటా, అనిల్ అంబానీ, కుమారమంగళం బిర్లా, దిలీప్ సాంఘ్వీ, క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తదితరులు హాజరయ్యారు. ప్రముఖ ప్రతిపక్షనేతలెవరూ ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే 'త్రిమూర్తులు' దక్షిణ ముంబయిలోని రాష్ట్ర సచివాలయమైన 'మంత్రాలయ'కు వెళ్లారు. ఈ సందర్భంగా ఫడణవీస్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం పారదర్శకతతో పనిచేస్తామని చెప్పారు. వేధింపు రాజకీయాలకు పాల్పడబోమని అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యుల సంఖ్య తగ్గడంపై మాట్లాడుతూ రాష్ట్రంలోని రాజకీయ సంస్కృతిలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. పార్టీల మధ్య రాజకీయ సంభాషణలు జరుగుతుండాలని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎక్స్ ద్వారా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. "ఈ నూతన బృందం అనుభవం, ఉత్సాహాల మేలు కలయిక. ఈ బృందం సమష్టి కృషి కారణంగానే మహారాష్ట్రలో మహాయుతి చరిత్రాత్మక విజయం సాధించింది" అని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తుందని, సుపరిపాలన సాగేలా భరోసా కలిగిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు కేంద్రం తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆ తరువాత ఏక్‌నాథ్ శిందే విడిగా విలేకరులతో మాట్లాడుతూ ఇంతవరకు తాను సాధారణ వ్యక్తి.. ('కామన్ మ్యాన్'-సీఎం)గా పని చేశానని, ఇకపైనా దాన్ని కొనసాగిస్తానని చెప్పారు.

లోకం తీరు



భారత్‌లో పెట్టుబడులు లాభదాయకం

» మోదీ 'మేక్ ఇన్ ఇండియా' భేష్: పుతిన్



మాస్కో, డిసెంబరు 5: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన 'భారతదేశమే ముందు(ఇండియా ఫస్ట్)', 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాలను రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసించారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. బుధవారం మాస్కోలో నిర్వహించిన 15వ వీటీబీ రష్యా కాలింగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరంలో ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం లాభదాయకమన్నారు. భారత్‌లో తయారీరంగ పరిశ్రమల ఏర్పాటుకు రష్యా కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా' అనేది రష్యాకు చెందిన 'ఇంపోర్ట్ సబ్‌స్టిట్యూషన్ ప్రోగ్రాం' లాంటిదేనని వివరించారు. 'ఇలాంటి కార్యక్రమాన్నే మేక్ ఇన్ ఇండియా పేరిట మోదీ ప్రారంభించారు. భారత్‌లో తయారీ కార్యకలాపాలు చేపట్టేందుకు మనం కూడా సిద్ధంగా ఉన్నాం. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం లాభదాయకమని మేం భావిస్తున్నాం' అన్నారు. రష్యా ఇంధన దిగ్గజం రోజ్‌నెఫ్ట్ ఇటీవలే భారత్‌లో రూ.1.70 లక్షల కోట్లు(20 బిలియన్ డాలర్లు) పెట్టుబడిపెట్టిన విషయాన్ని పుతిన్ ప్రస్తావించారు. ఉత్పత్తి రంగం వృద్ధి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో చేపట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత స్థానాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం అనుకూల పరిస్థితులను సృష్టించడంలో భారత ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

ఒకేసారి రెండు డిగ్రీలు

(మొదటి పేజీ తరువాయి)

నచ్చిన సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) చేయవచ్చు. ఉదాహరణకు ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థి డిగ్రీలో బీకామ్ చేరవచ్చు. అయితే, ఇలా వేరే కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు సంబంధిత ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వడం తప్పనిసరి. ఇక, ఉన్నత విద్యా సంస్థలు ఏడాదికి రెండు సార్లు.. జూలై-ఆగస్టు లేదా జనవరి- ఫిబ్రవరిలో తాము నిర్వహిస్తున్న కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించవచ్చు. ఈ విధానం వల్ల ఓ విద్యార్థి ఒకేసారి రెండు యూజీ లేదా రెండు పీజీ కోర్సులు చదువుకోవచ్చు. ఒకేసారి రెండు కోర్సులు అభ్యసించే వారి కనీస హాజరు శాతం(అటెండెన్స్) లెక్కింపు అంశంపై సంబంధిత ఉన్నత విద్యా సంస్థలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, సంబంధిత అధీకృత సంస్థల ఆమోదంతోనే ఈ విధానాన్ని అమలు చేయాలి. ఇక, ఓ విద్యార్థి యూజీ డిగ్రీ పొందాలంటే సంబంధిత కోర్సులోని ప్రధాన సబ్జెక్టులో కనీసం 50 శాతం క్రెడిట్ మార్కులు పొందాలి. మిగిలిన 50 శాతం క్రెడిట్లను విద్యార్థి ఇతర కోర్సుల్లో చూపించిన నైపుణ్యం, అప్రెంటిస్‌షిప్ తదితర అంశాల ఆధారంగా కేటాయిస్తారు.

కోర్సు గడువు తగ్గింపు లేదా పొడిగింపు

యూజీ డిగ్రీ విద్యార్థులు తమ కోర్సు కాలాన్ని పొడిగించుకునేందుకు లేదా తగ్గించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఈ ముసాయిదాలో ఓ కొత్త విధానాన్ని ప్రతిపాదించారు. ఇందుకోసం యాక్సిలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏడీపీ), ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఈడీపీ) అనే విధానాలను యూజీసీ తీసుకొచ్చింది. ఎవరైనా విద్యార్థి నిర్ణీత సమయం కంటే ముందుగానే తన కోర్సును పూర్తి చేయాలనుకుంటే ఏడీపీని ఎంచుకోవచ్చు. మొదటి లేదా రెండో సెమిస్టర్ లోపే ఈ నిర్ణయం తీసుకోవాలి. కోర్సు నిడివిని పొడిగించుకోవాలని అనుకునేవారు ఈడీపీని ఎంచుకోవచ్చు. ఏడీపీ, ఈడీపీలో ఉన్న వారందరికీ పాఠ్య ప్రణాళికల్లో ఎలాంటి మార్పులు ఉండవు. అయితే, ఏడీపీ, ఈడీపీలో దేనినైనా విద్యార్థి ఎంచుకుని కోర్సు పూర్తి చేస్తే మాత్రం సర్టిఫికెట్లలో ఆ అంశం ఉంటుంది. ఇక, నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ (హానర్స్, రీసెర్చ్‌తో సహా హానర్స్) పూర్తి చేసిన వారే ఎంఈ, ఎంటెక్ వంటి అడ్వాన్స్‌డ్ పీజీ కోర్సులకు అర్హులవుతారని యూజీసీ ప్రతిపాదించింది. కాగా, ఈ ముసాయిదా అమలు ఉన్నత విద్యాసంస్థల సంసిద్ధతపై ఆధారపడి ఉంటుందని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ వెల్లడించారు. 2020 జాతీయ విద్యా విధానం సూచనల మేరకు విద్యార్థులు వివిధ రకాల కోర్సులు చదువుకునేందుకు వీలు కల్పించడమే ముసాయిదా ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

నాసా చీఫ్‌గా వ్యాపారవేత్త ఐజాక్‌మాన్

» ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, డిసెంబరు 5: అమెరికా అధ్యక్షుడినా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తాను అధికారం చేపట్టే లోపు తన వారితో కీలక పోస్టులు భర్తీ చేస్తున్నారు. అందులో భాగంగా అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా'కు తదుపరి చీఫ్‌గా ప్రైవేట్ వ్యోమగామి, వ్యాపారవేత్త జారెడ్ ఐజాక్‌మాన్‌ను ప్రకటించారు. ఈ నియామకం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్‌తో ఐజాక్‌మాన్‌కు వ్యాపార సంబంధాలు ఉండటమే విమర్శలకు కారణం. మస్క్ స్పేస్ ఎక్స్ ప్రోగ్రామ్‌కు ఐజాక్‌మాన్ పెద్ద మద్దతుదారుడే కాకుండా అందులో పెట్టుబడి కూడా పెట్టారు. అయితే 41 ఏళ్ల ఐజాక్‌మాన్ ప్రైవేట్ వ్యోమగామిగా, విజయవంతమైన వ్యాపారవేత్తగా గుర్తింపుపొందారు. 16వ ఏటనే తన స్వస్థలం పెన్సిల్వేనియాలో షిఫ్ట్4 పేమెంట్స్ అనే సంస్థను స్థాపించారు. ఆసంస్థకు సీఈవోగా ఉంటూ బిలియనీర్‌గా ఎదిగారు. ఐజాక్‌మాన్ పేరు ప్రకటించిన సందర్భంగా ట్రంప్ తన అభిప్రాయాన్ని సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. నాసాకు అధిపతిగా విజయవంతమైన వ్యాపారవేత్త, పరోపకారి, పైలట్, ఆస్ట్రోనాట్ అయిన జారెడ్ ఐజాక్‌మాన్‌ను నియమించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ప్రోబా-3 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

» 18 నిమిషాల్లో కక్ష్యలోకి చేర్చిన పీఎస్‌ఎల్వీ-సీ59

సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉపగ్రహాలను సురక్షితంగా కక్ష్యలోకి చేరుస్తూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో తనకంటూ ఒక బ్రాండ్‌ను సృష్టించుకున్న ఇస్రో ఖాతాలో మరో ఘన విజయం వచ్చి చేరింది. తన విజయాశ్వం పీఎస్‌ఎల్వీ-సీ59 రాకెట్ ద్వారా ఇస్రో గురువారం చేపట్టిన ప్రోబా-3 ప్రయోగం విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్‌ఏ)కి చెందిన రెండు ఉపగ్రహాలతో కూడిన ప్రోబా-3ను మోసుకెళ్లిన పీఎస్‌ఎల్వీ-సీ59 దాన్ని సురక్షితంగా నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. వాస్తవానికి ఈ ప్రయోగాన్ని బుధవారమే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. ప్రయోగానికి గంట ముందు రాకెట్‌కు అనుసంధానం చేసిన ఉపగ్రహంలో సాంకేతిక సమస్యను గుర్తించడంతో.. గురువారానికి వాయిదా వేశారు.



అదానీపై ఆగని రగడ!

» పార్లమెంట్ ఆవరణలో విపక్షాల వినూత్న నిరసన

» జేపీసీ వేయాలని డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): అదానీ ముడుపుల వ్యవహారంపై విపక్షాలు వెనక్కి తగ్గడం లేదు. అమెరికా చేసిన ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాల్సిందేనని గురువారం సైతం కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. ఉదయం ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు వినూత్న నిరసన చేపట్టారు. 'మోదీ అదానీ ఏక్ హై.. అదానీ సేఫ్ హై' అనే నినాదంతో ఉన్న జాకెట్లు, టీషర్టులు ధరించి ఆందోళన చేశారు. మోదీ, అదానీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతో సహా కాంగ్రెస్‌తోపాటు విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు ఇందులో పాల్గొన్నారు. ఇటు లోక్‌సభలోనూ విపక్షాల ఆందోళనలు కొనసాగాయి. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది. తొలుత సభలో రాహుల్ మాట్లాడుతూ.. అదానీపై మోదీ విచారణ జరపలేరని.. అదానీపై విచారణ జరపడమంటే మోదీ తనపై తానే చేసుకున్నట్లుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. దీనిపై అధికార పక్ష ఎంపీలు పెద్దఎత్తున అభ్యంతరం తెలిపారు. ఇంతలోనే స్పీకర్ ఓం బిర్లా కలుగజేసుకుని మకర ద్వారం వద్ద విపక్షాల ఆందోళనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాల తీరుపై పార్లమెంటరీ పార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా మండిపడ్డారు. రాహుల్ తీరుపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాహుల్‌గాంధీ దేశ ద్రోహి అని ఆ పార్టీ ఎంపీలు నిషికాంత్ దూబే, సాంబిత్ పాత్రా మండిపడ్డారు. పార్లమెంట్ కార్యకలాపాలకు విపక్షాలు అంతరాయం కలిగిస్తున్నాయంటూ బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. కాగా, రాహుల్‌పై అభ్యంతర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలపై స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా.. కొత్త బిల్లులకు హిందీ పేర్లు పెట్టడం.. హిందీ రాని వారిపై కూడా ఆ భాషను రుద్దడమేనంటూ రాజ్యసభలో కేంద్రంపై విపక్ష సభ్యులు మండిపడ్డారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ప్రవేశపెట్టిన 'భారతీయ వాయుయాన్ విధేయక్-2024' బిల్లుపై గురువారం చర్చ జరిగింది.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

రాష్ట్రంలోని 17వేల రెవెన్యూ గ్రామాల్లో 33 రోజులపాటు నిర్వహణ.. వీలైనంత వరకు అక్కడికక్కడే సమస్యకు పరిష్కారం

» సదస్సుకు ముందే గ్రామంలో అధికారుల పర్యటన

» ప్రజల నుంచి అర్జీల స్వీకరణ.. సదస్సులో వాటిపై చర్చ

» ప్రతి పిటిషన్‌కు రసీదు.. 'రియల్‌టైమ్'లో పరిష్కారం వీక్షణ

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం శుక్రవారం నుంచి 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది. రాష్ట్రంలోని 17వేల రెవెన్యూ గ్రామాలలో సదస్సులు జరగనున్నాయి. మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు సదస్సులకు హాజరుకానున్నారు. జిల్లాల వారీగా ఏ గ్రామంలో ఏ రోజు సదస్సు నిర్వహించాలనే షెడ్యూల్‌ను ఇప్పటికే కలెక్టర్లు సిద్ధం చేశారు. జనవరి 8వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచే సదస్సులు నిర్వహించనున్నారు. గ్రామంలో సదస్సు నిర్వహించడానికి ఒకటిరెండు రోజుల ముందే రెవెన్యూ శాఖ నేతృత్వంలోని అధికారుల బృందం సంయుక్తంగా పర్యటిస్తుంది. ఈ సందర్భంగా గ్రామంలో కబ్జాకు గురైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు, అన్యాక్రాంతమైన అసైన్డ్, చుక్కల, షరతుగల, ఇనామ్ భూములు, రీ సర్వే అనంతరం తలెత్తిన భూవివాదాల పరిష్కారం కోసం ప్రజల నుంచి అధికారుల బృందం పిటిషన్లు స్వీకరించనుంది. వాటిపై గ్రామసదస్సు రోజున చర్చిస్తారు. వీలైనంత మేరకు అక్కడిక్కడే పరిష్కారం చూపనున్నారు. కోర్టు కేసులున్నవి, ఇనామ్ భూములు, తహసీల్దార్, ఆర్డీవో, జేసీ, సీసీఎల్‌ఏ వద్ద అప్పీల్ ఉన్న కేసులు మినహా మిగిలిన సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారు.

భూ సమస్యలకు పరిష్కారం ఇలా..

ముందుగానే ప్రజల నుంచి పిటిషన్లు తీసుకోవడం ద్వారా ఆ సమస్య తీవ్రత ఏమిటి? ఎలా పరిష్కరించాలి? ఎప్పటికి పరిష్కారం అవుతుంది? అనే విషయాలపై అధికారులకు ఓ స్పష్టత వస్తుంది. గ్రామంలో సదస్సు జరిగే రోజు ఆ పిటిషన్లపై చర్చిస్తారు. సదస్సులోనూ ప్రజల నుంచి పిటిషన్లు స్వీకరిస్తారు. ఆ పిటిషన్లకు అక్నాలెడ్జ్‌మెంట్ నెంబరు కేటాయిస్తారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ సైట్‌లో పిటిషన్లను పొందుపరుస్తారు. తద్వారా రియల్‌టైమ్‌లో పరిష్కారం వీక్షించే అవకాశం ఉంటుంది. సదస్సులు ముగిసిన 45 రోజుల తర్వాత భూ వివాదాలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది. పరిష్కారమైన సందేశాన్ని అర్జీదారు సెల్‌ఫోన్‌కు పంపుతారు. తర్వాత ఫోన్‌చేసి అభిప్రాయం తీసుకుంటారు. కేవలం ప్రభుత్వ రికార్డుల్లోనే సమస్య పరిష్కారమైనట్టు చూపించి, క్షేత్రస్థాయిలో ఏ మార్పు లేకుంటే, తిరిగి ఆ పిటిషన్‌ను తెరుస్తారు. సమస్య పరిష్కారం కాలేదన్న కోణంలో పునర్విచారణ చేస్తారు.

సదస్సులు ఎందుకంటే?..

జగన్ జమానా(2019-2024 మే)లో ప్రజలు, రైతులు, సామాన్యుల భూములు నేతల పరమయ్యాయి. వారితో రెవెన్యూ అధికారులు కొందరు కుమ్మక్కై భూముల రికార్డులను తారుమారు చేశారు. భూ సమస్యల పరిష్కారం పేరిట జగన్ సర్కారు భూముల సర్వే చేసింది. కానీ, రీ సర్వే అనంతరం గ్రామాల్లో ఎక్కడాలేని సరికొత్త భూ వివాదాలు తెరమీదకు వచ్చాయి. 4.71 లక్షల ఫిర్యాదులు ఒక్క రీ సర్వే పైనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో ప్రజలు కూటమి నేతల దృష్టికి ఈ సమస్యలను తీసుకొచ్చారు. దీంతో కూటమి సర్కారు అధికారంలోకి రాగానే ప్రజలనుంచి విన్నపాలు స్వీకరిస్తోంది. ఇప్పటికే టీడీపీ ఆఫీసుకు రోజుకు వందలాది మంది రీ సర్వే బాధితులు వచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే గ్రామస్థాయికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని వీలైనంత మేరకు అక్కడిక్కడే పరిష్కారం చూపాలని నిర్ణయించింది. ఇందుకు రెవెన్యూ సదస్సుల నిర్వహణే ఉత్తమంగా భావిస్తోంది. గతంలోనూ తెలుగుదేశం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. బాధితులకు ఇప్పుడు కూడా మేలు చేయాలని భావించి కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను ఖరారు చేసింది.

పూర్తిస్థాయిలో భాగస్వాములవ్వాలి: ఆర్పీ సిసోడియా



గ్రామీణ ప్రాంతాల్లోని భూ వివాదాల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా చెప్పారు. సదస్సుల్లో ప్రజలు, ప్రభుత్వ అధికారులు పూర్తిస్థాయిలో భాగస్వాములైతేనే సమస్యలకు నిజమైన పరిష్కారం లభిస్తుందన్నారు. గత ఆరు నెలల కాలంలో వివిధ రూపాల్లో ప్రజల నుంచి 67 వేల ఫిర్యాదులు వచ్చాయని, వాటిని గ్రామసదస్సుల్లో చర్చకు పెడుతామని చెప్పారు. జిల్లా స్థాయి అధికారి నేతృత్వంలో ప్రతి గ్రామానికీ అధికారుల బృందం వెళ్లనుందన్నారు. కోర్టు కేసులున్నవి, ఇనామ్ భూముల వివాదాలు వినహా మిగిలిన భూ వివాదాలకు అక్కడిక్కడే పరిష్కారం చూపిస్తామని తెలిపారు. అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో సరిహద్దు, విస్తీర్ణం తగాదాలను సెటిల్ చేసే ప్రయత్నం చేస్తామన్నారు. ఆ తర్వాత చట్టపరమైన అంశాలపై ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. రెవెన్యూ రికార్డులనూ అప్‌డేట్ చేస్తామన్నారు. భూ కబ్జాలు, దురాక్రమణలు రుజువైతే అక్కడిక్కడే విముక్తి కలిగిస్తామని, కబ్జాదారులపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు పెట్టి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. గత ఆరు నెలల్లో అసైన్డ్ భూములను పరిశీలించగా ఫ్రీ హోల్డ్ అయిన 9 లక్షల ఎకరాల్లో 4.21 లక్షల ఎకరాలను అక్రమంగా 22(ఏ) నుంచి తీశారని గుర్తించినట్లు తెలిపారు. ఈ భూములపై సదస్సుల్లో చర్యలు తీసుకుంటామన్నారు. తప్పు చేసిన వారిపై పీవోటీ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు పెడుతామని హెచ్చరించారు. ఇంటిపట్టాలపై కూడా విచారణ ఉంటుందన్నారు. గ్రామం వారీగా ఇంటిపట్టాల లబ్ధిదారుల జాబితాను బయటపెట్టి అసలైనవారు ఎవరో, అనర్హులు ఎవరో అక్కడికక్కడే తేలుస్తామని చెప్పారు. 'రెవెన్యూ సదస్సుల్లో ఏం చేయాలో రెవెన్యూశాఖ వద్ద చాలా పెద్ద ఎజెండా ఉంది. మొక్కుబడి సమావేశాలు ఉండవు. కాబట్టి, ప్రజలు సీరియస్‌గా సదస్సుల్లో పాల్గొనాలి. అధికారులు సీరియస్‌గా తీసుకొని పనిచేస్తారు. తప్పక పరిష్కారం చూపిస్తాం. సీఆర్‌డీఏ పరిధిలో కూడా సదస్సులు ఉంటాయి' అని సిసోడియా తెలిపారు.

కాకినాడ కబ్జా కేసుల్లో

జగన్‌ను ఏ1గా చేర్చాలి: ఆనం

అమరావతి, న్యూఢిల్లీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'గన్ను చూపించి కాకినాడ సెజ్, పోర్టులో వాటాలు రాయించుకున్న కేసులో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఏ-1గా చేర్చాలి. ఈ కబ్జా వ్యవహారాల్లో మొత్తం కర్త, కర్మ, క్రియ ఆయనే. ఈ దుర్మార్గాలకు జగన్‌ను ప్రాసిక్యూట్ చేయాలి' అని ఆక్వా అథారిటీ వైస్ చైర్మన్, టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 2వ అతి పెద్దదైన కాకినాడ సెజ్‌పై నాటి సీఎం జగన్ కళ్లు పడ్డాయి. విజయసాయి రెడ్డి, విక్రాంత్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డిని ముందు పెట్టి కాకినాడ సెజ్, పోర్టు కంపెనీల్లో ప్రధాన భాగస్వామిగా ఉన్న కేవీ రావును తీవ్రంగా బెదిరించి మెజారిటీ వాటాలు రాయించుకున్నారు. కాకినాడ సెజ్‌లో రూ.2,000 కోట్ల విలువైన 4,000 ఎకరాల భూమిని కేవలం రూ.12 కోట్లకు రాయించుకున్నారు. కాకినాడ డీప్ సీ పోర్టును ఇంకా ఘోరంగా కొట్టేశారు. ఈ ఒక్క సంవత్సరమే ఈ పోర్టు ఆదాయం రూ.450 నుంచి రూ.530 కోట్ల మధ్యలో ఉంది. ఇందులో కేవీ రావుకు చెందిన 59% వాటాను రూ.494 కోట్లకు తీసుకున్నారు. ఈ వాటా కింద ఒక్క గత సంవత్సరంలోనే డివిడెండ్లు, ఐసీడీ డిపాజిట్ల రూపంలో రూ.380 కోట్లు వచ్చాయి' అని ఆనం అన్నారు.

త్వరలో వైసీపీ అరాచకాలన్నీ బయటకొస్తాయి: టీడీపీ ఎంపీలు

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురించి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ ఎంపీలు ఎద్దేవా చేశారు. గురువారం, ఢిల్లీలో టీడీపీ ఎంపీలు నాగరాజు, తెన్నేటి కృష్ణప్రసాద్ మీడియాతో మాట్లాడారు. 'ప్రజల మధ్య తిరగకుండా ఢిల్లీలో ఉంటూ విజయసాయిరెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేస్తూ ఏపీ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారు. కేవీ రావు అంశంలో గుమ్మడి కాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్న రీతిలో ఆయన వైఖరి ఉంది. త్వరలో వైసీపీ అరాచకాలు అన్నీ బయటకి వస్తాయి' అని అన్నారు.

వైఎస్ఆర్ 'ఆత్మ' ఆధ్వర్యంలోనే కొనుగోలు!

- మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ సెజ్ భూముల కొనుగోళ్లు దివంగత సీఎం వైఎస్ఆర్ ఆత్మగా భావించే ఓ నాయకుడి ఆధ్వర్యంలోనే జరిగాయని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో గురువారం ఆయన మాట్లాడారు. 'కాకినాడ పోర్టులో అక్రమాలు ఎప్పటినుంచో జరుగుతున్నాయి. కాకినాడ పోర్టు విషయంలో కేంద్రం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో న్యాయవిచారణ జరిపించాలి. అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. రాష్ట్రంలో సమస్యలను పక్కదారి పట్టించేందుకు గత ఆరు నెలలుగా డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తున్నారు. ఇందులో ప్రతిసారి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేంద్ర బిందువు అవుతున్నారు' అని హర్షకుమార్ ఆరోపించారు.

బాబు, కేవీ రావుపై పరువు నష్టం దావా వేస్తా

- మళ్లీ మేం అధికారంలోకి రావడం ఖాయం
- బాబు అప్పటికి బతికి ఉంటే అరెస్టు చేస్తాం: విజయసాయిరెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తనపై లుకౌట్ నోటీసులు జారీ చేసినందుకు సీఎం చంద్రబాబు, కేవీ రావులపై వచ్చేవారం పరువునష్టం దావా వేస్తానని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై లుకౌట్ నోటీసులు జారీచేయడాన్ని ప్రశ్నించారు. తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికే చేశారని ఆరోపించారు. '2028లో ఎన్నికలు జరుగుతాయి. మేం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. అప్పటి వరకు చంద్రబాబు బతికుంటే అరెస్టు చేస్తాం. టీడీపీ ఎమ్మెల్యేలందరికీ చెబుతున్నా. మీ నాయకుడికి కులం తప్ప.. పరిపాలన తెలియదు. ముఖ్యమంత్రిని మార్చండి. చంద్రబాబు, లోకేశ్ కంటే పవన్ కల్యాణ్ మంచి నాయకుడు. కేవీ రావుకు అన్యాయం జరిగి ఉంటే అప్పుడే కోర్టులను ఆశ్రయించి ఉండాల్సింది. ఆయన్ను విక్రాంత్‌రెడ్డి భయపెట్టాడని ప్రచారం చేస్తున్నారు. రావుకు ఫోన్ చేసినట్లు, బెదిరించినట్లు ఆధారాలు ఉన్నాయా? కాకినాడ పోర్టు వ్యవహారంపై 1997 నుంచీ సీబీఐ దర్యాప్తు జరపాలి' అని డిమాండ్ చేశారు.

ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదు

- గతంలో మాదిరిగా చేస్తే ఉపేక్షించను
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- అధికారులకు ముఖ్యమంత్రి గట్టి హెచ్చరిక



ధాన్యం కొనుగోలుపై సమీక్ష సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు, ఉన్నతాధికారులు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవడానికి ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇంకా గత ప్రభుత్వంలో మాదిరిగానే వ్యవహరిస్తే మాత్రం ఉపేక్షించేది లేదని అధికారులకు గట్టి హెచ్చరిక చేశారు. ఐదేళ్లలో రైతులు పంటలు అమ్ముకోవడానికి ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశామని, అందుకే ఈసారి ధాన్యం కొనుగోళ్లలో సమూల మార్పులు తీసుకువచ్చామని చెప్పారు. అయినప్పటికీ ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లోపాలు కనిపిస్తున్నాయని, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సమస్యలను అధిగమించాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యం, సహాయ నిరాకరణ కారణంగా రైతులు ఇబ్బందిపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో లోపాలపై ముఖ్యమంత్రి గురువారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసం నుంచి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్ జి.వీరపాండియన్, కార్పొరేషన్ ఎండీ మన్‌జీర్ జిలానీ అమూన్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఆదేశించారు. 'గతంలో ర్యాండమ్ పద్ధతిలో ప్రభుత్వం సూచించిన రైసు మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపాల్సి వచ్చేది. ఇప్పుడు రైతులు అమ్మిన ధాన్యాన్ని ఏ మిల్లుకైనా పంపించుకునే సౌలభ్యం కల్పించాం. రైతులు వాట్సాప్ ద్వారా తమ పంటను అమ్ముకునే సౌకర్యం కూడా కల్పించాం. గత ప్రభుత్వంలో నెలల తరబడి ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవి కాదు. ఇప్పుడు మేం 24 నుంచి 48 గంటల్లోపే ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నాం. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు, మిల్లర్లు, అధికారులతో ఉమ్మడి కమిటీలు ఏర్పాటు చేశాం. కొనుగోళ్ల ప్రక్రియను సులభతరం చేసేందుకు తీసుకొచ్చిన విధానాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బందిపైనే ఉంది. ధాన్యాన్ని ఆరబెట్టే యంత్రాల (డ్రయ్యర్లు) ఏర్పాటు ద్వారా ధాన్యంలో తేమ విషయంలో తలెత్తుతున్న సమస్యలకు ఎంతవరకు పరిష్కారం చూపవచ్చో అధికారులే పరిశీలించాలి. రాష్ట్రంలో రేషన్ బియ్యం రీసైక్లింగ్, స్మగ్లింగ్ పెద్ద మాఫియాగా మారిపోయింది. ఈ సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలి. బియ్యం స్మగ్లింగ్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవడంతోపాటు ఇక మీద ఎక్కడా స్మగ్లింగ్ జరగకుండా చూడాలి. జరిగితే అధికారులు, ఉద్యోగులదే బాధ్యత' అని తేల్చిచెప్పారు.

సంచుల కొరత రానివ్వొద్దు..

ధాన్యం అమ్ముకోవడానికి రైతులు సంచుల కోసం ఇబ్బందిపడే పరిస్థితి రాకుండా చూడాలని, రైతులు తమ చుట్టూ తిరగాలనే సంస్కృతిని విడనాడాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి సహకరించబోమని, రైతులను ఇబ్బందులు పెడతామంటే కుదరదని, అలాంటి మిల్లర్లపై చర్యలకు వెనుకాడొద్దని కలెక్టర్లకు సూచించారు. మిల్లుల్లో అన్ లోడింగ్‌లో జాప్యాన్ని నివారించేందుకు ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. వాట్సాప్ ద్వారా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సక్రమంగా అమలవుతుందా.. ఫలితాలు ఎలా ఉన్నాయనేది కూడా పరిశీలించాలని చెప్పారు. రాష్ట్రంలో ఆయా జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల వివరాలను ప్రతి రోజూ మీడియా ద్వారా వెల్లడించాలని, తద్వారా సమాచారం ప్రజలకు చేరుతుందని తెలిపారు.

- ధాన్యం కొనుగోళ్ల తీరుపై రైతుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం తీసుకుంటున్నాం. ఎక్కడైనా సమస్య ఉందని తెలిస్తే.. నేనే స్వయంగా అక్కడకు వెళ్తాను. అక్కడే అధికారులు సమాధానం చెప్పాల్సి వస్తుంది.
- ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా మద్దతు ఉంది.. నిధులు అందుబాటులో ఉన్నా అధికారులు, ఉద్యోగుల వైఫల్యంతో మాకు చెడ్డపేరు వస్తే ఎందుకు సహించాలి?

- సీఎం చంద్రబాబు

37 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ సమయానికి కేవలం 5.22 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా.. ఈ ఏడాది ఇప్పటికి 10,59,457 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నామని చెప్పారు. 48 గంటల వ్యవధిలోనే మొత్తం 1.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో మద్దతు ధర జమ చేశామన్నారు. గురువారం నాటికి రూ. 2,331 కోట్లు చెల్లించగా.. ఇందులో రూ.2,202 కోట్లు 24 గంటల్లోనే చెల్లించామని, మిగిలిన రూ. 128 కోట్లు 48 గంటల వ్యవధిలో చెల్లించామని వివరించారు. మొత్తం 14 జిల్లాల్లో కొనుగోళ్లు చేస్తుండగా.. తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా 1.84 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరి-1.81 లక్షలు, ఏలూరు-1.69 లక్షలు, కోనసీమ-1.44 లక్షలు, కృష్ణా జిల్లాలో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మరో 9 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయన్నారు.

సెకీ ఒప్పందంపై జగన్‌ను విచారించండి

- స్వప్రయోజనాల కోసమే అదానీతో డీల్
- ఏసీబీకి వైఎస్ షర్మిల ఫిర్యాదు



ఏసీబీ బోనులో ఉందంటూ మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)ని అడ్డుపెట్టుకుని గౌతం అదానీతో ముఖ్యమంత్రి హోదాలో 7,000 మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్న వైఎస్ జగన్మోహనరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)ను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. గురువారం విజయవాడలోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో ఏసీబీ జాయింట్ డైరెక్టర్(ఆంధ్ర) రజనీని కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో స్వయం ప్రతిపత్తి కలిగిన ఏసీబీని పంజరంలో చిలుకలా బందీని చేశారని ఆరోపిస్తూ పంజరంలో చిలుకను పట్టుకుని మీడియాతో మాట్లాడారు. అదానీపై చర్యలెందుకు తీసుకోవడంలేదని చంద్రబాబును ప్రశ్నించారు. అదానీ బీజేపీ మనిషి అని, మోదీతో కూటమికి అనుబంధం ఉందని, అందుకే అదానీకి, మోదీకి భయపడుతున్నారని, అదానీని కాపాడుతున్నారని ఆరోపించారు. అమెరికా దర్యాప్తు సంస్థ చెబితేగాని అదానీ అవినీతి, జగన్ ముడుపుల వ్యవహారం బయటకు రాలేదన్నారు. 'ఈ అవినీతిని బయట పెట్టడం సీబీఐకి చేతకాదా? మోదీ చేతకానివాడా' అని నిలదీశారు. సౌర విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో జగన్‌పైన, ఒప్పందాలపైన దర్యాప్తు చేయాలంటూ ఏసీబీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. కానీ రాష్ట్రంలో ఏసీబీని బందీని చేశారని ఆరోపించారు. 'టీడీపీ పంజరంలో ఏసీబీ బందీ అయింది. ఆ పంజరం నుంచి వెంటనే విడుదల చేయాలి. ఏసీబీ జగన్ లంచాల వ్యవహారాన్ని బయట పెట్టాలి' అని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజల నెత్తిన విద్యుత్ చార్జీల భారాన్ని పెట్టారని, అదానీ డీల్‌తో మరో లక్షన్నర కోట్ల భారం పడుతుందని ఆమె ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాలను చంద్రబాబు పక్కన పెట్టాలన్నారు. జగన్ తన సొంత ప్రయోజనాల కోసం డీల్ చేసుకున్నారని విమర్శించారు. జగన్‌కూ చంద్రబాబుకూ తేడా లేదన్నారు. ప్రజలు కూటమిని నమ్మి రాత్రి 9 గంటల దాకా క్యూలో నిలుచుని ఓటు వేశారని ఆమె గుర్తు చేశారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాలని చంద్రబాబును కోరారు.

అక్రమాలు చేసేందుకు గన్ కన్నా జగనే ముందొచ్చారు

- ఎమ్మెల్యే నల్లమిల్లి ఎద్దేవా



అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడికైనా గన్ కన్నా జగనే ముందు వస్తారన్న మాజీ మంత్రి రోజా వ్యాఖ్యలు నిజమేనని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూకబ్జాలు, అక్రమాలు చేయడానికి, పారిశ్రామిక వేత్తల ఆస్తులు లాక్కోవడానికి గన్ కన్నా ముందే జగన్ ముందే వచ్చి బెదిరిస్తారన్న విషయం బట్టబయలు అవుతోందన్నారు. కాకినాడ పోర్టు యజమానికి బెదిరింపులు, వైసీపీ భూ కబ్జాలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అనంతరం 'వారధి' కార్యక్రమంలో పార్టీ నాయకుడు ఆర్డీ విల్సన్, నాగోతు రమేశ్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

జగన్ ద్రోహం వందేళ్లయినా క్షమించలేం

- బిహార్ గ్యాంగ్‌లా దౌర్జన్యాలు: నాగోతు రమేశ్

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి జగన్ చేసిన ద్రోహం మరో వందేళ్లయినా క్షమించరానిదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు అన్నారు. బ్యూరోక్రాట్లు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు సహా ఎవరినీ ప్రశాంతంగా బతకనివ్వలేదని విమర్శించారు. బిహార్ గ్యాంగ్ తరహాలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో రమేశ్‌నాయుడు గురువారం మాట్లాడారు. ఐదేళ్లలో జగన్ బెదిరింపులతో ఎందరో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి వెళ్లిపోయారని, కేవీ రావు తరహాలో ఆస్తులు వదులుకున్నారని అన్నారు. అవినీతి, బెదిరింపులతో దోచుకున్న భారీ మొత్తాన్ని జగన్ విదేశాలకు తరలించారని సంచలన ఆరోపణలు చేశారు.

దందా మూలాలపై సీ'ఐ'డీ!

- కాకినాడ పోర్టు వాటాల బదిలీ ఎలా జరిగింది?
- కేంద్రం దృష్టికి ఈ విషయాలు వెళ్లాయా?
- ఐఅండ్ఐ,ఆర్‌వోసీ,మారిటైమ్ బోర్డుకు సీఐడీ లేఖ
- కాకినాడ సీపోర్టు కార్యాలయానికి అధికారులు

అమరావతి, కాకినాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు యజమాని కేవీ రావును బెదిరించి రూ.మూడు వేల కోట్ల విలువైన వాటాలు లాక్కున్న నాటి సీఎం జగన్ టీమ్ వ్యవహారంలో సీఐడీ పకడ్బందీగా అడుగులు వేస్తోంది. ఈ దందా మూలాలపై లోతుగా దృష్టి సారించింది. షేర్ల బదిలీ, ఆస్తుల మార్పిడి పద్ధతి ప్రకారమే జరిగిందా.....అన్ని అనుమతులు తీసుకునే చేశారా... తదితర వివరాలు కోరుతూ... పెట్టుబడులు, మౌలిక వసతులు (ఐఅండ్ఐ), రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌వోసీ), మారిటైమ్ బోర్డుకు సీఐడీ లేఖలు రాసింది. పాతిక సంవత్సరాల (1999) క్రితం ప్రైవేటు యాజమాన్యంలోకి వెళ్లిన కాకినాడ పోర్టులో వాటాల విక్రయానికి విధివిధానాలేంటి....కేవీ రావు చేతిలో ఉన్నప్పుడు ప్రభుత్వానికి 900కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన మాట నిజమా....పోర్టు యాజమాన్యం (42శాతం) చేతులు మారిన తర్వాత దానిని రూ.9కోట్లుగా మాత్రమే చూపించింది వాస్తవమా.... లాక్ ఇన్ పీరియడ్ ఎన్ని సంవత్సరాలుంది.. వాటాల బదిలీ సమయంలో ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులూ వచ్చాయా.. యాజమాన్య బోర్డులో తీర్మానం నెగ్గిందా.. కొనుగోలు చేసిన కంపెనీ నుంచి అటువంటి తీర్మానం ఏదైనా ఉందా....కేవీ రావు నుంచి అరబిందోకు షేర్ల బదిలీ వ్యవహారాలు చూసిందెవరు.... అరబిందో డైరెక్టర్ల పాత్ర ఎంతమేరకు ఉంది.... పోర్టు అంటే సెక్యూరిటీ కూడా ముఖ్యమే.. కేంద్రం దృష్టికి బదిలీ వ్యవహారం వెళ్లిందా... రక్షణ కోణంలో మార్గదర్శకాలు అనుసరించారా?....అంటూ సీఐడీ అధికారులు... పై మూడు సంస్థలకు లేఖలు రాశారు. వారి నుంచి వచ్చే సమాచారాన్ని బట్టి నిందితులకు నోటీసులు ఇచ్చి విచారించనున్నట్లు సమాచారం. జగన్ పేరు చెప్పి కేవీ రావును బెదిరించిన వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి(ఏ1) ఇప్పటికే ముందస్తు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు ఫోను చేసి విక్రాంత్‌తో మాట్లాడాలంటూ కేవీ రావుపై ఒత్తిడి తెచ్చిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి(ఏ2) ఢిల్లీలో ఎదురు దాడి చేస్తున్నారు. షేర్లు బదిలీ చేయించుకున్న అరబిందో యజమాని శరత్‌చంద్రారెడ్డి, ఆడిటర్ శ్రీధర్ అండ్ సంతానం ఎల్ఎల్‌పీ న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నట్లు సీఐడీకి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కేసు వీగిపోకుండా పకడ్బందీగా ఉచ్చు బిగించే క్రమంలో ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. కాగా, కాకినాడ సీపోర్టు లిమిటెడ్ కార్యాలయానికి గురువారం సీఐడీ అధికారులు వెళ్లారు. అక్కడే అర్ధ రాత్రి వరకు ఉన్నారు. కార్యాలయ సీఈవోతోపాటు మరికొందరు ఉద్యోగులను నాటి వ్యవహారాలపై ఆరా తీశారు.

విజయసాయి సహా నిందితులపైనా లుకవుట్!

కేవీ రావును బెదిరించి షేర్లు లాక్కున్న కేసులో విజయసాయిరెడ్డి (ఏ2)తోపాటు ఇతర నిందితులపై సీఐడీ లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ) జారీ చేసింది. జగన్ చిన్నాన్న, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి(ఏ1), విజయసాయిరెడ్డి అల్లుడి సోదరుడు, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లోనూ నిందితుడైన అరబిందో యజమాని శరత్ చంద్రారెడ్డిపైనా ఎల్‌వోజీ ఇచ్చింది. నిందితులు విదేశాలకు పారిపోయే అవకాశం ఉందన్న సమాచారంతో ముందస్తు జాగ్రత్తగా ఎల్‌వోసీ జారీ చేసింది.

కుట్ర పన్ని కాజేశారు!

(మొదటి పేజీ తరువాయి)

చెన్నైకు చెందిన పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీని తెరపైకి తెచ్చారు. కేవీరావు నిర్వహణలో ఉన్న సీపోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.994 కోట్లు ఎగ్గొట్టినట్లు తప్పుడు నివేదికలు సృష్టించారు. దాన్ని అడ్డంపెట్టుకుని కాకినాడ సీపోర్టు(డీప్‌వాటర్‌పోర్టు)లో కేవీరావు నుంచి 41.12 శాతంవాటాను విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డి అరబిందో పేరు మీద రాయించుకున్నారు. 2020లో కేవీ రావు ప్రాణభయంతో అమెరికాకు వెళ్లిపోయి మూడేళ్లు అక్కడే తల దాచుకున్నారు. ప్రభుత్వ పెద్దలే బెదిరించడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. కనీసం ఫిర్యాదు చేసేందుకు కూడా సాహసించలేని దుస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాకినాడ పోర్టులోని అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కాకినాడ సీపోర్టు(డీప్‌వాటర్‌పోర్టు)లో కేవీరావు నుంచి వాటాను బలవంతంగా రాయించుకున్న ఘటనలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి.

- కుక్కను చంపాలంటే పిచ్చిదని ముద్ర వేయాలన్నది నానుడి. నాడు కాకినాడ పోర్టు వాటాలు లాక్కోవడానికి జగన్ అండ్ కో ఇంతకంటే దారుణమైన కుట్ర చేశారు. కేవీ రావు నుంచి 41.12 శాతం వాటా రాయించుకునే వరకు ఎన్నో రకాలుగా వేధించి, భయపెట్టారు.
- మొదట విజిలెన్స్ అధికారులను రంగంలోకి దింపారు. పోర్టులో 40 రోజులు మకాం వేసి కేవీ రావుపై ఒత్తిడి చేశారు. ఆయన మాట వినకపోవడంతో మారిటైమ్ బోర్డును ఉసికొల్పారు. బోర్డు సీఈవోగా జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి సన్నిహితుడిని నియమించారు. సంచుల కొద్దీ డాక్యుమెంట్లు తెప్పించి ప్రభుత్వానికి 994 కోట్లు ఎగ్గొట్టినట్టు ఆడిటింగ్ సంస్థతో నివేదిక తయారు చేయించారు. ఆ తర్వాతి కథ విక్రాంత్ రెడ్డి నడిపించారు.
- ఆడిటింగ్ సంస్థ నివేదికను బూచిగా చూపి వాటాలు ఇస్తావా? లేక జైలుకు పంపాలా? అని కేవీరావును విక్రాంత్ రెడ్డి గన్‌తో బెదిరించారు. ఆయన అమెరికాకు వెళ్లినా మళ్లీ వెనక్కి రప్పించి బలవంతంగా సంతకాలు చేయించుకున్నారు. పోర్టులో రూ.2,500 కోట్ల విలువైన వాటాకు రూ.494 కోట్లు, సెజ్‌లో రూ.1,104 కోట్ల విలువైన షేర్లకు రూ.12 కోట్ల బేరం కట్టారు. అరబిందో పేరు మీద రాయించుకున్నారు. నాడు జరిగిన బాగోతంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

మొదట విజిలెన్స్ రంగంలోకి...

మొదట 2020 జనవరిలో రాష్ట్ర విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దించారు. అమరావతి, విశాఖపట్నం నుంచి ఎంపిక చేసిన పోలీసు అధికారులతో కూడిన విజిలెన్స్ బృందాన్ని కాకినాడ సీపోర్టుకు పంపించారు. వీరంతా 40 రోజులు సీపోర్టులో మకాం వేశారు. మొత్తం పోర్టుకు సంబంధించిన వ్యాపార లావాదేవీలు, కార్గో వ్యవహారాలు, రాష్ట్రప్రభుత్వానికి చెల్లించిన, చెల్లించాల్సిన పన్నుల సమాచారం ఇవ్వాలని పోర్టు కార్యాలయ సీఈవోపై ఒత్తిడి తెచ్చారు. దీనికి కేవీరావు అభ్యంతరం చెప్పారు. విజిలెన్స్ అధికారులకు సీపోర్టు డాక్యుమెంట్లతో పని ఏంటని అడిగారు. అసలు విజిలెన్స్ అధికారులకు సంబంధం ఏంటని నిలదీశారు. రాతపూర్వకంగా లేఖ ఇస్తే చూస్తామని కరాఖండీగా చెప్పేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు నేరుగా పోర్టు డాక్యుమెంట్ల లేఖ ఇచ్చి సేకరిస్తే భవిష్యత్తులో దొరికిపోతామని భయపడ్డారు. చిక్కులు వస్తాయని నాటి సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు.

మారిటైమ్ బోర్డు ద్వారా...

విజిలెన్స్ అధికారుల ద్వారా కేవీ రావును బెదిరించాలన్న ప్లాన్ వర్కవుట్ కాకపోవడంతో మరో కుట్రకు తెరలేపారు. వైవీ సుబ్బారెడ్డి కొడుకు విక్రాంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. అప్పటికప్పుడు పోర్టులపై పర్యవేక్షణ కలిగిన రాష్ట్ర ప్రభుత్వ విభాగమైన ఏపీ మారిటైమ్ బోర్డును పురమాయించారు. తమకు కావాల్సిన డాక్యుమెంట్లను దీని ద్వారా అధికారికంగా సేకరించాలని నిర్ణయించారు. అయితే మారిటైమ్ బోర్డు సీఈవో తమకు అనుకూల వ్యక్తి అయితేనే అనుకున్న పని జరుగుతుందని భావించారు. అప్పటికప్పుడు 2020లో ప్రభుత్వ అధికారిని కాకుండా చెన్నైకు చెందిన కె.మురళీధరన్ అనే ప్రైవేటు వ్యక్తిని తీసుకువచ్చి సీఈవో సీట్లో కూర్చోబెట్టేశారు. ఆయన విక్రాంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. మురళీధరన్ బాధ్యతలు తీసుకోగానే తాము అడిగిన డాక్యుమెంట్లు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం తరఫున కేఎస్‌పీఎల్‌ను ఆదేశించారు. పోర్టులోనే 40 రోజులుగా మకాం వేసిన విజిలెన్స్ అధికారులకు వాటిని పంపించారు. ఇలా 7 వేల డాక్యుమెంట్లను కేవీరావు నిర్వహణలో ఉన్న పోర్టు నుంచి విజిలెన్స్ సేకరించింది. లోపాలను గుర్తించి, దొంగ నివేదికలను సృష్టించారు. వీటన్నింటిని మూటలు కట్టించి చెన్నై నుంచి పిలిపించిన సంతానం ఆడిటింగ్ కంపెనీ చేతిలో విక్రాంత్‌రెడ్డి ఉంచారు. పోర్టులో ఆడిటింగ్ కంపెనీ మకాం వేసి వీటన్నింటినీ పరిశీలించింది. కేవీ రావు రూ.994 కోట్లు ప్రభుత్వానికి ఎగ్గొట్టారనే నివేదికను తయారు చేసి జగన్‌కు అందించింది.

విక్రాంత్ సన్నిహితుడికి ప్రతిఫలం

కేఎస్‌పీఎల్‌లో వాటా కొట్టేయడం కోసం మారిటైమ్ బోర్డు సీఈవోగా నియమించిన మురళీధరన్ నాడు జగన్‌కు అన్ని విధాలా సహకరించారు. అడ్డదారిలో పోర్టు వాటా రాయించుకోవడానికి కావాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మురళీధరన్ అంతకుముందు క్రైకల్ పోర్టులో పనిచేసిన అనుభవంతో జగన్‌కు సహకరించారు. కేవీరావు నుంచి వాటాలు రాయించేసుకున్న తర్వాత మురళీధరన్‌కు అందుకు ప్రతిఫలంగా కీలక పదవి కట్టబెట్టారు. అరబిందో కంపెనీ కాకినాడ సెజ్‌లో కొత్తగా నిర్మిస్తున్న కాకినాడ గేట్‌వే పోర్టు లిమిటెడ్ (కేజీపీఎల్)కు ఆయన్ను ఏకంగా డైరెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. జగన్, అరబిందో, మురళీధరన్ బంధాన్ని దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

విక్రాంత్ రెడ్డి నేరుగా

ఆడిటింగ్ కంపెనీ నివేదిక జగన్‌కు అందగానే ఆయన ఆదేశాలతో విక్రాంత్ రెడ్డి నేరుగా రంగంలోకి దిగారు. రూ.994 కోట్లు ఎగ్గొట్టారన్న విషయాన్ని ప్రస్తావిస్తూ కేవీరావును బెదిరించడం మొదలుపెట్టారు. పోర్టులో 41.12 శాతం వాటా వదిలేసుకుంటావా.. లేదా అరెస్టయి జీవిత కాలం జైలుశిక్షకు అనుభవిస్తావా? అని భయపెట్టారు. పిలిపించి సంతకాలు చేయాలని బెదిరించారు. గన్‌తో బెదిరించారు. దీంతో చేసేదిలేక వ్యాపారం పనిపై అమెరికా వెళ్లి మళ్లీ వస్తానని చెప్పి కేవీరావు దేశం విడిచి వెళ్లిపోయారు. అయినా విక్రాంత్ రెడ్డి వదల్లేదు. దేశానికి వస్తావా? లేదంటే సంతకాలకు తానే అమెరికాకు రావాలా అంటూ బెదిరించారు. పైగా కేవీరావు ఇద్దరు కుమార్తెలు ఇక్కడే ఉండడం, వారికి వివాహాలు చేయాల్సి ఉండడంతో ఆయన భయపడ్డారు. అమెరికా నుంచి వచ్చి వచ్చి సంతకాలు చేసేశారు. సీపోర్టులో వాటాతోపాటు సెజ్‌లో వాటాలు కూడా రాసిచ్చేస్తున్నట్లు ఆయనతో సంతకాలు చేయించుకున్నారు. అడ్వాన్స్ కింద ఇస్తామన్న రూ.100 కోట్లు ఇచ్చినట్లు చూపించి ఆ డబ్బు వేరొకరికి సర్దుబాటు చేయాలని బెదిరించారు. ఆ తర్వాత అమెరికా వెళ్లిపోయిన కేవీరావు 2020 నుంచి ఇటీవల వరకు అక్కడే ఉండిపోయారు.

సీఈవో పోస్టుపై కన్ను..

కేవీ రావు నుంచి 41.12 శాతం వాటాను బెదిరించి రాయించుకోగా, కేఎస్‌పీఎల్‌లో ఆయనకు ఇంకా దాదాపు 47 శాతం వాటా ఉంది. మెజారిటీ వాటా ఆయనదే. అయితే అరబిందో పేరుతో వాటాను బదలాయించేసుకున్న విక్రాంత్‌రెడ్డి ఆ వెంటనే కేఎస్‌పీఎల్ సీఈవో పోస్టుపై కన్నేశారు. అతిపెద్ద వాటాదారుడైన కేవీ రావు నియమించిన సీఈవోను తప్పించి, ఆ స్థానంలో అరబిందో తరఫున మరో వ్యక్తిని నియమించాలని చూశారు. మారిటైమ్ బోర్డు సీఈవోగా తాము నియమించిన కె.మురళీధరన్‌ను కేఎస్‌పీఎల్ సీఈవోగా చేయాలని ప్రయత్నించారు. కేవీరావు ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటాలు బలవంతంగా రాయించుకున్నారని, తనకు మిగిలి ఉన్న మెజారిటీ వాటాకు సంబంధించి సీఈవోగా తమ వ్యక్తే ఉండాలని పట్టుబట్టారు. అయితే విక్రాంత్ రెడ్డి ఖాతరు చేయకుండా సీఈవో పోస్టు కోసం ప్రయత్నాలు కొనసాగించారు. అయితే ఉద్యోగుల నుంచి వ్యతిరేకత రావడంతో ఈ ప్రతిపాదన ఆగిపోయింది. అరబిందో పేరుపై వాటా బదిలీ అయినప్పటి నుంచి పోర్టు పాలనలో జగన్ మనుషుల జోక్యం పెరిగిపోయింది. బిల్లుల చెల్లింపు, కార్గో రవాణా, ఇతర నిర్ణయాల్లో కేవీరావును అదే పనిగా సతాయించడం మొదలుపెట్టారు.

కాకినాడ పోర్టుపై సీఐడీ కేసులో..

హైకోర్టుకు విక్రాంత్‌రెడ్డి

- ముందస్తు బెయిల్ మంజూరుకు వినతి
- కేవీరావు ఆరోపణలకు ఆధారాల్లేవు
- జగన్‌ను అపఖ్యాతి పాల్జేయడానికే ఫిర్యాదు
- షేర్ హోల్డింగ్ కంపెనీలన్నీ హైదరాబాద్‌లోనే
- షేర్ల బదలాయింపు జరిగింది అక్కడే
- కేసు నమోదుచేసే అధికార పరిధి
- మంగళగిరి సీఐడీ పోలీసులకు లేదు
- దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధం
- పిటిషన్‌లో వైవీ సుబ్బారెడ్డి కుమారుడి వెల్లడి

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తనను బెదిరించి, భయపెట్టి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని వాటాలను బలవంతంగా రాయించుకున్నారని కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీరావు) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగళగిరి సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ బాబాయి, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు వై.విక్రాంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు గురువారం పిటిషన్ దాఖలు చేశారు. వాటాల బదలాయింపు వ్యవహారంలో తనకెలాంటి పాత్రా లేదని అందులో తెలిపారు. తన తండ్రి జగన్మోహన్‌రెడ్డి బంధువు, ఎంపీ అయినందున ఆయన రాజకీయ ప్రతిష్ఠను దిగజార్చేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసం తనపై ఫిర్యాదు చేశారని.. కేసు కూడా పెట్టారని పేర్కొన్నారు. 'జగన్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన్ను అపఖ్యాతిపాల్జేసేందుకే ఫిర్యాదు చేసినట్లు కనపడుతోంది. ఘటన జరిగిన నాలుగున్నరేళ్ల తర్వాత ఎందుకు కేసు పెట్టారో కారణాలను ఎఫ్ఐఆర్‌లో పేర్కొనలేదు. ఫిర్యాదులో కేవీరావు చేసిన ఆరోపణలకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలూ లేవు. ప్రాథమిక విచారణ జరిపి ఫిర్యాదు వాస్తవికతను నిర్ధారించకుండానే సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. షేర్ హోల్డింగ్ కంపెనీలన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి. షేర్ల బదలాయింపు ప్రక్రియ మొత్తం అక్కడే జరిగింది. కేసు నమోదు చేసేందుకు మంగళగిరి సీఐడీ పోలీసులకు ఎలాంటి అధికార పరిధీ లేదు. ఇది నేర విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే. కేసు నమోదు వెనుక అధికార పార్టీ ప్రోద్బలం ఉంది. ప్రభుత్వానికి రూ.1,000 కోట్లు ఎగ్గొట్టారంటూ తప్పుడు ఆడిట్ రిపోర్ట్ ఇచ్చారని ఫిర్యాదుదారు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఆడిట్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఇప్పటి వరకు ఎలాంటి కంప్లయింటూ ఇవ్వలేదు. వాటాల బదలాయింపు కోసం తనను, కుటుంబ సభ్యులను బెదిరించారని చేసిన ఆరోపణకు కేవీరావు ఎలాంటి ఆధారాలూ సమర్పించలేదు. బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 111 (వ్యవస్థీకృత నేరం) కింద నాపై కేసు నమోదు చెల్లుబాటు కాదు. నాకెలాంటి పూర్వ నేరచరిత్రా లేదు. దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధం. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటాను. నన్ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. లుకవుట్ నోటీసులు జారీ చేసినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. పోలీసులు అరెస్టు చేస్తే పూడ్చుకోలేని నష్టం జరుగుతుంది. నా పిటిషన్‌పై నిర్ణయం వెల్లడించేంతవరకు మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వండి' అని పిటిషన్‌లో అభ్యర్థించారు. తనను బెదిరించి, భయపెట్టి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని వాటాలను బలవంతంగా అరబిందోకు బదలాయింపు చేశారని కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కేవీఆర్ గ్రూపులకు చెందిన కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 2న మంగళగిరి సీఐడీ పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఏ-1గా వై విక్రాంత్‌రెడ్డి, ఏ-2గా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఏ-3గా శరత్‌చంద్రారెడ్డి, ఏ-4గా పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీ, ఏ-5గా అరబిందో రియాల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లను చేర్చారు.



మిర్చియార్డుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, మార్కెటింగ్ ఉన్నతాధికారులు

జగన్... నీకు సిగ్గుందా?

- నీ హయాంలో వ్యవసాయానికి తాళం వేశావు
- రైతులకు 1,600 కోట్లు అప్పు పెట్టిన దుర్మార్గుడివి
- మిర్చియార్డులో భారీ అవినీతిపై విచారణ పూర్తయింది
- నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు: అచ్చెన్న
- మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతులు గడించిన గుంటూరు మిర్చి యార్డులోకి వైసీపీ ప్రభుత్వ హయాంలో సంబంధం లేని వ్యక్తులు చొరబడ్డారు. అడుగడుగునా అవినీతికి పాల్పడి వ్యవస్థని కుప్పకూల్చారు' అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. గురువారం ఉదయం గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మిర్చి యార్డు అవినీతిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజిలెన్స్ విచారణ వేశాం. ఆ శాఖ ఇప్పటికే విచారణ పూర్తి చేసి నివేదిక రూపొందించింది. నివేదిక అందగానే ఎవరెవరు ఈ కుంభకోణంలో భాగస్వామ్యమై ఉన్నారో నిర్ధారించి చర్యలు తీసుకొంటాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పటి సీఎం జగన్ సర్వనాశనం చేశాడు. వ్యవసాయాన్ని తాళంతో బిగించి వ్యవస్థని ఛిన్నాభిన్నం చేశాడు. ఇప్పుడు నానా యాగీ చేస్తూ నంగనాచి మాటలు మాట్లాడుతున్నాడు. రైతుల సమస్యలపై ఆందోళన చేస్తానని చెప్పడానికి నీకు సిగ్గుందా? ఎక్కడికి వస్తావో రా... వ్యవసాయంపై చర్చిద్దాం. మేము పీఎం ఫసల్ బీమాని రైతులందరికీ 3 శాతం చెల్లింపుతోనే అమలు చేస్తున్నాం. తొలిసారిగా మామిడి పంటకు కూడా ఈ బీమా పథకాన్ని వర్తింపు చేస్తున్నాం. ధాన్యం కొనుగోళ్ల మీద అరుస్తున్నావు. నువ్వు ధాన్యం కొని 5 నెలల పాటు చిల్లిగవ్వ కూడా రైతులకు చెల్లించలేదు. రూ.1,600 కోట్ల అప్పు పెట్టిన దుర్మార్గుడివి. మేము ఆ బకాయిలన్నీ చెల్లించి ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాం. 48 గంటల్లో డబ్బులు రైతు ఖాతాలో జమ చేస్తున్నాం. అలానే రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. నీ అవినీతి అమెరికా వరకు వెళ్లింది. అందుకు సిగ్గు పడకుండా... 'నేను చేసింది రాష్ట్రానికి మంచిది. నాకు సన్మానం చేయండి' అని మాట్లాడేవాళ్లతో ఏమి రాజకీయం చేయగలం? ప్రకృతి విపత్తులు ఈ ఏడాది రైతాంగాన్ని ఇబ్బంది పెట్టాయి. తాజాగా ఫెంగల్ తుఫానుతో తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేసి రైతుని ఆదుకొనేందుకు నిర్ణయించాం' అని మంత్రి అచ్చెన్న తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నజీర్ అహ్మద్, గళ్లా మాధవి, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్, కమిషనర్ విజయ సునీత హాజరయ్యారు.

ధాన్యం కొనుగోలులో దళారులొద్దు



రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలి.. 24-48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు

- రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా
- దీపం-2పై మరింత ఫోకస్: మంత్రి నాదెండ్ల

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, రైతులకు అన్నివిధాలుగా అండగా నిలవాలని అధికారులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. మధ్యవర్తుల ప్రమేయం ఉన్నట్లు తేలితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం విశాఖ కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు, విజిలెన్స్, వ్యవసాయ శాఖల అధికారులతో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలన్నారు. కొనుగోలు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగాలని, బుకింగ్ నుంచి కొనుగోలు ముగిసేంత వరకూ ప్రతి విషయం రైతులకు తెలియజేయాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు పూర్తయిన 24 గంటల నుంచి 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ అవుతుందని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇప్పటివరకూ 1.69 లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. ప్రజలకు చేరాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని, అటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచాలని మంత్రి మనోహర్ ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు, విజిలెన్స్ అధికారులతో కూడిన బృందాలు తనిఖీలు చేయాలని సూచించారు. అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేసిన వారిపై 6-ఎ కేసులతోపాటు పీడీ యాక్టు ప్రయోగించాలని ఆదేశించారు. దీపం-2 పథకంపై అధికారులు మరింత ఫోకస్ పెట్టాలన్నారు. గ్యాస్ బుకింగ్, డెలివరీ ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలన్నారు. గ్యాస్ డెలివరీకి గానీ, ఈకేవైసీ చేసేటప్పుడు గానీ ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని, అలాంటి చర్యలకు పాల్పడిన గ్యాస్ ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని మంత్రి ఆదేశించారు.

10.59 లక్షల టన్నుల ధాన్యం సేకరణ

ధాన్యం కొనుగోలుపై అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 37 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 1.51లక్షల మంది రైతుల నుంచి 10.59లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు సీఎంకు వివరించారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకూ రూ.2,331 కోట్లు రైతులకు చెల్లించామని, అందులో రూ.2,202 కోట్లు 24 గంటల్లో, మిగిలిన మొత్తం 48గంటల వ్యవధిలో జమ చేశామని తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ వీరపాండ్యన్, పౌర సరఫరాల సంస్థ ఎండీ మంజీర్‌జిలాని, ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల జేసీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేషన్ మాఫియాపై సీఐడీ విచారణ

- 'బియ్యం' అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- ఇప్పటివరకు 1066 కేసులు: నాదెండ్ల

విశాఖపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు నుంచి బియ్యం తీసుకువెళుతున్న స్టెల్లా నౌకను అణువణువూ తనిఖీ చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. 'ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన తనిఖీల తరువాతే కాకినాడ పోర్టు కేంద్రంగా జరుగుతున్న బియ్యం అక్రమ రవాణాపై స్పష్టత వచ్చింది. సీబీసీఐడీ విచారణకు ఆదేశించాం. మరిన్ని విషయాలు బయటకు వస్తాయి. గత ప్రభుత్వ హయాంలో గడిచిన మూడేళ్లలో 1.31లక్షల టన్నుల బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి అక్రమంగా ఎగుమతి చేశారు. కాకినాడ పోర్టును స్మగ్లింగ్ డెన్‌గా మార్చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై ఇప్పటివరకూ 1066 కేసులు నమోదుచేసి, 729 మందిని అరెస్టు చేశాం. 62 వేల టన్నుల బియ్యాన్ని సీజ్ చేశాం' అని మంత్రి నాదెండ్ల వివరించారు.

వచ్చే ఏడాది కరెంటు మోతలేదు!

- ఈఆర్‌సీకి 2025-26 ఏఆర్‌ఆర్ సమర్పించిన డిస్కంలు
- ఆదాయం రూ.44,185 కోట్లు.. లోటు 14,683 కోట్లు
- ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు 12,927 మిలియన్ యూనిట్లు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ వినియోగదారులపై చార్జీల మోత లేకుండా డిస్కంలు 2025-26 సంవత్సరానికి వార్షికాదాయ నివేదిక (ఏఆర్‌ఆర్)ను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)కి అందజేశాయి. గురువారం సమర్పించిన ఈ రిపోర్టులో విద్యుత్ చార్జీల పెంపును అవి ప్రతిపాదించలేదు. 2025-26లో రూ.58,868.52 కోట్లు కావలసి ఉండగా.. రూ.44,185.28 కోట్ల ఆదాయమే వస్తుందని.. రూ.14,683.24 కోట్ల లోటు ఉంటుందని పేర్కొన్నాయి. లోటు ఉన్నప్పటికీ.. వినియోగదారులపై చార్జీల భారం మోపడం లేదని స్పష్టం చేశాయి. 2024-25లో 73,053 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విక్రయాల కంటే 3.93 శాతం అధికంగా.. 2025-26లో 75,926.22 ఎంయూల విక్రయాలుంటాయని అంచనా వేశాయి. ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు 12,927 మిలియన్ యూనిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపాయి. ఇది గతేడాది సరఫరా చేసిన 11,299.49 ఎంయూ కంటే 14.4 శాతం అధికమని వెల్లడించాయి. ప్రభుత్వం రూ.13,769.85 కోట్ల సబ్సిడీకి ఆమోదించిందని, అయితే రూ.14,683.24 కోట్ల సబ్సిడీ అవసరమని తెలిపాయి. గతంలో విద్యుత్ కొనుగోలు యూనిట్‌కు రూ.5.12 దాకా అయ్యేదని.. ఇప్పుడు రూ.4.80 అవుతోందని పేర్కొన్నాయి. విద్యుత్ ప్రవాహ నష్టాలు 10.03 శాతందాకా ఉన్నట్లు తెలిపాయి.

చార్జీల భారం తగ్గేలా: మంత్రి గొట్టిపాటి

జనంపై చార్జీల భారం తగ్గేలా విద్యుత్ కొనుగోలుకు చర్యలు చేపట్టాలని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో విద్యుత్ సంస్థలు, ఇంధన శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వైసీపీ పాలనలో థర్మల్ విద్యుదుత్పత్తిని బ్యాకింగ్ డౌన్ చేస్తూ.. అధిక ధరలకు బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోలు చేసి.. ఆ భారాన్ని ట్రూఅప్ పేరిట ప్రజలపై మోయలేని భారాన్ని మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఆరు నెలల్లో విద్యుత్ ప్రణాళికలపై దృష్టి సారించాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు సూచించారు. థర్మల్ విద్యుదుత్పత్తి పూర్తిస్థాయిలో ఉండాలన్నారు.



ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉపాధ్యాయులు

ప్రశాంతంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉభయ గోదావరి జిల్లాల్లో 92.62శాతం పోలింగ్

కలెక్టరేట్(కాకినాడ), ఏలూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాల్లో 92.62శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా 16,737మంది ఓటర్లకు గాను 15,502 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏఆర్వో ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని నిత్యం పర్యవేక్షించారు. ఏలూరు జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ వెట్రిసెల్వి.. బ్యాలెట్ బాక్సులకు వేసిన సీళ్లను పరిశీలించారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 9న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. సాయంత్రానికి ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తారు.

14 నుంచి సాగు నీటి సంఘాలకు ఎన్నికలు

- వర్గ, రాజకీయాలకు అతీతంగా ఏకగ్రీవాలు కావాలి: మంత్రి నిమ్మల



అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజోతి): ఈ నెల 14 నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'వ్యవసాయం, రైతాంగమే రాష్ట్రానికి ప్రాణం. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి, చివరి ఎకరం వరకూ సాగు నీరందజేయాలన్నదే లక్ష్యం. అందులో భాగంగానే సాగునీటి సంఘాలను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. సాగునీటి సంఘాలకు మూడు అంచెల్లో ఎన్నికలు జరుగుతాయి. తొలిరోజు సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, రెండో రోజు డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు, మూడో రోజు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నాం. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించాం. సేవా దృక్పథంతో పని చేసే వ్యక్తులు ఈ సంఘాలకు ప్రతి నిధులుగా ఉండడం ఎంతో అవసరం. ఎటువంటి వర్గ, పార్టీ పోరు లేకుండా సాధ్యమైనంత మేర ఏకగ్రీవంగా ప్రతినిధులను ఎన్నుకోవాలని అధికారులను ఆదేశించాం. గత ప్రభుత్వం సాగు నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు విడుదల చేయలేదు. ప్రాజెక్టులన్నింటినీ గాలికి వదిలేసింది' అని మంత్రి నిమ్మల తెలిపారు.

ఏపీఐఐసీ నుంచి ఏపీఐసీడీసీకి భూముల బదిలీ

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఐసీడీసీ) పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఏపీఐఐసీ పరిధిలోని రెండు నోడ్‌ల భూములను ఏపీఐసీడీసీకి బదిలీ చేస్తూ పరిశ్రమల శాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో కొప్పర్తి నోడ్‌కు చెందిన 2595.74 ఎకరాల భూములు ప్రస్తుతం ఏపీఐఐసీ అధీనంలో ఉన్నాయి. వాటిని ఏపీఐసీడీసీకి బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అలాగే హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో ఉన్న ఓర్వకల్లు నోడ్ భూములు 2621.15 ఎకరాలను కూడా ఏపీఐఐసీ నుంచి ఏపీఐసీడీసీకి బదిలీ చేసినట్లు పేర్కొంది. ఈ బదలాయింపు ప్రభుత్వం, ప్రభుత్వ ఎస్పీవీ మధ్య జరిగినందున స్టాంపు డ్యూటీ మినహాయింపు లభిస్తుందని స్పష్టంచేసింది.

నర్సీపట్నంలో వర్రా అరెస్టు

14 రోజుల రిమాండ్.. విశాఖ జైలుకు తరలింపు



నర్సీపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రరెడ్డిని అరెస్టు చేసినట్లు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ గురువారం తెలిపారు. ఆమె అందించిన వివరాల ప్రకారం.. కడప జిల్లాకు చెందిన వర్రా రవీంద్రరెడ్డి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టారంటూ గత నెల 10వ తేదీన జిల్లాలోని నాతవరం పోలీస్ స్టేషన్‌లో లింగంపేట గ్రామానికి చెందిన దేవాడ అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, గుంటూరు జైలులో ఉన్న రవీంద్రరెడ్డిని పీటీ వారంట్‌పై తీసుకువచ్చి అరెస్టు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో వర్రాను విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

పలు శాఖల్లో సెక్షన్ ఆఫీసర్ల బదిలీలు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తోన్న సెక్షన్ అధికారులను ఇతర శాఖలకు బదిలీ చేస్తూ జీఏడీ సర్వీసెస్ కార్యదర్శి పోల భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పరిశ్రమలు, వాణిజ్యం శాఖలో ఎస్ఓలుగా పనిచేస్తున్న వి.నాగేశ్వరరావు, కె.రూపలను వరుసగా రెవెన్యూ, మున్సిపల్ పరిపాలనా శాఖలకు బదిలీ చేశారు. పరిశ్రమల శాఖ సెక్షన్ ఆఫీసర్లు బి.రాధాకుమారిని మున్సిపల్ పరిపాలనా విభాగానికి వి.శ్రీనివాసులును రోడ్లు, భవనాల శాఖకు, పి.రామమోహన్‌ను రవాణా, రోడ్లు, భవనాల శాఖకు మార్చారు. ఆర్.సీహెచ్.వెంకటేశ్వరరావు, వి.శేఖర్‌లను వరుసగా రెవెన్యూ, వ్యవసాయం-సహకార శాఖలకు బదిలీ చేశారు. అదేవిధంగా జలవనరుల శాఖలో ఎస్ఓలుగా పనిచేస్తున్న ఎం.వి.రమణారావు, ఎం.సుధారాణిలను వరుసగా ఈఎఫ్ఎస్ అండ్ టి డిపార్ట్‌మెంట్, పరిశ్రమలు-వాణిజ్య శాఖకు, ఎ.శంకరరావు, కె.లీలావతిలను వ్యవసాయం-సహకారశాఖకు, కె.బాబూరావు, పి.బాలచౌదరయ్య, డి.కృష్ణమోహన్‌లను వరుసగా పరిశ్రమల శాఖ, సాధారణ పరిపాలనా శాఖ, ప్రణాళికా శాఖలకు బదిలీ చేశారు. అదే శాఖలోని జి.లక్ష్మణరావు, వి.రామారావు, జి.సాహిత్యలను పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖకు, ఎల్.కొండారెడ్డి, ఆర్.ప్రసాదరావులను జీఏడీకి, భానుమూర్తి, పి.శ్రీనివాసరావు, పి.జనార్దన్‌రావు, షేక్ హఫీజ్, కె.సురేశ్ చౌదరిలను హోంశాఖ, మున్సిపల్-పట్టణాభివృద్ధి, పరిశ్రమలు-వాణిజ్య శాఖ, టీఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యం-కుటుంబ సంక్షేమ శాఖ పంపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.